గురువారం
17-7-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 296
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

బనకచర్ల... నీటి వివాదాలపై
నిపుణుల కమిటీ

- అమరావతిలో కేఆర్ఎంబీ, హైదరాబాద్‌లో జీఆర్ఎంబీ కార్యాలయాలు
- రిజర్వాయర్ల నుంచి నీటి వినియోగంపై టెలీ మీటర్లు
- తెలుగు రాష్ట్రాల సీఎంల చర్చలు సానుకూలం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బనకచర్ల ప్రాజెక్టుతో సహా కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి నిపుణులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దిల్లీలో బుధవారం జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో సానుకూల వాతావరణంలో చర్చలు సాగాయి. తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాల అంశాలపై చర్చించేందుకు దిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈసందర్భంగా సీఆర్ పాటిల్‌తో పాటు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి పరస్పరం కరచాలనం చేసుకున్నారు. దుశ్శాలువలు, మెమెంటోలతో ఒకరికొకరు గౌరవ ప్రదంగా సత్కరించుకున్నారు. ఈ భేటీకి ముఖ్యమంత్రులతో పాటు ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇరు రాష్ట్రాల సీఎస్‌లు, జలవనరుల శాఖ కార్యదర్శులు, ఇంజినీర్లు హాజరయ్యారు. తొలుత ఈ భేటీలో లేవనెత్తాల్సిన అంశాలు, సాంకేతికంగా ఇవ్వాల్సిన సమాధానాలపై సీఎంలు ఇద్దరూ తమ అధికారిక నివాసాల్లో సుమారు గంటన్నరపాటు సీఎస్‌లు, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానంపై ఏపీ ప్రభుత్వం సింగిల్ పాయింట్ అజెండాను ప్రతిపాదించగా, తెలంగాణ ప్రభుత్వం మొత్తం 13 అంశాలను ఈ సమావేశంలో ప్రతిపాదించింది. బనకచర్లకు ప్రాజెక్టుకు సంబంధించి అనేక సాంకేతిక అంశాలు ముడిపడి ఉన్నందున, ఇరు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఒక ప్రత్యేక కమిటీ వేయాలని నిర్ణయించారు. ఈ కమిటీలో సాంకేతిక నిపుణులు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు ఉభయ రాష్ట్రాలకు సంబంధించిన వారు ఉంటారు. ఈ కమిటీ సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలోనే పనిచేస్తుంది. కాలయాపన లేకుండా వచ్చే సోమవారం లోపునే కమిటీ నియామకం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో బనకచర్లపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరగలేదు. అయితే బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవడానికి, కరువు సీమకు శాశ్వత పరిష్కారం కల్పించడానికి మాత్రమే ఈ ప్రాజెక్టు నిర్మాణ లక్ష్యమని ఏపీ ప్రభుత్వం కేంద్రానికి నివేదిక రూపంలో విన్నవించింది. ఈ సందర్భంగా గోదావరిలో వందేళ్ల సరాసరి ప్రవాహాల గణాంకాలను నివేదికంలో పేర్కొంది. ఏటా 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని తెలిపింది. బనకచర్ల ద్వారా గరిష్ఠంగా 200 టీఎంసీలే తరలిస్తామని వివరించింది. ఈ ప్రాజెక్టు వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం ఉండదని, 11 ఏళ్లుగా తెలంగాణలో కట్టిన ఏ ప్రాజెక్టుకూ అభ్యంతరం చెప్పలేదని పేర్కొంది. దిగువ రాష్ట్రంగా ఏపీ ఇబ్బందులను, సీమ నీటి సమస్యలను తెలంగాణ, కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరింది. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని రిజర్వాయర్ల నుంచి కాలువలకు వెళ్లే అవుట్ ఫ్లో కు సంబంధించి టెలిమీటర్లు ఏర్పాటు చేయాలనే నిర్ణయంపై ఇరు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయి. తెలుగు జాతి సంపద అయిన శ్రీశైలం ప్రాజెక్టును ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాలు కలసి కాపాడుకోవాలని, ఈ ప్రాజెక్టు మరమ్మతుల విషయంలోనూ, ప్లంజ్ పూల్ రక్షణ విషయంలోనూ సిడబ్ల్యూసి సిఫార్సులు, నిపుణుల సూచనలు సత్వరమే పాటించి చర్యలు తీసుకోవాలనే అంశంపై ఇరు రాష్ట్రాలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయి. ఇక మరో ప్రధాన అంశమైన కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ (కేఆర్ఎంబీ) అమరావతి లోను, గోదావరి రివర్ మేనేజ్మెంట్

- మిగతా 2 లో

పేదరికం పట్టని కేంద్రం
కష్టజీవుల సొమ్ము కార్పొరేట్లకు ధారాదత్తం

- ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి
- కమ్యూనిస్టుల అంతం అమిత్‌షా వల్ల కాదు: కూనంనేని సాంబశివరావు

విశాలాంధ్ర - హుస్నాబాద్: కమ్యూనిస్టులను అంతం చేస్తామని అమిత్ షా భ్రమపడుతున్నారని, కానీ అది అతడి వల్ల కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బుధవారం జిల్లా నాల్గవ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ దేశంలో పేదరికం రోజురోజుకు పెరుగుతున్నా కేంద్రం చర్యలు శూన్యమని మండిపడ్డారు. పేదల హక్కుల సాధన కోసం తుపాకులు పట్టుకొని అడవిలోకి వెళ్తే వాళ్ళు దేశద్రోహులైనట్లు మావోయిస్టులను పిట్టల్లా కాల్చి చంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాడు, నేడు కమ్యూనిస్టుల పోరాటం అజరామరమని కొనియాడారు. పాలక ప్రభుత్వాలు కష్టజీవుల సొమ్మును

- మిగతా 2 లో

చైనా పర్యటనకు ప్రధాని మోదీ?

న్యూదిల్లీ: మరికొన్ని రోజుల్లో భారత ప్రధాని నరేంద్రమోదీ చైనా పర్యటనకు వెళ్లనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వచ్చే నెలలో జరిగే ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని హాజరవుతారని తెలుస్తోంది. ఆగస్టు 31-సెప్టెంబరు 1 తేదీల్లో తియాంజిన్ వేదికగా జరిగే షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ శిఖరాగ్ర సదస్సు లో మోదీతో పాటు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇతర దేశాధినేతలు పాల్గొనున్నట్టు సమాచారం. బీజింగ్ పర్యటనలో భాగంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాధినేతలిద్దరూ

- మిగతా 2 లో

అసోం సీఎం జైలుకెళ్లడం ఖాయం

గువహతి: అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. 'ఆయన రాజా అనుకుంటాడు. కానీ త్వరలో జైలుకు వెళ్తాడు' అని అన్నారు. బుధవారం అసోంలోని చాయ్‌గావ్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతోపాటు రాహుల్ గాంధీ, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ... సీఎం హిమంత బిస్వా శర్మను తీవ్రంగా విమర్శించారు. "అసోం

- మిగతా 2 లో

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్...

రాంచీ: జార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు, ఒక సీఆర్‌పిఎఫ్ జవాను మృతి చెందారు. గోమియా పోలీస్ స్టేషన్ పరిధిలో ని బిర్హోర్డెరా అటవీ ప్రాంతంలో ఉదయం 5.30గంటల ప్రాంతంలో భద్రతాదళాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మరణించగా... సీఆర్‌పీఎఫ్ కోబ్రా బెటాలియన్‌కు చెంది న ఒక జవాన్ కూడా మృతిచెంది నట్లు బొకారో జోన్ ఐజీ తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ముమ్మరంగా సోదాలు కొనసాగుతున్నాయన్నారు.

విద్యార్థిని మృతిపై నిరసన వెల్లువ

- ఒడిశాలో బీజేడీ ఆందోళనలు హింసాత్మకం
- బాష్పవాయు గోళాలు... జలఫిరంగుల ప్రయోగం
- ఇద్దరు మాజీ మంత్రులు సహా బీజేడీ నాయకులకు గాయాలు
- సీఎం మాఝీ... విద్యా మంత్రి రాజీనామాకు డిమాండ్

భువనేశ్వర్: బీఈడీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఒడిశాలో నిరసనలు మిన్నంటాయి. బుధవారం భువనేశ్వర్‌లో బీజేడీ కార్యకర్తలు చేపట్టిన నిరసన ప్రదర్శనలో పోలీసులతో జరిగిన ఘర్షణలో ఇద్దరు మాజీ మంత్రులు సహా అనేక మంది బీజేడీ నాయకులు, కార్యకర్తలు గాయపడ్డారు. రాష్ట్ర సచివాలయం, లోక్ సేవా భవన్ ముట్టడికి యత్నించిన బీజేడీ కార్యకర్తలు, నాయకులను పీఎంజీ స్క్వేర్ సమీపంలో పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి హింసాత్మకంగా మారింది. నిరసనకారులు భద్రతా సిబ్బందితో ఘర్షణ పడటంతో పోలీసులు జనాన్ని చెదరగొట్టడానికి జల ఫిరంగులు, భాష్పవాయుగోళాలను ప్రయోగించారని, బీజేడీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని నిరసన స్థలం నుంచి తరలించినట్లు ఒక పోలీసు అధికారి తెలిపారు. ఘర్షణల్లో గాయపడిన వారిలో మాజీ మంత్రులు ప్రణబ్ ప్రకాష్ దాస్, ప్రీతి రంజన్ ఘరాయ్ ఉన్నారు. ఘరాయ్‌ను మొదట క్యాపిటల్ ఆసుపత్రికి తీసుకెళ్లి, తరువాత భువనేశ్వర్‌లోని ఉత్కల్ ఆసుపత్రిలోని ఐసీయూకు తరలించినట్లు బీజేడీ కార్యకర్త తెలిపారు. దాస్‌ను చికిత్స కోసం ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. బాలసోర్ కళాశాల విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేడీ కార్యకర్తలు ఒడిశా అసెంబ్లీ వెలుపల పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. ఫకీర్ మోహన్ (అటానమస్) కళాశాలలో రెండవ సంవత్సరం బీఈడీ చదువుతున్న విద్యార్థిని, గత శనివారం క్యాంపస్‌లో తనకు తాను పెట్రోలు పోసుకుని నిప్పంటించుకోవడం... తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి ఎయిమ్స్-భువనేశ్వర్‌లో మృతి చెందిన సంగతి విదితమే. ఈ ఘటనపై రాష్ట్రంలోని అధికార బీజేపీ ప్రభుత్వాన్ని బీజేడీ దుయ్యబట్టింది. బీజేడీ ఉపాధ్యక్షుడు దేవి ప్రసాద్ మిశ్రా, మరో నేత స్నేహాంగిని చురియా మాట్లాడుతూ... 'రాష్ట్రంలో న్యాయం కోరుతూ ఒక బాలిక మరణించింది. ముఖ్యమంత్రి, ఆయన కేబినెట్ మంత్రులకు తమ రాష్ట్రంలో ఏం జరుగుతోందో తెలియదు. ముఖ్యమంత్రి, ఎంపీ, ఇతరులు రాజీనామా చేయాలి. ఈ కేసుపై న్యాయ విచారణ జరపాలి. న్యాయం జరిగే వరకు మేము మా నిరసనను కొనసాగిస్తాము' అని స్పష్టం చేశారు. ఈ సమస్య రాజకీయాలకు అతీతంగా, ప్రాథమిక మానవ హక్కులకు

- మిగతా 2 లో

కృష్ణా ట్రిబ్యునల్ గడువు ఏడాది పొడిగింపు

న్యూదిల్లీ : కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ గడువును మరోసారి పొడిగించారు. ఏడాది పాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్ మధ్య కృష్ణా జలాల పంపిణీ కోసం 2004 ఏప్రిల్ 2న ఈ ట్రిబ్యునల్ ఏర్పాటయింది. కృష్ణా నదికి సంబంధించిన దీర్ఘకాల అంతర్రాష్ట్ర జలాల పంపిణీ వివాదానికి సంబంధించి తన తుది నివేదిక, నిర్ణయాన్ని సమర్పించడానికి జులై 31, 2026 వరకు సమయం ఇచ్చింది. జల్ శక్తి మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌లో అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం-1956 ద్వారా ఇవ్వబడిన అధికారాల ప్రకారం ఈ పొడిగింపు జరిగిందని పేర్కొంది. తన పనిని పూర్తి చేయడానికి మరింత సమయం కోరుతూ ట్రిబ్యునల్ చేసిన అధికారిక అభ్యర్థనకు ప్రతిస్పందనగా ఈ పొడిగింపు జరిగింది. ట్రిబ్యునల్ కాలపరిమితిని గతంలో 2024 మార్చి నోటిఫికేషన్ ద్వారా 2025, జులై 31 వరకు పొడిగించారు. కాగా ట్రిబ్యునల్

- మిగతా 2 లో

100 జిల్లాల్లో
'పీఎం ధన్ ధాన్య కృషి'

- 36 పథకాలను ఏకీకృతం చేసే పథకం
- ఏటా రూ.24 వేల కోట్ల వ్యయం
- పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.20వేల కోట్ల పెట్టుబడికి అవకాశం
- శుభాంశు శుక్లాను అభినందిస్తూ తీర్మానానికి ఆమోదం
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

న్యూదిల్లీ: దేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ, పునరుత్పాదక ఇంధన రంగాన్ని బలోపేతం చేసే దిశగా కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం ఆయన నివాసంలో మంత్రివర్గం భేటీ అయింది. పీఎం ధన్ ధాన్య కృషి యోజనను ఆమోదించింది. పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.20 వేల కోట్ల వరకు పెట్టుబడులకు అనుమతి మంజూరు చేసింది. అంతరిక్షంలో 18 రోజులు గడిపి, అనేక ప్రయోగాలు నిర్వహించి భూమికి తిరిగివచ్చిన వ్యోమగామి శుభాంశు శుక్లాను అభినందిస్తూ తీర్మానాన్ని ఆమోదించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఏటా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అచ్చిచ్చీ..ఎందుకలా గెంతుతావ్? అవి నీకు చాలా మంచిచేస్తాయి.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు
- పామాయిల్ సాగుపై రైతులు దృష్టిపెట్టాలి
- చెక్కుల పంపిణీలో మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - పెద్దపల్లి / హైదరాబాద్ : మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. పెద్దపల్లిలో మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సెర్ప్ సీఈవో డి.దివ్య, కలెక్టర్ కోయ హర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగరాజ్ ఠాకూర్‌లతో కలిసి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో వడ్డీ లేని, లోన్ , ప్రమాద చెక్కులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను

- మిగతా 2 లో

'ఆధార్'పై ఆందోళన

- కోట్లమంది మరణించినా... కార్డులు యథాతథం
- కార్డుల జారీ, రద్దులో తీవ్ర అలసత్వం
- ప్రభుత్వ పథకాలపై ప్రభావం

న్యూదిల్లీ: దేశంలో ఏ పథకం పొందాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. బ్యాంకులో ఖతా తెరవాలన్నా, విద్యార్థులు ప్రవేశాలు పొందాలన్నా, పింఛన్లు, ఉద్యోగ నియామకాలు, రేషన్ కార్డులు, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రైతు భరోసా వంటి వాటి అన్నింటికి ఆధార్ కార్డు ఉండాల్సిందే. అలాంటిది అధార్ కార్డుల జారీ, రద్దులో అలసత్వం కనిపిస్తున్నది. 2009లో 'ఆధార్'ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి దేశంలో 142.39 కోట్ల ఆధార్ కార్డులు జారీ అయ్యాయి. మృతుల ఆధార్ నంబర్లు డీయాక్టివేట్ కాకపోవడంతో దేశ ప్రజల్లో ఒకింత ఆందోళన చెలరేగుతోంది. ప్రతి పదేళ్లకు ఆధార్ కార్డును అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఆధార్ కార్డుల జారీ మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు 1.15 కోట్ల కార్డు నంబర్లు మాత్రమే రద్దు చేసినట్లు 'ఉడాయ్' డేటా ద్వారా తెలుస్తోంది. 16 ఏళ్లలో కోట్ల మంది చనిపోయినా నిలిపివేసిన కార్డుల సంఖ్య మాత్రం తక్కువగా ఉన్నట్లు సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తు ద్వారా వెల్లడైంది. 2025 జూన్ నాటికి దేశంలో ఆధార్ కార్డు కలిగివున్న వారి సంఖ్య 142.39 కోట్లుగా ఉంది. ఐక్యరాజ్య సమితి (ఐరాస) జనాభా నిధి ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్‌కి దేశ జనాభా 146.39 కోట్లు. సివిల్ రిజిస్ట్రేషన్

- మిగతా 2 లో

8 లో

మోదీ సర్కారు వైఫల్యం

'డబుల్ ఇంజన్'తో రాష్ట్రానికి ఒరిగిందేమీలేదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఉక్రెయిన్ ప్రధాని డెనిస్ రాజీనామా

కీవ్: ఉక్రెయిన్ ప్రధాని డెనిస్ ష్మిహాల్ (39) రాజీనామా చేశారు. జెలెన్స్కీ ప్రభుత్వంలో పునర్వ్యవస్థీకరణకు ఇది తొలి సూచిక కాగా, అమెరికాలో ఉక్రెయిన్ రాయబారి నియామకానికి అవకాశముంది. ఉక్రెయిన్ ఉప ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా యూలియా స్విరైదెకో ఉన్నారు. ఆమెను ప్రధాని పదవి కోసం జెలెన్స్కీ ఇప్పటికే ప్రతిపాదించారు. అమెరికా, ఉక్రెయిన్ ఖనిజ ఒప్పందం చర్చల్లో యూలియా కీలకంగా వ్యవహరించారు. పశ్చిమ దేశాలతో జరిగిన ఉన్నతస్థాయి చర్చల్లోనూ క్రియాశీల పాత్ర పోషించారు.

అమెరికా బెదిరింపులకు భయపడం: రష్యా

మాస్కో/కీవ్: ఉక్రెయిన్‌కు అమెరికా అన్ని విధాలా అండగా నిలుస్తూ రష్యాకు తీవ్ర హెచ్చరికలు చేసింది. 50 రోజుల్లోగా యుద్ధాన్ని ముగించాలని హెచ్చరించింది. లేకుంటే తీవ్రస్థాయిలో సుంకాలు విధిస్తామని తేల్చిచెప్పింది. రష్యాతో వ్యాపారం చేయొద్దంటూ ఇప్పటికే ప్రపంచ దేశాలకు అమెరికా హెచ్చరికలు చేసింది. దీనిని రష్యా తీవ్రంగా పరిగణించింది.అమెరికాకు తలొగ్గం... బెదిరింపులకు భయపడమంటూ రస్యా తేల్చిచెప్పింది. సుంకాల పేరిట బెదిరించడం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. రష్యా విదేశాంగ శాఖ సహాయ మంత్రి సెర్గీ ర్యాబ్కావ్ స్పందిస్తూ ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో దౌత్య పరిష్కారాన్ని రష్యా కోరుతోందని, ఇందుకోసం సంప్రదింపులకు సిద్ధంగా ఉందని అన్నారు. తమ ప్రతిపాదనకు తగిన స్పందన లభించకపోయినా, దౌత్యపద్ధతుల్లో అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోయినా ప్రత్యేక సైనిక చర్యలు కొనసాగుతాయని సెర్గీ వెల్లడించారు. మాస్కో స్థానాన్ని ఎవరూ కదల్చలేరని చెప్పారు. తమ మాటలను తేలికగా తీసుకోవద్దని వాషింగ్టన్‌కు, నాటోకు స్పష్టంచేశారు. అదే విధంగా ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధ సాయాన్ని ఖండించారు. నాటో దేశాలు శాంతికి కట్టుబడి ఉన్నాయా అన్న సందేశం కలుగుతోందని చురకలు అంటించారు. మరోవైపు ఉక్రెయిన్ కీలక నిర్ణయం తీసుకుంది. పార్లమెంటులో ఓటింగ్ నిర్వహించిన దేశ వార్‌టైమ్ స్టేటస్, సైనిక సమీకరణను మరో 90 రోజులు కొనసాగించాలని నిర్ణయించింది.

100 శాతం సుంకాలు విధిస్తాం

భారత్, చైనా, బ్రెజిల్‌కు నాటో హెచ్చరిక

రష్యాపై ఒత్తిడి పెంచేందుకు అస్త్రంగా 'వాణిజ్యం'

వాషింగ్టన్: రష్యా-ఉక్రెయిన్ మధ్య భీకర పోరు ఏళ్ల తరబడి కొనసాగుతున్నది. అమెరికా అన్ని విధాలుగా ఉక్రెయిన్‌కు సహాయ సహకారాలు అందిస్తున్నది. ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మల్చుకునేందుకు వాణిజ్యాన్ని అస్త్రంగా మార్చింది. రష్యాను ఏకాకి చేసే ప్రయత్నంలో భాగంగా ఆదేశంలో వాణిజ్యం వద్దంటూ ప్రపంచ దేశాలను హెచ్చరిస్తోంది. తమను కాదంటే సుంకాల మోత మోగిపోయిందని బెదిరిస్తోంది. రష్యాతో వాణిజ్యాన్ని కొనసాగిస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ తదితర దేశాలకు నాటో తాజాగా ఒక హెచ్చరిక చేసింది. రష్యాతో చమురు, గ్యాస్ దిగుమతి చేసుకోవడం ఆపకపోతే 100 శాతం సుంకాలు విధిస్తామని నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ హెచ్చరించారు. 'భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలు రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్నాయి. ఇది కొనసాగితే ఆ దేశాలపై 100 శాతం సుంకం విధిస్తాం' అని అన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శాంతి చర్చలకు రాకపోతే పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. శాంతి చర్చలకు పుతిన్ సిద్ధమయ్యేలా ఆయనపై ఒత్తిడి తేవాలని, లేనిపక్షంలో మూడు దేశాలకు సుంకాల రూపంలో దెబ్బలు తప్పవని మార్క్ హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇటీవల రష్యా మిత్ర దేశాలపై అదనపు సుంకాలు విధించనున్నట్లు ప్రకటించారు. శాంతి చర్చలకు రష్యా ముందుకు రావాలని, లేకపోతే ఎగుమతులపైనా 100 శాతం సుంకాలు విధిస్తామని ఆయన బెదిరించారు.

ఇజ్రాయిల్ దాడిలో హమాస్ నాయకుడి మృతి

సహాయ కేంద్రం వద్ద ప్రాణాలు కోల్పోయిన 22 మంది

గాజా: గాజా సిటీలో ఇజ్రాయిల్ సైన్యం విరుచుకుపడుతోంది. తాజా వైమానిక దాడిలో తమ నాయకుడు మహమ్మద్ ఫరాజ్ అల్ ఘోల్‌ను హతమార్చినట్లు హమాస్ ప్రకటించింది. ఉత్తర గాజాలోని జబాలియాతో పాటు గాజా సిటీలోని అనేక ప్రాంతాల్లో ఉన్న వారంతా అక్కడ నుంచి వెళ్లిపోవాలంటే ఇజ్రాయిల్ సైన్యం తాజా ప్రకటన నేపథ్యంలో హమాస్ ప్రకటన రావడం గమనార్హం. మరోవైపు బుధవారం జరిపిన దాడిలో 22 మంది పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయిల్ మద్దతుగల అమెరికా సంస్థ నిర్వహించే సహాయ కేంద్రం వద్ద ఈ ఘటన జరిగింది. మృతుల్లో 11 మంది పిల్లలు ఉన్నట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. గాజా హ్యూమానిటేరియన్ ఫండ్ సమాచారం ప్రకారం తొక్కిసలాట జరిగి 19 మంది చనిపోయారని తెలిసింది. అలాగే, ఖాన్ యూనిస్‌లోని సహాయ కేంద్రం వద్ద హింస జరిగిందని, ఒకరు చనిపోయారని తెలుస్తోంది. ఇదిలావుంటే, గాజాలో మార్చి 18 నుంచి ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో మొత్తం 7,658 మంది పలస్తీనియన్లు మరణించారు. 27,314 మంది గాయపడ్డారు. కాగా, 2023 అక్టోబరు నుంచి లెక్క వేసుకుంటే మృతుల సంఖ్య 58,479కు చేరింది. అలాగే గాయపడిన వారి సంఖ్య 1,39,355గా ఉంది.

విద్యార్థిని మృతిపై నిరసన వెల్లువ

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించినదని నొక్కి చెబుతూ... తమ డిమాండ్లను పరిష్కరించకపోతే తమ ఆందోళనను తీవ్రతరం చేస్తామని బీజేడీ కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు.

బాధితురాలికి తండ్రికి రాహుల్ పరామర్శ

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం బాధితురాలి తండ్రితో మాట్లాడారు. న్యాయంకోసం వారి ప్రయత్నాలలో సంఘీభావం తెలిపారు. 'ఒడిశాలోని బాలాసోర్‌లో న్యాయం కోసం పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన ధైర్యవంతురాలైన కుమార్తె తండ్రితో మాట్లాడాను. అతని గొంతులో... అతని కుమార్తె బాధ, కలలు, పోరాటాన్ని నేను అనుభవించాను. కాంగ్రెస్, నేను ప్రతి అడుగులోనూ వారితో ఉంటామని అతనికి హామీ ఇచ్చాను' అని రాహుల్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు.

బంద్‌తో బాలసోర్‌లో స్తంభించిన జనజీవనం

విద్యార్థిని మృతికి నిరసనగా బాలాసోర్‌లో బీజేడీ నిర్వహించిన ఎనిమిది గంటల బంద్ విజయవంతమైంది. మార్కెట్లు, పాఠశాలలు, కళాశాలలను స్వచ్ఛందంగా మూసివేశారు. వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో బాలసోర్ జిల్లాలో సాధారణ జీవనం స్తంభించింది. నిరసనకారులు టైర్లు తగలబెట్టి ప్రధాన రహదారులను దిగ్బంధించారు. జలేశ్వర్, బస్తా, సోరో, బలియాపాల్, భోగ్రై అంతటా ప్రదర్శనలు చేశారు. మరోవైపు ఈ కేసుకు సంబంధించి కళాశాల ప్రిన్సిపాల్, నిందితుడైన ప్రొఫెసర్ ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేసినట్లు అధికారులు ధ్రువీకరించారు. అయితే న్యాయ విచారణకు ఆదేశించి విద్యార్థిని కుటుంబానికి న్యాయం జరిగే వరకు నిరసనలు కొనసాగుతాయని బీజేడీ తన వైఖరిని పునరుద్ఘాటించింది.

100 జిల్లాల్లో 'పీఎం ధన్ ధాన్య కృషి'

(మొదటిపేజీ తరువాయి)

రూ.24వేల కోట్ల వ్యయంతో దేశ వ్యాప్తంగా 100 జిల్లాల్లో పీఎం ధన్ ధాన్య కృషి యోజన అమలునకు కేబినెట్ అంగీకరించింది. 2025-26 నుంచి ఆరేళ్లు దీనిని అమలు చేయాలని నిర్ణయించింది. సమావేశంలో కీలక నిర్ణయాలు జరిగినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. పీఎం ధన్ ధాన్య కృషి యోజన ద్వారా ద్వారా 1.70 కోట్ల మంది రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం ఉంటుందని చెప్పారు. ఈ పథకం నీతి ఆయోగ్ 'ఆకాంక్ష జిల్లాల' కార్యక్రమం నుంచి ప్రేరణ పొందిందని, ప్రత్యేకంగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై దృష్టి సారిస్తుందన్నారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, పంట వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించడం, పంచాయతీ, బ్లాక్ స్థాయిలో నిల్వ సౌకర్యాలను పెంచడం, నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచడం వంటి లక్ష్యాలను నిర్దేశిస్తుందన్నారు. ఇది 11 మంత్రిత్వ శాఖల పరిధిలోని 36 పథకాల సమన్వయం ద్వారా అమలవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం కూడా ఉంటుందని అన్నారు. 'తక్కువ ఉత్పాదకత, తక్కువ పంట సైకిల్, తక్కువ రుణ పంపిణీ వంటి మూడు ప్రధాన ప్రమాణాల ఆధారంగా 100 జిల్లాలను ఎంపిక చేస్తారు. ప్రతి రాష్ట్రం నుంచి కనీసం ఒక జిల్లాను చేర్చుకుంటారు. ఇప్పటికే ఉన్న 36 పథకాలను ఇది ఏకీకృతం చేస్తుంది' అని వైష్ణవ్ తెలిపారు. పంట కోత తర్వాత నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుందని, నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపరుస్తుందని, వ్యవసాయ ఉత్పాదకతను పెంచుతుందని చెప్పారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడం, పంటల్లో వైవిధ్యీకరణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పంటకోత తర్వాత గ్రామస్థాయిల్లో దిగుబడులను నిల్వ చేసేందుకు గోదాముల సదుపాయం, నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపరచడం, రుణ లభ్యతను సులభతరం చేయడమే లక్ష్యంగా పీఎం ధన్ ధాన్య కృషి యోజనను రూపొందించారని వైష్ణవ్ వెల్లడించారు. 'ఈ పథకం సమర్థ అమలునకు జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి ధన్-ధాన్య జిల్లాలో ఈ పథకం పురోగతిని 117 పెర్ఫామెన్స్ ఇండికేటర్ల ద్వారా పర్యవేక్షిస్తారు. తద్వారా ఏటా 1.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలిగే అవకాశమున్న'ట్లు వైష్ణవ్ తెలిపారు.

పునరుత్పాదక ఇంధన రంగంలో భారీ పెట్టుబడులు

ఎన్‌టీపీసీ లిమిటెడ్‌కు పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడుల కోసం ప్రస్తుతమున్న పరిమితికి మించి రూ. 20,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టడానికి కేబినెట్ అనుమతి ఇచ్చింది. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలు, జాయింట్ వెంచర్ల ద్వారా ఈ పెట్టుబడి ఉంటుంది. 2032కి 60 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌కు రూ.7వేల కోట్ల పెట్టుబడికి ప్రత్యేక మినహాయింపు లభించింది.ఈ మొత్తాన్ని అది తన పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ ఎన్ఎల్‌సీ ఇండియా రెన్యెవబుల్స్ లిమిటెడ్ ద్వారా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులలో పెట్టుబడి పెడుతుంది.

కృష్ణా ట్రిబ్యునల్ గడువు ఏడాది పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

తన ప్రాథమిక నివేదికను 2010 డిసెంబరులో సమర్పించింది. అయితే రాష్ట్రాలు లేవనెత్తిన సూచనలు, అభ్యంతరాలు తదుపరి విచారణల నేపథ్యంలో గడువు పొడిగించారు. 2014లో ఆంధ్ర ప్రదేశ్ విభజన జరగడం... ఆ తర్వాత కొత్తగా ఏర్పడిన తెలంగాణ కూడా కృష్ణా జలాల వివాదంలో భాగస్వామిగా మారడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. అప్పటి నుంచి వరుస నోటిఫికేషన్ల ద్వారా గడువును అనేక సార్లు పొడిగించింది. తాజా పొడిగింపు కూడా అదే పద్ధతిని కొనసాగిస్తోంది. ప్రభుత్వం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టంలోని సెక్షన్ 5(3) ని ఉటంకిస్తూ... 'ప్రజా ప్రయోజనం కోసం, పార్టీ రాష్ట్రాల ఆందోళనలను పరిష్కరించడానికి' ఎక్కువ సమయం అనుమతించింది.

'ఆధార్'పై ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

సిస్టమ్ (సీఎస్ఆర్) డేటా ప్రకారం 2007-2019 వరకు ఏటా సగటున 83.5 లక్షల మంది మరణించారు. అయితే ఉడాయ్ మాత్రం మరణించినవారిలో 10 శాతం మంది ఆధార్ కార్డులనే డీయాక్టివేట్ చేసింది. మరణించిన వారి ఆధార్ డీయాక్టివేట్ ప్రక్రియ కష్టమని ఆర్టీఐకి ఇచ్చిన సమాధానంలో ఉడాయ్ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసే మరణ ధ్రువీకరణ పత్రాలు, మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చే సమాచారం ఆధారంగా ఈ ప్రక్రియ జరుగుతుందని తెలిపింది. మరణాల ఆధారంగా ఆధార్ నంబర్ల రద్దుకు సంబంధించిన తమ వద్ద ప్రత్యేక డేటా లేదని వెల్లడించింది. కాగా, మరణించిన వారి ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేయకపోవడం, అవి యాక్టివ్‌గా ఉండటంతో వాటి దుర్వినియోగానికి అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఈ ఐడీ లింక్ ఉన్న ఇతర సేవలపైనా ప్రభావం ఉంటుందన్నారు. నకిలీలను నివారించేందుకు మరణాల ధ్రువీకరణ, ఆధార్ డేటా బేస్ నిర్వహణలో సమన్వయం ఉండాలని సూచించారు.

పేదరికం పట్టని కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు బూర్జువ పార్టీలన్నీ మద్దతిస్తున్నాయని విమర్శించారు. కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తే ప్రజల సొమ్మును దోచుకున్న ప్రతి అవినీతి పాలకుడిని జైల్లో పెడతామని హెచ్చరించారు. భారతదేశంలో జరిగే ఏ ఉద్యమానికైనా కమ్యూనిస్టులు ముందు వరుసలో ఉంటారని చెప్పారు. కమ్యూనిస్టులు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.

సీపీఐ పోరాట ఫలితమే గౌరవెల్లి ప్రాజెక్టు: చాడ

హుస్నాబాద్ అంటేనే ఉద్యమాల గడ్డ అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. కూడు, గూడు, గుడ్డ, దున్నేవాడికే భూమి కోసం పోరాడింది కమ్యూనిస్టులేనన్నారు. కేసీఆర్ పదేళ్లు సీఎంగా ఉండి గౌరవెల్లి ప్రాజెక్టు పనులు చేసిండు కానీ, కాలువలు నిర్మించలేదని ఎద్దేవా చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నాటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డిని తీసుకొచ్చి గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్లకు భూమి పూజ చేయించానని చెప్పారు. నాటి కమ్యూనిస్టుల పోరాటం ఫలితంగానే హుస్నాబాద్ ప్రాంతానికి సాగునీరు వచ్చిందన్నారు. కర్రెగుట్టలను చుట్టుముట్టి మావోయిస్టులను చిత్రహింసలు పెట్టి చంపేయడం అప్రజాస్వామికమన్నారు. వందేళ్ల చరిత్ర ఉన్న కమ్యూనిస్టు పార్టీని అంతం చేయడం ఎవరితరం కాదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడిపె మల్లేశ్, అక్కన్నపేట మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, ఏఐవైఎఫ్ నాయకులు జనగాం జనగాం రాజ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకుల జేరిపోతుల జనార్ధన్, పలువురు సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బనకచర్ల... నీటి వివాదాలపై నిపుణుల కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

బోర్డ్(జీఆర్ఎంబీ) హైదరాబాదులో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 13 అంశాలు

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకానికి అనుమతులు ఇవ్వాలని, శ్రీశైలం నుంచి వేరే బేసిన్‌కి ఆంధ్రప్రదేశ్ నీటి తరలింపు పనులను వెంటనే ఆపేయాలని, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రారంభించిన ప్రాజెక్టులకు సహకరించేలా కృష్ణా ట్రిబ్యునల్‌లో మద్దతుగా వాదించేలా ఏపీని ఒప్పించాలని, కృష్ణానదీ జలాలను వేరే బేసిన్‌కు తరలించకుండా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చర్యలు తీసుకునేలా ఆదేశించాలని, కృష్ణా జలాలను అక్రమ తరలింపును అడ్డుకునేందుకు టెలిమెట్రీలను ఏర్పాటు చేసేందుకు ఏపీ అంగీకరించాలని తెలంగాణ కోరింది. అలాగే తుంగభద్ర బోర్డు నీటి తరలింపుపై చర్చించాలని, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై ఎన్జీటీ ఉత్తర్వులను అమలు చేసే విధంగా కేంద్ర జలశక్తి శాఖ చర్యలు తీసుకుని, ఈ పథకంపై చట్టపరంగానే ముందుకు వెళ్లాలని సూచించింది. శ్రీశైలం కుడి కాలువ ద్వారా ఎక్కువగా నీటి తరలింపును నియంత్రించాలని, శ్రీశైలం ప్రాజెక్టులో కొత్త ప్రాజెక్టులు హంద్రీనీవా, వెలిగొండ, గురు రాఘవేంద్ర నిర్మాణాలను ఆపాలని, నీటి తరలింపు ద్వారా విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలుగుతున్నందున దీనిని అడ్డుకోవాలని కోరింది. పోలవరం ప్రాజెక్టు తరహాలోనే ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని, ఇచ్చంపల్లి నుంచి కావేరికి గోదావరి జలాల తరలింపుకు మేము సిద్ధమని, అందులో 200 టీఎంసీల నీటిని వాడుకునేందుకు, సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని తెలంగాణ విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఏఐబీపీ కింద నిధులు ఇవ్వాలని, మహారాష్ట్ర ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వమే చర్చలు జరిపి తుమ్మిడి హట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి సహకరించాలని కోరింది. మొత్తానికి రాష్ట్రాలు వేరైనా, పార్టీలు వేరైనా తెలుగుజాతి ఒకటేనన్న స్నేహపూర్వక వాతావరణంలో ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల ఢిల్లీ సమావేశం జరగటం గొప్ప శుభ పరిణామంగా జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. సమావేశం వివరాలను ఆయన మీడియాకు వివరించారు.

కేసీఆర్ తప్పులను సరిచేస్తున్నాం : సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ హక్కులను కేసీఆర్ గతంలో ఏపీకి ధారాదత్తం చేయడంతో, ఆయన చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసమే ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర ప్రభుత్వం సమావేశం నిర్వహించిందని వెల్లడించారు. ఈ భేటీలో కేంద్ర ప్రభుత్వం కేవలం నిర్వాహక పాత్రే పోషించిందని, కేంద్రం ఎవరివైపూ మాట్లాడలేదని తెలిపారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర జలశక్తిశాఖ నిర్వహించిన సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ భేటీలో ఏపీ ప్రభుత్వం నుంచి గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కడతామన్న ప్రతిపాదన చర్చకు రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అజెండాలో వారు కడతామనే ప్రతిపాదనే చర్చకు రానప్పుడు ఆపాలన్న చర్చే ఉండదన్నారు. ఇది అపెక్స్ కమిటీ భేటీ కాదని చెప్పారు. అనుమానించుకుంటూ పోతే ముందుకు సాగలేం. సమస్యలను పరిష్కరించుకునేందుకే ఉన్నాం.. గొడవలు పెట్టుకునేందుకు కాదు. ఇరు రాష్ట్రాలు గొడవలు పెట్టుకోవాలని కొందరు చూస్తున్నారు. వివాదాలు లేకుండా సమస్యలను పరిష్కరించుకోవడమే మా అజెండా అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

అసోం సీఎం జైలుకెళ్లడం ఖాయం

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి తనను 'రాజా' అని అనుకుంటున్నారు. కానీ త్వరలోనే ఆయన జైలులో ఉంటారు" అని అన్నారు. రాష్ట్రంలో అవినీతికి సీఎం, ఆయన కుటుంబాన్ని ప్రజలు బాధ్యులుగా చేస్తారని తెలిపారు. 'కాంగ్రెస్ ఆయనను జైలులో పెట్టదు. ప్రజలే ఆయనను జైలులో పెడతారు' అని వ్యాఖ్యానించారు. కాగా, రాహుల్ గాంధీపై సీఎం హిమంత బిస్వా శర్మ ఎదురుదాడి చేశారు. ఆయన గతంలో కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేశారని చెప్పారు. అయితే దేశవ్యాప్తంగా అనేక క్రిమినల్ కేసులు నమోదైన రాహుల్ గాంధీ బెయిల్‌పై బయట ఉన్న సంగతి మరిచిపోయారని ఎద్దేవా చేశారు.

చైనా పర్యటనకు ప్రధాని మోదీ?

(మొదటిపేజీ తరువాయి)

గతేడాది అక్టోబరులో రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా ముఖాముఖీ సమావేశమైన సంగతి తెలిసిందే. 2020 తర్వాత మోదీ చైనాకు వెళ్లలేదు. 2015లో బీజింగ్‌కు వెళ్లిన భారత ప్రధాని.. ఇప్పటివరకు ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. అయితే, ఐదేళ్ల క్రితం తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరుదేశాల సైనికుల మధ్య ఘర్షణతో సంబంధాలు దెబ్బతిన్నాయి. వీటిని పునరుద్ధరించేందుకు ఇప్పుడు చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చైనాలో పర్యటించి జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో ఇటీవలి పరిణామాల గురించి చర్చించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీకి అద్దె బస్సులు, పెట్రోల్ పంప్, ధాన్యం కొనుగోళ్లు, రైస్ మిల్ నిర్వహణ తదితర అనేక వ్యాపారాలను అప్పజెప్పినట్టు తెలిపారు. అర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నట్టు చెప్పారు. ఏడాదికి రూ.20 వేల కోట్లు మహిళలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు వడ్డీ లేని రుణాలు అందిస్తామని పేర్కొన్నారు. 93 లక్షల పేద కుటుంబాలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, రూ.500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని వివరించారు. 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్లు జమ చేశామని అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేల చొప్పున రూ.తొమ్మిదివేల కోట్లు జమ చేశామన్నారు. రైతు బీమా కు రూ.మూడువేల కోట్లు ఇచ్చామన్నారు. పామాయిల్‌ను పెద్దపెల్లి జిల్లాలో విస్తారంగా పండించాలని, ఎకరానికి నాలుగేళ్లలో రూ. 51 వేలు సబ్సిడీ అందిస్తామని అన్నారు. తిరుమలయ కంపెనీ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మిస్తుందని అన్నారు. నెల రోజులలో సిద్దిపేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాలకు దాదాపు రూ. 26 వేల కోట్లు బ్యాంక్ లింకేజ్ రుణాలు పంపిణీ చేశామని అన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, పాడి పశువుల పెంపకం, ఇందిరా శక్తి క్యాంటీన్, విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టడం వంటి అనేక మార్గాలను అన్వేషిస్తున్నామని అన్నారు. మంథని కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గోదావరి, కృష్ణా నది జలాలు పూర్తి స్థాయిలో వినియోగించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. సీతక్క మాట్లాడుతూ దివ్యాంగ సంఘం ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 67 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులు ఐక్యంగా ఉండాలని అన్నారు. సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు అందిస్తున్నామని వివరించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో నేడు నాలుగు మహిళ సభ్యుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశామన్నారు. 60 సంవత్సరాల నిండిన వారిని కూడా మహిళా సంఘాలలో చేర్చాలని, 15 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళ సంఘంలో ఉండేలా చూడాలని అన్నారు. దసరా, దీపావళి పండుగకు ప్రభుత్వం ఉచితంగా చీరల పంపిణీ కోసం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇప్ప నూనెతో లడ్డు తయారు చేసి పంపిణీ చేస్తే ప్రధాని మోదీ సైతం మనకి బాత్‌లో పొగిడారని గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లాలో మహిళా సంఘాలు డ్రోన్ వ్యాపారం కూడా చేస్తున్నారని చెప్పారు. అదనపు కలెక్టర్ లు పి.వేణు, జె.అరుణ శ్రీ, రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్, జెడ్పీ సీఈవో నరేందర్, డీఆర్డీఓ ఎం. కాళిందిని, డీపీఓ వీర బుచ్చయ్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

తప్పుడు పనులు చేసిన వారు అమాయకులా?: వర్ల రామయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మద్యం కుంభకోణంలో 'సిట్ దెబ్బకు జగన్ అవినీతి ముఠా అబ్బా' అంటోంది... సిట్ విచారణ ముమ్మరం చేయడంతో జగన్ డైవర్షన్ పాలిటిక్స్‌కు దిగాడు... ఈ మద్యం కుంభకోణంలో అనుమానితులు ఎంతటివారు ఉన్నా వారి పాస్‌పోర్టులను కోర్టు అనుమతితో వెంటనే సిట్ సీజ్ చేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తప్పుడు పనులు చేసిన వారు అమాయకులు ఎలా అవుతారని ప్రశ్నించారు. గత వైసీపీ పాలనలో మద్యం స్కామ్‌లో రూ.3,500 కోట్లకు పైగా కొట్టేసి ఆ డబ్బును దుబాయ్‌కి తరలించారని సిట్ దర్యాప్తులో తెలుస్తోందన్నారు. కేంద్రం సహకారంతో దుబాయ్‌లో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి ఈ అవినీతి దోషులను వెంటనే పట్టుకోవాలన్నారు. మిథున్ రెడ్డి, చెవిరెడ్డి, కసిరెడ్డి లాంటి వారు వాళ్ల నాయకుడికి తెలియకుండా ఇన్ని కోట్ల అవినీతి చేస్తారా? అసలు లబ్ధిదారు ఎవరో బయటపెట్టి వారిని సిట్ కటకటాల్లోకి నెట్టాలి... ఈలోపు వారి పాస్ పోర్టులను స్వాధీనపరుచుకొని... ఈ అవినీతి పిట్టలు విదేశాలకు ఎగిరిపోకుండా చూడాలన్నారు. వైసీపీ హయాంలో తప్పు చేసిన పోలీసు అధికారులకు చట్టబద్ధంగా శిక్ష తప్పదన్నారు. మిథున్ రెడ్డి ఇప్పుడు ఎక్కడ ఉన్నాడని, ఒక ఎంపీ మారువేషంలో కలుగుల్లో దాక్కొవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు.

చడ్డీ బనియన్ గ్యాంగ్‌ను సహించం

మహారాష్ట్ర అసెంబ్లీ వద్ద విపక్షాల 'లుంగీ' నిరసన

ముంబై: మహారాష్ట్రలో వినూత్న నిరసన జరిగింది. ప్రతిపక్షాలకు చెందిన ఎమ్మెల్యేలు బుధవారం అసెంబ్లీ వద్ద లుంగీ, బనియన్లు ధరించి నిరసన తెలిపారు. క్యాంటీన్ మేనేజర్‌పై దాడి చేసిన ఎమ్మెల్యే తీరును ఖండించారు. ఆయనపై చర్యలకు డిమాండ్ చేశారు. గత మంగళవారం లుంగీ, బనియన్‌తో ఉన్న ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్... క్యాంటీన్ మేనేజర్‌పై దాడి చేశారు. ఆహార నాణ్యతపై ఆరోపణలు చేశారు. పరిస్థితిలో మార్పు రాకపోతే మళ్లీ ఇలాగే స్పందిస్తానని హెచ్చరించారు. ఈ వీడియో క్లిప్ వైరలైంది. దీంతో ఆయనపై కేసు నమోదైంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో ప్రతిపక్ష సభ్యులు బుధవారం ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ తీరును ఖండిస్తూ లుంగీలు, బనియన్లు ధరించి వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. గైక్వాడ్ ప్రవర్తన ప్రజా ప్రతినిధికి తగనిదన్నారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సమాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. నిరసనలో ఎమ్మెల్సీ అంబాదాస్ దాన్వే, ఎన్‌సీపీ (ఎస్‌పీ) జితేంద్ర అవద్, శివసేన (యూబీటీ) నాయకుడు సచిన్ అహిర్ తదితరులు పాల్గొన్నారు. బనియన్లు ధరించి, లుంగీలు కట్టుకొని, తువాళ్లు చుట్టుకొని నిరసన తెలిపారు. రాష్ట్రంలో గూండా రాజ్ సాగుతోందని ప్లకార్డులు ప్రదర్శించారు. 'చడ్డీ బనియన్ గ్యాంగ్‌ను ఖండిస్తున్నాం' అని నినాదాలు ఇచ్చారు. ఇటువంటి దుష్ప్రవర్తను రాష్ట్ర ప్రభుత్వం సమర్థిస్తున్నదని ఈ ఘటన స్పష్టం చేస్తుందని అంబాదాస్ దాన్వే వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే తీరు రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చిందని సచిన్ అహిర్ విమర్శించారు. ఇది చేతల ప్రభుత్వం కాదు మాటల ప్రభుత్వమని దుయ్యబట్టారు. ఏక్‌నాథ్ షిండే కేవలం ప్రకటనలకు పరిమితమన్నారు. ఆయన ప్రకటనలు వార్తలకే పరిమితమని వ్యాఖ్యానించారు.

'ఆకాశ్ ప్రైమ్' పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన గగనతల రక్షణ వ్యవస్థ 'ఆకాశ్ ప్రైమ్' పరీక్ష విజయవంతమైంది. లదాఖ్ సెక్టార్‌లో 15వేల అడుగుల ఎత్తులో ఈ రక్షణ వ్యవస్థను డీఆర్డీవోతో కలిసి భారత సైన్యం పరీక్షించింది. వేగంగా కదిలే లక్ష్యాలపై 'ఆకాశ్' దాడి చేసింది. ఉపరితలం నుంచి గగనతలానికి క్షిపణులు చాలా ఎత్తులో ఉన్న సమయంలోనూ లక్ష్యాన్ని ధ్వంసం చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ సైన్యం, చైనా విమానాలు, టర్కీ డ్రోన్‌లతో చేసిన వైమానిక దాడులను అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ బాగా పనిచేసిందని రక్షణ అధికా రులు తెలిపారు. ఆకాశ్ ప్రైమ్ అనేది డీఆర్డీవో రూపొందించిన అధునాతనమై, స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన స్మాల్ రేంజ్ సర్ఫేస్ టూ ఎయిర్ మిస్సైల్ వ్యవస్థ. వైమానిక దాడుల నుంచి కీలక ప్రాంతాల రక్షణకు రూపొందించింది. ఆకాశ్ రక్షణ వ్యవస్థ కంటే మెరుగైన కచ్చితత్వం కోసం యాక్టివ్ రేడియో ఫ్రీక్వెన్సీ సీకర్‌తో ఆకాశ్ ప్రైమ్ రూపొందింది. ఆకాశ్ ప్రైమ్ సెప్టెంబర్ 2021లో ఒడిశాలోని చాందీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో తొలిసారిగా పరీక్షించగా, శత్రు విమానాలను అనుకరించే మానవరహిత వైమానిక లక్ష్యాన్ని విజయవంతంగా ధ్వంసం చేసింది.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానం ప్రకారం సంక్షేమ అభివృద్ధి పనులు చేసుకుంటూ పోతున్నామని తమ కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని పక్కా ప్రజాలకు మేలు చేసే చేతల ప్రభుత్వమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చటమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని చెప్పారు. అందులో భాగంగానే మహిళ స్వయం శక్తి సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామన్నారు. జిల్లాలోని అశ్వరావుపేట నియోజకవర్గ పరిధిలో గల మండల కేంద్రం దమ్మపేట గ్రామంలోని గిరిజన జూనియర్ కళాశాల మైదానం లో బుధవారం ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం నుండి సాయంత్రం వరకు అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో అన్నపురెడ్డిపల్లి, అశ్వరావుపేట, దమ్మపేట, చంద్రుగొండ, ములకలపల్లి మండలాల మహిళా స్వయం శక్తి సంఘాలకు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభకు మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, మహిళా శిశు సంక్షేమ, వయోవృద్ధుల శాఖ అధికారిణి స్వర్ణలత లేనినా నియోజకవర్గం పరిధిలో మహిళా స్వయం శక్తి సంఘాలు, అంగన్వాడి కేంద్రాల ద్వారా మహిళల అభ్యున్నతకి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు మహిళలకు అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించారు. వడ్డీ లేని రుణాలు తో పాటు, మహిళల కోసం ప్రత్యేకంగా తీసుకువచ్చిన బీమా భద్రత పథకాలు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సబ్సిడీ బియ్యం వంటి పథకాలు నిజమైన సంక్షేమ పాలనకు నిదర్శనమని ఆయన వివరించారు. 8 లక్షల కోట్ల పైబడి అప్పు తెచ్చి తమకు తమ భజంగ పరులకు టోకుగా లభించే కమిషన్ల కోసం కాళేశ్వరం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టులు అర్ధాంతరంగా నిర్మించి దోచుకున్నారని విమర్శించారు. పైగా తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో అద్భుతాలు సృష్టించామని కేసీఆర్ గొప్పలు చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు. కెసిఆర్ చేపట్టిన గొప్ప ప్రాజెక్టులు ఏ పేదోడికి ఉపయోగపడలేదని స్పష్టం చేశారు. పదేళ్ల చేతిలో అవకాశము నుండి లక్షల కోట్లు అప్పులు తెచ్చినప్పటికీ కొత్త ఫ్యాక్టరీలు కర్మాగారాలు నిర్మించలేకపోయారని, పేదల జీవితాల్లో ఏమాత్రం అభ్యున్నతి చేయ లేకపోయారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకూ రూ. 865 కోట్లు పావల వడ్డీ కింద మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేశామని మంత్రి వివరించారు. అదేవిధంగా, మహిళా సభ్యుల బీమా పథకాన్ని పునరుద్ధరించి, సహజ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షల బీమా భద్రత కల్పించినట్లు చెప్పారు. పేదలకు ఇళ్ల నిర్మాణం ప్రధాన ప్రాధాన్యతగా తీసుకున్న ప్రభుత్వం మొదటి విడతలో అశ్వరావుపేట నియోజకవర్గానికి 4,500 ఇళ్లను మంజూరు చేసామన్నారు. రాబోయే మూడున్నర సంవత్సరాల్లో రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగుతామని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి తెల్ల రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గిరిజన ప్రాంతాల్లో తాటాకు ఇల్లు ఉండే ప్రతి గ్రామాన్ని ప్రత్యక్షంగా చూసి పేదవాడి బాధలు ఆవేదనను తీర్చే విధంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం అశ్వరావుపేట నియోజకవర్గం పరిధిలోని 219 మహిళా స్వయం శక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు మొత్తం రూ. 21.5 కోట్లు, 3255 స్వయం శక్తి సంఘాలకు వడ్డీ లేని రుణాల క్రింద రూ. 3.23 కోట్లు, రుణబీమా కింద 9 స్వయం శక్తి సంఘాలకు ఆరు లక్షల 88 వేల చెక్కులను మంత్రి చేతుల మీదుగా అందించారు. నియోజకవర్గ పరిధిలోని నూతనంగా మంజూరైన కొత్త రేషన్ కార్డులు 1393 మంత్రి లబ్దిదారులకు అందజేశారు. ఇరిగేషన్ డెవలప్మెంట్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీవో మధు, డీఎస్ఓ రుక్మిణి, దమ్మపేట తాసిల్దార్ భగవాన్ రెడ్డి, మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలు తెలిసిన ఎమ్మెల్యే కూనంనేని : సాబీర్ పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కొత్తగూడెం నియోజకవర్గం ప్రజల అవసరాలు, వివిధ బాధలు, సమస్యలు తెలిసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆమేరకు అడుగులు వేస్తూ అన్ని గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా అన్నారు. చుంచుపల్లి మండలంలోని పెనుబల్లి గ్రామ శాఖ మహాసభ బుధవారం ఆ గ్రామంలో ఉత్సహంగా జరిగింది. మహాసభకు ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. పెనుబల్లి గ్రామాన్ని ముంపుబారిన పడకుండా బ్రిడ్జి నిర్మాణం కోసం కూనంనేని కృషి చేసి నిధులు మంజూరు చేయించారని గుర్తు చేసారు. ఈ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి పెదలందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించారని తెలిపారు. పెనుబల్లి గ్రామానికి సీపీఐ పార్టీగా తాము ఎప్పటికి అండగా ఉంటామని సాబీర్ హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, పట్టణ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, మాజీ సర్పంచి రెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కుదునూరు ఆర్వోఎఫ్ఆర్ భూముల్లో 145 సెక్షన్ ఉల్లంఘన

విశాలాంధ్ర - చర్ల : కుదునూరు ఆర్వోఎఫ్ఆర్ భూముల విషయంలో 145 సెక్షన్ ఉల్లంఘన జరుగుతుందని గోండ్వాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ ఆరోపించారు. ఈ ప్రాంత పోడు భూముల బాధితుల తరపున చర్ల మండల తహసీల్దార్‌కు ఆయన బుధవారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు షెడ్యూల్ ఏరియాలో కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం అటవీ హక్కుల నియమ నిబంధనలు ఆదివాసీలకు వర్తిస్తాయా లేదా అనేది ఐటీడీఏ పీవో తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ పోడు భూముల సమస్యలపై 2018లో అమాయక గిరిజనుడైన బుట్టారి రాఘవయ్యను అతికిరాతకంగా హత్య చేసిన సంఘటనలున్నాయని చెప్పారు. హత్య చేసిన గిరిజనేతరులకు కొంతమంది నాయకులు సపోర్టు చేయడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఏ పార్టీ నాయకులైన ఏజెన్సీ ప్రాంతాల షెడ్యూల్ చట్టాల ప్రకారంగా మాట్లాడాలని ఆయన స్పష్టం చేసారు. అంతేగాని ఆదివాసులను అన్యాయం చేసే విధంగా మాట్లాడితే సహించేది లేదని తెలిపారు. సీఆర్పీసీ 145 సెక్షన్‌ను ఉల్లంఘిస్తున్న గిరిజనేతరులపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ పోడు సమస్యను అధికారులు ఇంకా ఎన్నేళ్లుగా జటిలం చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి సమస్యను సత్వరం పరిష్కారం చేయకపోతే ఆదివాసీలు ఉద్యమిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇర్ప ప్రకాష్, పూనెం వరప్రసాద్, కారం సుధ, కారం లక్ష్మి, తెల్లం గంగమ్మ, కారం విజయభారతి, సున్నం భవాని తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి గ్రంథాలయాలు ఎంతో దోహదం

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: విజ్ఞానవంతమైన సమాజానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో (ఎన్ ఐ సి) జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విజ్ఞానవంతమైన సమాజానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని, గ్రంథాలయాల అభివృద్ధి, గ్రంథాలయ పన్నుపై ఆధారపడి ఉంది కాబట్టి, జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వసూలు చేసినటువంటి గ్రంథాలయ పన్ను ఎప్పటికప్పుడు, జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించి, జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి దోహదపడాలని అన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల అభివృద్ధి కోసం సహకరించి, విజ్ఞాన వంతమైన, సమాజం కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత, మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్ ,మరిపెడ మున్సిపల్ కమిషనర్ విజయ్ ఆనంద్, డోర్నకల్ మున్సిపల్ కమిషనర్ నిరంజన్, తొర్రూరు మున్సిపల్ కమిషనర్. వి.శ్యాంసుందర్, జిల్లా ఆడిట్ అధికారి మాన్వి జగన్, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ లావణ్య, సీనియర్ ఆడిటర్ సంపత్, కే దేవేందర్, రుద్రారపు వీరేందర్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవంలో 4.1 కిలోల నవజాత శిశువు జననం

విశాలాంధ్ర బ్యూరో - నాగర్ కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో బుధవారం ఖమ్మం జిల్లాకు చెందిన ప్రియాంక కు పురిటి నొప్పులు రావడంతో ఆసుపత్రికి వచ్చారు. ఆమెకు స్త్రీ వైద్య నిపుణులు సంబంధిత నర్సింగ్ సిబ్బంది చికిత్సలు అందించగా మొదటి ప్రసవంలో 4.1 కిలోల బరువు గల నవజాత శిశువు జన్మించింది. ప్రసవానంతరం తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సాధారణ ప్రసవంలో అధిక బరువు గల శిశువు జన్మించడం తో గైనకాలజీ వైద్యులను సిబ్బందిని మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ టి ఉషారాణి అభినందించారు.అనంతరం శిశువును తల్లికి అప్పగించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ప్రతిరోజు 12 నుండి 15 ప్రసవాలు జరుగుతున్నట్లు తెలిపారు. గర్భిణీలకు స్త్రీ వైద్య నిపుణులు ప్రత్యేకంగా సోమవారం నుండి శనివారం వరకు గది నెంబర్ 21 లో ప్రతిరోజు సాధారణ పరీక్షలు జరుపుతున్నారన్నారు. ఇటీవల గర్భవతులకు స్కానింగ్ సౌకర్యం వసతి ఏర్పాటు చేశామని అన్నారు. నాగర్‌కర్నూల్ జనరల్ ప్రభుత్వ సాధన ఆసుపత్రిలో ప్రతిరోజు 12 నుండి 15 ప్రసవాలు జరుగుతున్నాయని, గైనకాలజి వైద్యులను సిబ్బందిని మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ టి.ఉషారాణి. అభినందించారు. గర్భిణీలకు తెలంగాణ డయాగ్నస్టిక్ ద్వారా అన్ని రకాల మూత్ర, రక్త పరీక్షలు వారికి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన ప్రతి గర్భిణి ఆసుపత్రిలోనే సుఖప్రసవం జరుపుకోవాలని ఆమె సూచించారు. గర్భవతులకు సహకారిగా హెల్ప్ డెస్క్ సేవలను పొందాలని సూచించారు. స్త్రీ వైద్య నిపుణులు ప్రొఫెసర్ డాక్టర్ నీలిమ, డాక్టర్ సుప్రియ, డాక్టర్ కే. నికిత రెడ్డి, డాక్టర్ డి.ఝాన్సీ, డాక్టర్ ఎస్ ప్రవళిక, డాక్టర్ ప్రవీణ్ కుమార్, నర్సింగ్ ఆఫీసర్లు మిడ్ వైఫ్స్ ,సిబ్బంది కే లక్ష్మమ్మ, రేవతి, ప్రసన్న, సువేద, రేణుక, రాధ, శ్రావణి హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ టి యాదగిరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : జిల్లాలో వర్షాలు, అకాల వరదలు సంభవించిన సందర్భంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం చించోలి.బి సమీపంలోని ప్రభుత్వ మైనారిటీ పాఠశా లలో నిర్వహించిన విపత్తు నిర్వహణ శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి వచ్చిన ఎన్‌డిఆర్ఎఫ్ బృందం సహాయక విన్యాసాలు, ప్రజలకు అవగాహన కల్పించే ప్రదర్శనలను కలెక్టర్ పరిశీలించి, బృంద సభ్యుల పనితీరును అభినందిం చారు. వారి వద్ద ఉన్న ఆధునిక పరికరాల వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో అవి ఎలా ఉపయోగపడతాయన్న అంశాలపై కలెక్టర్ అధికారులనుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా గోదావరి స్వర్ణ, ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాలు, జీఎన్ఆర్ కాలనీ తదితర లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరదల సమయంలో ముందస్తు చర్యలు చేపట్టేందుకు జిల్లా స్థాయిలో ఫ్లడ్ మాన్యువల్ తయారు చేసినట్లు పేర్కొన్నారు. కడెం, ఖానాపూర్, సారంగాపూర్, దస్తురాబాద్, భైంసా మండలాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు గత 15 రోజులుగా ఎన్‌డిఆర్ఎఫ్ బృందం పనిచేస్తుందని తెలిపారు. వరదల వలన ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విపత్తు సమయంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మైనార్టీ పాఠశాల ప్రాంగణంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, తహసీల్దార్ రాజు, ఎంపిడిఓ లక్ష్మీకాంతం, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి : మంత్రులు

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా మార్చాలన్న లక్ష్యంతోనే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహలు అన్నారు. బుధవారం సంగారెడ్డిలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమానికి వారు టి జి ఐ ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావిణ్యలతో కలిసిముఖ్య అతిథులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భముగా కార్మిక ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక స్థలంబన కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలపాటు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేస్తామంటూ కల్లబొల్లి మాటలతో కాలం వెళ్లదీశారు తప్ప ఏ ఒక్కరికి డబుల్ బెడ్ రూములు ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందన్నారు. గత పది సంవత్సరాలలో జిల్లాలో, రాష్ట్రంలో ఒక్క రేషన్ కార్డును గత ప్రభుత్వం ఇవ్వలేదని కానీ మన ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సంగారెడ్డి జిల్లాకు 13వేల పైచిలుకు రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీ కార్డు హామీల్లో భాగంగా ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రభుత్వం 200 యూనిట్ల ఫ్రీ కరెంటు గ్యాస్ సిలిండర్ పై రూ. 500 రాయితీ, రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలల్లో స్వయం సహాయక సంఘాల మహిళలతో మౌలిక వసతుల మెరుగు కోసం కృషి స్వయం సహాయక సంఘాల మహిళలకు ద్వారా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో క్యాంటీన్ల ఏర్పాటు రాష్ట్రంలోని మొదటి పెట్రోల్ పంపు సంగారెడ్డిలో ఏర్పాటు చేయడం లాంటి ఎన్నో కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణతోనే మహిళా సంఘాల సభ్యులు ఎదగడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు వెలుగులు పంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం చేయూత పథకం ద్వారా గత 25 సంవత్సరాల క్రితం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి దామోదర్ నరసింహ తెలిపారు. మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. 23 వేలకు పైగా ఉన్న స్వయం సహాయక సంఘాలకు రూ 30 కోట్ల వడ్డీ లేని రుణాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా ఒక పెద్ద పౌల్ట్రీ పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రభుత్వం జిల్లా మండల సమైక్యలకు సహకరిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలోని 23 వేల స్వయం సహాయక సంఘాలకు 30 కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరైనట్లు తెలిపారు. నిర్మల జగ్గారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, పిడిడిఆర్‌డిఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు

సిపిఐతో నా అనుబంధం కొనసాగుతుంది : ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : 30 ఏళ్లుగా సిపిఐతో తనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, తాను ఎక్కడ ఉన్నా సిపిఐతో తన అనుబంధం కొనసాగుతుందని వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సిపిఐకి తగు ప్రాధాన్యత కల్పిస్తానని ఆయన స్పష్టం చేశారు. బుధవారం వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఖమ్మం గిరిప్రసాద్ భవన్ సిపిఐ కార్యాలయంకు చేరుకుని సిపిఐ, కాంగ్రెస్ వైరా నియోజక వర్గ నేతల సంయుక్త సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యర్రాబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాందాస్ నాయక్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా కొత్తగూడెం, వైరా (సుజాత నగర్) నియోజక వర్గాల్లో ఏ ఎన్నికలైనా సిపిఐతో కలిసి పని చేస్తున్నానని ఆయన తెలిపారు. వైరా నియోజక వర్గంలో 2023 ఎన్నికల సందర్భంగా సిపిఐ నేతలు అందించిన సహకారం మరువలేనిదని, ఎన్నటికి మరిచిపోనని రాందాస్ నాయక్ తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైరా నియోజక వర్గంలో సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు కలిసి పోటీ చేస్తాయని ఆయన స్పష్టం చేశారు. వైరా నియోజక వర్గ పరిధిలోని వివిధ సమస్యలకు సంబంధించి సిపిఐ నేతల వద్ద నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ తాము కాంగ్రెస్కు నిర్మాణాత్మక మిత్రపక్షంగా వ్యవహరిస్తున్నామని అనేక రాజకీయ అంశాలకు -సంబంధించి ఏకాభిప్రాయంతో ఉన్నామన్నారు. మిత్రబంధాన్ని ఎన్నికల వరకే పరిమితం చేయకుండా కొనసాగేలా తగు చర్యలు తీసుకోవాలని శాసన సభ్యునికి సూచించారు. స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు రాందాస్ నాయక్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, కాంగ్రెస్ నాయకులు వడ్డే నారాయణరావు, సూరంపల్లి రామారావు, సిపిఐ నాయకులు అజ్మీర రామ్మూర్తి, రావి శివరామకృష్ణ, జాగర్లమూడి రంజిత్ కుమార్, -రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, వైరా నియోజక వర్గ పరిధిలోని సిపిఐ మండల కార్యదర్శులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : రేషన్ కార్డులకై వచ్చిన దరఖాస్తుల పై వెంటనే విచారణ చేసి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చండూరు ఆర్డీవో శ్రీదేవికి సూచించారు. బుధవారం ఆమె చండూరు ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి కింద వచ్చిన దరఖాస్తులు, వాటి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతేగాక దరఖాస్తులను పరిశీలించారు. గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు భూభారతి దరఖాస్తులను కేటగిరి వారిగా విభజించుకొని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.డివిజన్ పరిధిలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల పురోగతికి తగు సూచనలు చేశారు. రేషన్ కార్డులకు వచ్చిన దరఖాస్తులన్నిటిపై తక్షణమే తగు విచారణ చేయించి పరిష్కారించాలన్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్ ఆర్డిఓతో మాట్లాడి తెలుసుకున్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఏఐఎస్ఎఫ్ కలెక్టరేట్ ముట్టడి.. ఉద్రిక్తత...

విశాలాంధ్ర - ఖమ్మం : ప్రభుత్వం విద్యార్థుల బోధనా రుసుములు, ఉపకార వేతనాలను తక్షణమే మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం బుధవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. పోలీసులుకు విద్యార్థి సంఘాల నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ గత నాలుగేళ్లగా ఫీజు రియంబర్స్మెంట్, ఉపకార వేతనాలను ప్రభుత్వం ఇవ్వడం లేదని, ప్రభుత్వం మారిన, పాలన మాత్రం అలానే ఉందని,విద్యార్థు పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ నాన్ ప్రొఫెషనల్ 2000 కోట్లు, ప్రొఫెషనల్ 4000 కోట్లు గా పెండింగ్ ఉపకారవేతనాలు ఉన్నాయని, 2021 -22 ప్రభుత్వం విడుదల చేసిన బకాయులు 30 శాతం 2022 -23 గాను 20 శాతం మాత్రమే అన్నారు. 2023 -24, 2024- 25, 2025- 26మొత్తం. బకాయిలు ఉండడంతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పలుమార్లు నిర్వదిక బంద్ నిర్వహించిన ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందనలేదని అయన విమర్శించారు. తక్షణమే పిజు, రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని, లేని పక్షంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు మంత్రులు, ఇళ్లను ముట్టడిస్తామని అయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ సహాయ కార్యదర్శులు నాగుల మేర మధు శివ నాయక్ వంశీ జిల్లా నాయకులు మనోజ్ సురేష్ పవన్ వెంకటేష్ లక్ష్మణ్ నాగేంద్రబాబు గోపి నరేందర్ పావని మల్లికా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు మండల కేంద్రంలోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ లు పాల్గొని మాట్లాడుతూ రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ 80 శాతం వరకు విజయం ఖాయమని అన్నారు. కవిత కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలను అమలు చేయకపోవడంలో కాంగ్రెస్ విఫలమైందని వారి అనుకూలమైన నాయకులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నదని ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి ఆటో వాళ్లకు తీరని నష్టం కాంగ్రెస్ పార్టీ మిగిల్చిందని మహిళలకు 2500 ఇస్తానని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదని కవిత కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రనికి అనేక పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలబెట్టిన ఘనత కెసిఆర్ ది అని అన్నారు. బిఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మకూడదని కలిసి స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ గెలుపుకై పాటుపడి గ్రామ కమిటీల సమక్షంలో సర్పంచ్ ఎంపీటీసీ లను మీరే నిర్ణయించి మండల కమిటీకి ప్రతిపాదనలు పంపాల్సిందిగా కవిత కోరారు. మండల అధ్యక్షులు వేం వెంకటకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు బీరవెల్లి భరత్ కుమార్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఎండి కాసిం, ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్, సీనియర్ నాయకులు వాంకుడోత్ కటార్ సింగ్, జలగం సంపత్ రావు పాల్గొన్నారు.

దర్జీలకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - ఇల్లందు : దశబ్దాలుగా వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న దర్జీల (టైలర్ల) కుటుంబాలను ఏ ప్రభుత్వం ఆదుకోవడం లేదని ఇల్లందు టైలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు షేక్ మౌలానా ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో దర్జీలు ఎదుర్కొంటున్న సమస్యలపై విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రోజు రోజుకు దర్జీ వృత్తి మనుగడ ప్రశ్నార్థకారంగా మారుతుందన్నారు. మారిలో ఆధునిక కాలంలో రెడీ మెడ్ కార్పొరేట్ వ్యాపారం వల్ల దశాబ్దాలుగా దర్జీ వృత్తిని నమ్ముకుని బతుకుతున్న కుటుంబాలకు పని లేకుండా పోతుందన్నారు. దింతో ఆయా కుటుంబాలు కొత్తగా వేరే వృత్తులు చేయలేక ఆర్థికంగా, అనారోగ్య సమస్యలతో ఘోరకలిని ఎదుర్కొంటున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్జీలకు కోసం విలియం వోవే భవనాన్ని నిర్మించాలన్నారు. తమకు హెల్త్ కార్డులను మంజూరు చేయాలని, ఆధునిక కుట్టుమిషన్లను ఇవ్వాలని అభ్యర్థించారు. ప్రతి నియోజకవర్గంలో దర్జీలు తమ డిమాండ్లపై స్థానిక ఎమ్మెల్యే, మంత్రులకు వినతి పత్రం అందజేయాలని సంఘం నాయకులను కోరారు.

జిల్లా గ్రంధాలయ చైర్మన్‌గా యువ నేత వీరబాబు

విశాలాంధ్ర - కొత్తగూడం అర్బన్ : కాంగ్రెస్ పార్టీలో నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తూ జిల్లాలో నిబద్ధత గల ప్రియాశీల యువ నాయకుడిగా పేరు ఉన్న పసుపులేటి వీరబాబును జిల్లా గ్రంధాలయ చైర్మన్ గా కాంగ్రెస్ ప్రభుత్వం నియామకం చేసింది. ఈ మేరకు బుధవారం ఆయనను చైర్మన్ గా నియమిస్తూ అదిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. దింతో ఆయన నియామకం పట్ల జిల్లాలోని పార్టీ శ్రేణులతోపాటు రాజకీయాలకతీతంగా అభినందనలు వ్యక్తం అవుతున్నాయి. అధికారం ఉన్న లేకపోయినా పార్టీని నమ్ముకుని ఎన్ని అవాంతరాలు, కష్టాలు ఎదురైనా సైనికుడుల పని చేస్తూ వస్తున్న వీరబాబు తగిన గుర్తింపు దక్కిందని అభిమానుల్లో సంతోషం వ్యక్తం అవుతుంది. ఒక సాధారణ కార్యకర్తకు జిల్లా గ్రంధాలయ చైర్మన్ పదవి ఇస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పార్టీ శ్రేణులు స్వాగతిస్తున్నాయి. గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఏలిన పదేళ్ల కాలంలో చేసిన అక్రమాలు, అకృత్యాలను వీరబాబు ఎండగడుతూ జిల్లా ప్రజల దృష్టిని ఆకర్షించారు. కెసిఆర్ ప్రభుత్వ నిర్బంధాలను, కేసులను లెక్కచేయకుండా ఆయన చేసిన పోరాటాలకు ఈ సందర్భంగా యువజన నాయకులను గుర్తు చేస్తున్నారు. కాగా ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం చైర్మన్ గా నియమించడంతో ఇంకా బాధ్యత పెరిగిందన్నారు. అధిష్టానంతో పాటు జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చందు నాయక్‌ను హత్య చేయడం దుర్మార్గం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులు చందు నాయక్ ను కొంతమంది దుండగులు హత్య చేయడం దుర్మార్గమైన చర్య అని నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా చందు నాయక్ కు ఘన నివాళులు అర్పించారు. చిన్ననాటి నుంచి కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులై సిపిఐ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తూ అంచలంచలుగా ఎదుగుతూ సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులుగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా చందు నాయక్ ఎదిగారన్నారు. ఎన్నో రకాల బాధ్యతలు, పేద ప్రజలకోసం ఆయన ఎన్నో పోరాటాలు చేశారన్నారు. పోరాటాల ద్వారా పేదల అవసరాలు తీరుస్తూ, భూములు పంచిన చందు నాయక్ ప్రజల్లో మరింత బలపడ్డారని గుర్తు చేశారు. గిరిజన ముద్దుబిడ్డను ఓర్వలేని దుర్మార్గులు కక్షగట్టి హత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గుగులోతు రామచందర్,గణేష్, నగేష్, బాలాజీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

శిక్షలు కావు చికిత్స అవసరం

ఒరిస్సా రాజధాని భువనేశ్వర్ లో ఉన్న ఎయిమ్స్ (ఎ.ఐ.ఐ.ఎం.ఎస్.) స్నాతకోత్సవానికి హాజరయ్యేందుకు వెళ్లిన రాష్ట్రపతి జులై 14న మానవత అంటే ఏమిటో చూపించారు. ఆమె వచ్చింది స్నాతకోత్సవానికే అయినా ఎయిమ్స్‌లోని కాల్పులకు గురయ్యే వారికి చికిత్స చేసే విభాగానికి వెళ్దామన్నారు. ఇది ఆమె పర్యటనలో భాగం కాదు. కానీ ఆ విభాగంలోఎయిమ్స్‌లో బిఎడ్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని 95 శాతం ఒళ్లు కాలిన గాయాలతో ప్రాణాలు కాపాడుకోవడానికి పెనుగులాడుతున్నారు. ఆ విద్యార్థిని చూడడానికి రాష్ట్రపతి ముర్ము స్వయంగా వెళ్లారు.

రెండేళ్లుగా మణిపూర్‌లో కలహాలు జరుగుతున్నా ప్రధానమంత్రి మోదీ అటు వేపే వెళ్లలేదు. కానీ రాష్ట్రపతి మనసు ఊరుకోలేదు. కాలిన గాయాలతో బాధపడుతున్న విద్యార్థినిని పరామర్శించారు. రాష్ట్రపతి ముర్ము పరామర్శ ఆ అమ్మాయి ప్రాణాలను కాపాడలేక పోయింది. మర్నాడు అంటే గత సోమవారం ఆమె ప్రాణాలు వదిలింది. రాష్ట్రపతి ఆ అమ్మాయి తల్లిదండ్రులతో కూడా మాట్లాడారు. ఇదంతా డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న ఒడిశాలో జరిగింది. తప్పదు గనక కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా ముఖ్య మంత్రి మోహన్ మాఝీ కూడా రాష్ట్రపతితో పాటు ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చింది. ఆ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవాలన్న నిర్ణయం క్షణికావేశంలో తీసుకున్నది కాదు. అభాగ్యురాలైన ఆ అమ్మాయిని కళాశాలలోని ఓ అధ్యాపకుడు కొంత కాలంగా లైంగిక వేధింపులకు గురి చేశాడు. ఆ అమ్మాయి కళాశాల ప్రిన్సిపాల్‌కు, యాజమాన్యానికి, పోలీసులకు ఫిర్యాదు కూడా చేసింది. కానీ ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. చివరకు ఆ అమ్మాయి కళాశాల ప్రిన్సిపాల్ గది ముందే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కళాశాల ప్రిన్సిపాల్‌ను, వేధించిన అధ్యాపకుడిని అరెస్టు చేశారు. ఆ అమ్మాయి ప్రాణాలు తీసుకోవడానికి కారణమైన ప్రొఫెసర్ కొన్ని సార్లు ఆమెను క్లాసుకు హాజరు కాకుండా బయటే నిలబెట్టే వాడట. ఒక సారైతే పరీక్ష రాయనివ్వలేదట. అదేమంటే ఆ అమ్మాయికి హాజరు తక్కువగా ఉందని అన్నాడట. క్లాసులో కూర్చోవడానికి అనుమతించకపోతే హాజరు తగ్గకుండా ఉంటుందా? సిగ్గు విడిచి ఆ అమ్మాయి కళాశాల ప్రిన్సిపల్‌కు కడకు పోలీసులకూ ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోక పోవడం దారుణం. మరో మార్గం లేక ఆ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. అమ్మాయిని వేధించిన అధ్యాపకుడిపై చర్య తీసుకోవాలని కళాశాల విద్యార్థులు నిరసన ప్రదర్శన కూడా చేశారు. ఆ సమయంలోనే ఆమె ఒంటికి నిప్పంటించుకుంది. కళాశాల యాజమాన్యం సమయానికి స్పందించి నిందితుడైన అధ్యాపకుడిపై చర్య తీసుకుని ఉంటే నిండు ప్రాణం మిగిలేది. ఈ ఉదంతం తరవాత స్థానిక బీజేపీ నాయకులు దిక్కు తోచకుండా మిగిలిపోయారు. ఈ సంఘటనపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇంతవరకు ఒక్క మాట కూడా మాట్లాడిన దాఖలాలు లేవు. బేటీ పఢావో, బేటీ బచావో (అమ్మాయిల్ని చదివించండి, అమ్మాయిల్ని కాపాడండి) అన్న మోదీ నినాదం అనేకానేక శుష్క వాగ్దానాల్లో ఒకటిగా మిగిలిపోయింది. కనీస రక్షణ కల్పించడంలో ఏ సంస్థ అయినా విఫలం అయినప్పుడు అమ్మాయిల మనుగడ అక్కడ కచ్చితంగా పెద్ద సవాలుగానే ఉంటుంది. ఇలాంటి ఉదంతాల్లో ఇది మొదటిదీ కాదు. చివరిదీ కాబోదు. గుడిసెలన్నీ తగలబడి పోయాక అగ్నిమాపక దళ శకటాలు వచ్చినట్టు ఈ సంఘటన తరవాత జాతీయ మానవ హక్కుల సంఘం ఈ ఉదంతంపై ఆరా తీయడం మొదలు పెట్టింది. దుర్ఘటన తరవాత ఎవరు ఎన్ని నివేదికలు తయారు చేసినా, ప్రకటనలు జారీ చేసినా ప్రయోజనం ఏమీ ఉండదు. ఇలాంటి సంఘటనలు జరగకుండా మానవ హక్కుల సంఘం ముందే చర్యలు ఎందుకు తీసుకోదో అంతుబట్టదు. ప్రతిక్రియ తప్ప క్రియ లేని సంస్థలు ఉంటేనేం లేకపోతేనేం.

కామాంధుడైన ఒక అధ్యాపకుడు దుర్వర్తనకు ఓ అమ్మాయి బలై పోయినందుకు ఒడిశాలోని ప్రతిపక్ష పార్టీలన్నీ తీవ్రంగా స్పందించాయి. అక్కడ ప్రధాన ప్రతిపక్షమైన మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నాయకత్వంలోని బిజూ జనతా దళ్, కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు రోడ్డెక్కి నిరసన తెలియజేస్తున్నాయి. ఇలాంటి దురంతాలు బీజేపీ అధికారంలో ఉన్న చోట మాత్రమే జరుగుతాయని కాదు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఈ దారుణాలు జరగలేదనీ కాదు. కానీ అమ్మాయిలను చదివించడం, కాపాడడమే తమ లక్ష్యం అని ప్రచారం చేసుకునే చోట ఈ దురంతాలు జరగడం ఆ పార్టీ డొల్ల తనాన్ని, ఉత్తుత్తి హామీల బండారాన్ని బయట పెడ్తాయి. ఈ సంఘటనపై న్యాయ విచారణకు ఆదేశించాలని ప్రతిపక్షాలు డిమాండు చేస్తున్నాయి. ఆ అమ్మాయికి ప్రతి అడుగులోనూ అన్యాయమే జరిగిందని మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అంటున్నారు. జాతీయ మహిళా కమిషన్ కూడా ఈ దుర్ఘటనపై ఆరా తీస్తోంది. ఒడిశాలోని మహిళలు, బాలలపై నేరాలను నిరోధించే కమిటీ కూడా పోలీసుల దర్యాప్తుతో నిమిత్తం లేకుండా విచారణ కొనసాగిస్తున్నాయి. ఇవన్నీ తీసుకోవలసిన చర్యలే. అనుమానం లేదు. కాని ప్రతి సారీ ఇవి తంతులా జరిగిపోతున్నాయే తప్ప ఒక్క సందర్భంలోనైనా అఘాయిత్యాలు, అత్యాచారాలు నిరోధించడానికి తోడ్పడిన ఆనవాళ్లు లేవు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవలసిన అధికార వ్యవస్థలు, సంస్థలు అడుగడుగునా విఫలమైనప్పుడు దిక్కుతోచని స్థితిలో పడిపోయిన బాధితులకు ఆత్మహత్య ఒక్కటే మార్గంగా కనిపించడంలో ఆశ్చర్యం లేదు. సదరు అధ్యాపకుడిని ప్రస్తుతానికి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిస్తే 14 రోజుల రిమాండు విధించారు. పోలీసులు తయారు చేసే ఎఫ్ఐఆర్ పకడ్బందీగా లేకపోతే ఈ వ్యవహారం న్యాయ స్థానం ముందుకెళ్లినా జరగవలసిన న్యాయం జరగదు. చాలా సందర్భాలలో రకరకాల ఒత్తిడులకు లొంగి పోయి పోలీసులు పెద్ద కన్నాలున్న జల్లెడ లాంటి ఎఫ్ఐఆర్‌లు తయారు చేస్తారు. ఓ పనైపోయిందనిపిస్తుంటారు. మహిళల మీద అత్యాచారం చేయడం లేదా చేయాలని ప్రయత్నించడం, ఎదుటి మనిషి బలహీనులైతే ఆ అవకాశాన్ని తీసుకుని ఘాతుకానికి పాల్పడడం కేవలం శాంతి భద్రతల సమస్య కాదు. చట్టాలను ఉల్లంఘించడానికి పరిమితమైందీ కాదు. మానసిక ప్రవర్తన సవ్యంగా లేకపోవడం, నైతిక విలువలు లోపించడం లాంటివి ఇలాంటి ఉదంతాలకు దారి తీస్తుంటాయి. ఇవన్నీ సామాజిక సమస్యలు కూడా. ఈ సామాజిక సమస్యలను చట్టాల ద్వారా, పోలీసు బలగాల ద్వారా, న్యాయస్థానాల తీర్పుల ద్వారా పరిష్కరిం చడం ఎప్పుడూ అసంపూర్ణం గానే మిగిలిపోక తప్పదు. శిక్షలు నేర నిరోధకంగా పని చేసే సందర్భాలు తక్కువ. గుజరాత్ మారణకాండ సమయంలో బిల్కిస్ బానోపై అనేక మంది అత్యాచారం చేశారు. వారికి న్యాయస్థానం శిక్ష కూడా విధించింది. కానీ సత్ప్రవర్తన సాకుతో గుజరాత్ ప్రభుత్వం వారిని విడుదల చేసింది. ఇంత తెంపరితనం ఉన్న ప్రభుత్వాలున్నప్పుడు ఎవరి దగ్గరనుంచైనా సత్ప్రవర్తన ఆశించడం అత్యాశే. శిక్షలు సరిపోవు. చికిత్స కావాలి.

బెడిసికొట్టిన బీజేపీ వ్యూహం

పి. శ్రీకుమారన్

కేరళలోని క్రైస్తవులను ఆకట్టుకునేందుకు బీజేపీ రాజకీయ వ్యూహం ఘోరంగా విఫలమైంది. బీజేపీ అవకాశవాద రాజకీయ వ్యూహానికి గండిపడింది. కేరళలోని నిలంబూర్ అసెంబ్లీ నియోజక వర్గానికి ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ ఓటమిచవిచూసింది. నియోజకవర్గంలో మెజారిటీగా ఉన్న క్రైస్తవ ఓటర్లను దృష్టిలో ఉంచుకుని క్రైస్తవ అభ్యర్థిని బీజేపీ పోటీలో నిలిపింది. ఈ ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతం ఊహించని విధంగా తగ్గడం కాషాయ పార్టీకి ఊహించని దెబ్బకొట్టింది. డిపాజిట్ కోల్పోయిన బీజేపీ అభ్యర్థి పేలవమైన ప్రదర్శన నేపథ్యంలో పార్టీ రాష్ట్ర నాయకత్వం తీవ్ర విమర్శలకు గురైంది. ఈ వ్యూహాన్ని రూపొందించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్, ఇతర అగ్ర నాయకులు ఫలితాల సమీక్షా సమావేశంలో కార్యకర్తల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కొవలసి వచ్చింది. ఈ ఏడాది చివర్లో కేరళలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు, వచ్చే ఏడాది జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ క్రైస్తవ ఓటర్లను ఆకర్షించే వ్యూహాన్ని

రూపొందించింది. అయితే అది ఆశించిన ఫలితాలను ఇవ్వదని నిలంబూర్ ఉప ఎన్నిక ఫలితం వెల్లడించింది. బీజేపీపై క్రైస్తవుల్లో ఉన్న అపనమ్మకం, అసహనం ఈ ఎన్నికల ద్వారా స్పష్టంగా తేటతెల్లమైంది. కేరళలోని ప్రముఖ క్రైస్తవ వార్తాపత్రిక దీపిక దినపత్రికలో జులై14 నాటి సంపాదకీయం ద్వారా బీజేపీపై క్రైస్తవులలో ఉన్న ఆగ్రహం వెల్లడైంది. బీజేపీ అవలంబిస్తున్న ద్వంద్వ ప్రమాణాలకు వ్యతిరేకంగా ఘాటుగా స్పందించింది. గణనీయమైన క్రైస్తవ జనాభా ఉన్న గోవా, కేరళలోని క్రైస్తవులతో తాము కలిసి మెలిసి ఉన్నామని చెప్పుకునే బీజేపీ ఒడిశా, మహారాష్ట్రలలో క్రైస్తవులపై పెరుగుతున్న దురాగతాలపై మౌనంగా ఉండి ఇప్పుడు ఓట్లను ఎలా అడుగుతుంది? అంటూ క్రైస్తవుల పత్రిక దీపిక సంపాదకీయం ద్వారా అడిగిన ప్రశ్న. అయితే బీజేపీ నాయకులు మాత్రం ఈ అంశంపై స్పందించకుండా మౌనం వహించారు.

ముఖ్యంగా మహారాష్ట్రలో క్రైస్తవులపై జరిగిన తాజా దాడులే దీనికి ఉదాహరణ. బీజేపీ ఎమ్మెల్యే గోపిచంద్ పడాల్కర్ క్రైస్తవ సమాజంపై దాడులు నిర్వహించే వారికి రూ. 3 నుంచి 10 లక్షల వరకు బహుమతిని బహిరంగంగా ప్రకటించారు. ధూలే, నందర్‌బార్ వంటి జిల్లాల్లో చర్చిల అక్రమ నిర్మాణం జరుగుతున్నట్లు పార్టీ మరో ఎమ్మెల్యే రికార్డులో ఉన్నారు. మహారాష్ట్ర రెవెన్యూ మంత్రిత్వ శాఖ రాష్ట్రంలో బలవంతపు మత మార్పిడులకు వ్యతిరేకంగా కొత్త చట్టం గురించి సూచించింది. అటువంటి మత మార్పిడులకు వ్యతిరేకంగా ఇప్పటికే ఒక చట్టం ఉంది. కొత్త మతమార్పిడి నిరోధక చట్టం కోసం ఎందుకు డిమాండ్ చేస్తున్నారు? దీపిక సంపాదకీయం అడిగిన ప్రశ్న అదే.

మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లింలతో పాటు క్రైస్తవులపై దేశవ్యాప్తంగా దాడులు పెరిగాయి. యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం నివేదిక ప్రకారం మొత్తంమీద 4316 కేసులు నమోదైనట్లు పేర్కొంది. 2024 సంవత్సరంలో క్రైస్తవులపై 834 సంఘటనలు జరిగాయి. ఉత్తరప్రదేశ్ పోలీసులు 835 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 1682 మందిని అరెస్టు చేశారు. కానీ ఈ కేసులో కేవలం నాలుగు కేసుల్లో మాత్రమే క్రైస్తవులు దోషులుగా తేలారు. 2024లో ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 204,, చత్తీస్‌గఢ్‌లో 165 నమోదయ్యాయి. క్రైస్తవులపై దేశవ్యాప్తంగా జరుగుతున్న ఇన్ని దాడుల నేపథ్యంలోనే కేరళలోని క్రైస్తవ ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ ముమ్మరంగా యత్నిస్తోంది. రాష్ట్రంలో పార్టీ విస్తరణలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా కేరళకు వచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 25 శాతం ఓట్ల వాటాను సాధించడమే తమ పార్టీ లక్ష్యమని ప్రకటించారు. రాష్ట్రంలోని రెండు కార్పొరేషన్ల - తిరువనంతపురం, త్రిస్సూర్ - ఎన్నికల్లో గెలుపే తమ లక్ష్యంగా ప్రకటించారు. కేరళ క్రైస్తవ సమాజంలోని ఓటర్లలో వచ్చిన చైతన్యాన్ని బీజేపీ గ్రహించలేదు. తమ శ్రేయస్సే ధ్యేయంగా క్రైస్తవులు పని చేస్తున్నారు. తమపై దాడులను మౌనంగా చూస్తూ అవసరమైనప్పుడు తగు సమాధానం చెప్తున్నారు. ఈ పరిస్థితుల్లో వచ్చే ఏడాది జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలలో భారీ స్థాయిలో ఓట్లు కొల్లగొడుదామనుకున్న బీజేపీ కల నెరవేరే అవకాశం అయితే ఎట్టిపరిస్థితిలో లేదనేది స్పష్టం. తాజా ఉప ఎన్నిక ఫలితాలు ఎలా ఉన్నా రాష్ట్రంలో బీజేపీ సంస్థాగత స్థాయిలో పునరుద్ధరణకు పూనుకుంది. అమిత్ షా రాష్ట్ర పర్యటన రోజున కొత్త ఆఫీస్ బేరర్లను ప్రకటించారు. ప్రముఖ మహిళా నాయకురాలు శోభా సురేంద్రన్, మాజీ కార్యదర్శి ఎస్ సురేష్ యువమోర్చా మాజీ జాతీయ కార్యదర్శి అనూప్ ఆంటోనీ జోసెఫ్‌లను ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. సీనియర్ నాయకుడు ఎం టి రమేష్‌ను ఆ పదవిలో కొనసాగించారు. 10 మంది కొత్త ఉపాధ్యక్షులలో మాజీ డీజీపీ ఆర్ శ్రీలేఖ, యువ నాయకుడు షోన్ జార్జ్ ఉన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఈ కసరత్తు, కేరళలో వర్గపోరు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు.

బీహార్‌లో సుప్రీం సూచన ఈసీ పాటిస్తుందా!

అరుణ్ శ్రీవాత్సవ

ఈసారి బీహార్ అసెంబ్లీ ఎన్నికలు చాలా ఆసక్తిదాయకంగా ఉండబోతు న్నాయి. ఎన్నికలు జరగనున్న తరుణంలో రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితాను సవరించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించి ప్రకటించింది. ఇంత వేగంగా ప్రత్యేక ఓటర్ల జాబితాను సవరించవలసిన అవసరం ఏముందని సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించింది. అయితే ఓటర్ల జాబితాను సవరించడానికి అభ్యంతరం తెలియజేయలేదు. అయినప్పటికీ ఆధార్ కార్డును, ఓటరు గుర్తింపు కార్డును, రేషన్ కార్డును, ఓటరు ఫొటో ఉన్న గుర్తింపు కార్డును ఎన్నికల్లో ఓట్లు వేయడానికి అనుమతించాలని సుప్రీంకోర్టు ఈసీకి సూచించింది. అయితే బీహార్‌లో ఎలాగైనా గెలిచి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రధాని నరేంద్రమోదీ అనేక ఎత్తుగడలు పన్నుతున్నారని ఆయన ఎలా చెబితే అలా ఈసీ ఆమోదించి అమలు చేస్తున్నదని ప్రతిపక్షాలు ఆరోపించి సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈసీ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ ప్రొవిజన్లను తప్పనిసరిగా మాత్రమే పాటించాలని ఈసీని ప్రతిపక్షాలు, అనేక మంది ఎన్నికల విశ్లేషకులు కోరారు.

ఈ వ్యవహారంలో ఈసీ, మోదీ కలిసి పనిచేస్తున్నట్టు భావిస్తున్నారు. ప్రత్యేకంగా ఓటర్ల జాబితాను సవరించటానికే ఈసీ నిర్ణయించింది. ఒక్క బీహార్‌లోనే కాకుండా దేశ వ్యాప్తంగా ఇదే విధానాన్ని అనుసరించాలని ఈసీ తలపెట్టింది. అయితే ఈసీ విచిత్రమైన, వికృతమైన విధానాలను సుప్రీంకోర్టు డివిజన్ బెంచి పసిగట్ట లేకపోయిందని కొందరు భావిస్తున్నారు. తదుపరి విచారణ జులై 28 న జరుపుతామని సుప్రీంకోర్టు డివిజన్ బెంచి ప్రకటిం చింది. ఈలోపు ఈసీ సుప్రీం సూచనను పాటిస్తుందా! లేదా! అదనపు అంశాలను చేరుస్తుందా! అనేది నిర్ణయించుకునేందుకు సుప్రీం అవకాశాన్ని కల్పించింది.

ఇది జరిగిన తరువాత ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు తక్షణం ఒక సందేశాన్ని పంపింది. బీహార్‌లో జరగుతున్న ఓటర్ల సమగ్ర జాబితా సవరణకు 2026 జనవరి 1 వ తేదీ నుంచి ఏర్పాట్లు చేసుకోవల సిందిగా కేంద్ర ఎన్నికల కమిషన్ సూచించింది. ఇది ఈసీ తీసుకున్న వ్యూహాత్మక చర్య. జులై 28 న మరోసారి పిటీషన్లపై విచారణ జరుపుతామని ప్రకటించినప్పటికి ఈసీ బీహార్‌లో పనిచేసే ఎన్నికల అధికారి జులై 25 లోపు ఓటర్ల ప్రత్యేక జాబితా సవరణ పూర్తిచేయాలని ఆదేశించింది. మరో పన్నెండు రోజుల్లో విచారణ జరిగి సుప్రీం ఏమి నిర్ణయం చెబుతుందో తెలుసుకోకుండా ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేయాలని ఈసీ నిర్ణయం తీసుకోవటం విచిత్రంగా లేదూ. మోదీ చెప్పకుండానే ఈసీ ఇలాంటి నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

15 రోజుల లోపే ఓటర్ల జాబితా సవరణ సాధ్యమేనా! ఇది ఎంత మాత్రం వాస్తవంగా ఆచరణీయం కాదని మోదీకి, ఈసీకి తెలియకపోలేదు. ఓటర్ల జాబితా సవరణలో కోట్లాది మంది ఓట్లను కోల్పోతారని సర్వత్రా వినిపిస్తున్న మాట. ఇప్పటికే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ దాదాపు పూర్తికావచ్చిందని ఈ ప్రక్రియను వాయిదా వేయడానికి మోదీగాని, ఈసీగాని అంగీకరించడంలేదు. బీహార్‌లో ఏవిధంగానైనా గెలవడం కోసం ఈసీ అనుసరిస్తున్న విధానాన్ని బీజేపీ ఆహ్వానించింది. తమతో కనీసం సంప్రదించకుండా దేశ వ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణకు ప్రకటించడం ఏమిటని, ఇంతగా హడావిడి చేయడమేంటని ఈసీని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రతిపక్షాల వాదనపూర్తిగా వాస్తవమైంది. సుప్రీంకోర్టు తుది నిర్ణయం ప్రకటించే వరకైనా ఆగవచ్చు కదా అని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. ఇది కాషాయ దళాల కుట్ర మాత్రమేనని అదిప్పుడు బహిర్గతమైందని విమర్శించాయి. కోట్లాది మంది దళితులు, ముస్లింలు ఈబీసీలను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం కోసమే ఈ కుట్ర అని ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. కాషాయ దళాల అనుకూలమైన హిందూ రాష్ట్రను ఏర్పాటు చేయడానికే అనేక రకాల కుట్రలు పన్నుతున్నారు.

ఇటీవల ఇండియా ఐక్య సంఘటన ప్రతినిధి వర్గం ఎన్నికల కమిషన్‌ను కలిసి తమ అభిప్రాయాలు వెల్లడించింది. సమగ్ర ఓటర్ల జాబితా సవరణ చేపట్టడం సహజ సిద్ధమైన ప్రక్షాళన ప్రక్రియ అని ఈసీ వివరించింది. అన్నిటి కంటే ముందు ముస్లింలను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్న కుట్ర బీజేపీకి బలంగా ఉంది. ఇలాంటి అభిప్రాయం దళితులు, ఈబీసీలు, శ్రామికుల విషయం లోనూ ఉంది. ఓటర్ల జాబితా నుంచి ముస్లింలను తొలగిస్తే బెంగాలీలు ప్రత్యేకించి బెంగాలీ ముస్లింలు భారీగా ఓటర్ల జాబితా నుంచి కనుమరుగవు తారు. బీహార్‌లో దాదాపు 35 లక్షల మందికి పైగా ఓటర్ల జాబితా సవరణ మూలంగా ఓటు హక్కును కోల్పోతారని చెప్తు కుంటున్నారు. ఢిల్లీలో నివసిస్తున్న బెంగాలీలు కార్మికులు, ముస్లింలను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్న లక్ష్యం బీజేపీకి, కేంద్ర పాలకులలో కొందరికి ఎప్పటి నుంచో ఉంది. బెంగాలీ మాట్లాడే ముస్లింలు బీజేపీ పాలిస్తున్న అనేక రాష్ట్రాలలో గణనీయంగా ఉన్నారు. వీరిని ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు కుట్ర పన్నారన్న ఆరోపణలున్నాయి. పశ్చిమబెంగాల్ కంటే బెంగాలీ మాట్లాడే ప్రజలను బీజేపీ బద్ధ విరోధులుగా చూస్తున్నది. బీజేపీ పాలిత రాష్ట్రాలలో నివసిస్తున్న బెంగాలీలను చొరబాటుదారులుగా బీజేపీ పరిగణిస్తున్నది. గుజరాత్‌లో

బీజేపీ పాలిత రాష్ట్రాలలో నివసిస్తున్న బెంగాలీలను చొరబాటుదారులుగా బీజేపీ పరిగణిస్తున్నది. గుజరాత్‌లో బెంగాలీ మాట్లాడే పౌరులను హింసిం చటం, అరెస్టులు చేయించటం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని ముఖ్యమంత్రి లేఖ రాశారు. ముఖ్యంగా ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా సమగ్ర ఓటర్ల జాబితాను సవరించటం ద్వారా తమకు వ్యతిరేకులని భావిస్తున్న వారిని జాబితా నుంచి తొలగించాలన్నదే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల ధ్యేయం. ఇప్పుడున్న ఓటర్ల జాబితా నుంచి వీలైనంత ఎక్కువ మంది ఓటర్లు కొత్త జాబితాలలో కనిపించరు. కొత్త జాబితాలను తయారుచేయటంలో పూర్తిగా పారదర్శకత ఉంటుందని ఈసీ చెప్పే మాటలు ఎంత మాత్రం విశ్వసనీయమైనవి కావు.

బెంగాలీ మాట్లాడే పౌరులను హింసిం చటం, అరెస్టులు చేయించటం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని ముఖ్యమంత్రి లేఖ రాశారు. ముఖ్యంగా ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా సమగ్ర ఓటర్ల జాబితాను సవరించటం ద్వారా తమకు వ్యతిరేకులని భావిస్తున్న వారిని జాబితా నుంచి తొలగించాలన్నదే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల ధ్యేయం. ఇప్పుడున్న ఓటర్ల జాబితా నుంచి వీలైనంత ఎక్కువ మంది ఓటర్లు కొత్త జాబితాలలో కనిపించరు. కొత్త జాబితాలను తయారుచేయటంలో పూర్తిగా పారదర్శకత ఉంటుందని ఈసీ చెప్పే మాటలు ఎంత మాత్రం విశ్వసనీయమైనవి కావు. ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థను అంతం చేసేందుకే ఈసీ నిర్ణయించుకుందని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. సుప్రీంకోర్టు తుది నిర్ణయాన్ని వెల్లడించిన తర్వాత ఈసీ, బీజేపీ అసలు రంగు బయటపడుతుంది.

భారత్-చైనా సంబంధాల సాధారణీకరణ సాధ్యమా?

నిత్య చక్రవర్తి

రష్యా నుంచి ముడి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకునే భారత్, చైనా మీద 500 శాతం వరకు సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు హెచ్చరించాడు. మరోవైపు భారత్, చైనాల మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక చర్చలు పురోగమన దిశలో ఉన్నాయన్న సంకేతాలు ఉన్నాయి. ఎంతో జాగ్రత్తగా రెండు దేశాల నాయకులు చర్చలు జరుపుతున్నారు. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య సోమవారం సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరిగాయి. రెండు దేశాల మధ్య సాధారణ రాజకీయ, ఆర్థిక సంబంధాల పునరుద్ధరణ జరగవచ్చునన్న సంకేతాలు ఉన్నాయి. ఈ సందర్భంగా జైశంకర్ భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ జిన్‌పింగ్‌కు శుభాకాంక్షలు తెలిపారని వెల్లడించారు. జిన్‌పింగ్‌తో చర్చలు ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరిచే పురోగామి దిశలో ఉన్నాయని చెప్పారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) లోని దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం థియాన్‌జిన్‌లో జరిగింది. చైనా విదేశాంగ మంత్రి స్వాగతం పలికారు. జైశంకర్ చర్చలలో పాల్గొని దక్షిణాసియా ప్రాంతంలో టెర్రరిజంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 22న టెర్రరిస్టులు కశ్మీర్‌లోని పహల్గాంలో కాల్పులు జరిపి 26 మంది యాత్రికులను పొట్టన పెట్టుకున్నారని వివరించారు. టెర్రరిస్టులను పూర్తిగా నిర్మూలించే వరకు పాకిస్థాన్‌తో సహా ఎస్‌సీవో సభ్య దేశాలు పోరాటం చేయాలని జైశంకర్ విజ్ఞప్తి చేశారు. టెర్రరిస్టులు పహల్గాంపై దాడి జరిపిన సందర్భంగా పాకిస్థాన్ పేరుని ప్రస్తావించలేదు. అయినప్పటికీ పాకిస్థాన్ విదేశాంగ మంత్రి డాక్టర్ ఇషాక్‌దర్ జైశంకర్ ప్రస్తావించిన టెర్రరిస్టుల అంశాన్ని వివాదం చేశారు. పహల్గాంపై దాడి జరిపిన హంతకులతో పాకిస్థాన్‌కు సంబంధం ఉందని జైశంకర్ చెప్పలేదు. అయినప్పటికీ పాకిస్థాన్ మంత్రి వివాదాన్ని సృష్టించారు.

ఈ సంవత్సరం సెప్టెంబరులో ఎస్‌సీవో శిఖరాగ్ర సమావేశం చైనాలోని థియాన్‌జిన్ నగరంలో జరగనున్నది. భారత ప్రధాని నరేంద్రమోదీ ఈ సమావేశానికి హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా మోదీ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశం అవుతారు. జిన్‌పింగ్ మోదీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య పెండింగ్‌లో ఉన్న అంశాలను మోదీ జిన్‌పింగ్‌తో చర్చించే అవకాశం ఉంది. గత ఏడాది అక్టోబరులో రష్యాలోని కజన్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశంలోనే భారత్, చైనా మధ్య సాధారణ సంబంధాల అంశంపై ఇద్దరు నేతలు చర్చలు జరిపారు. తాత్కాలిక, దీర్ఘకాలిక ద్వైపాక్షిక అంశాలు చాలా పెండింగ్‌లో ఉన్నాయి. ముందుగా టిబెట్‌కు దలైలామా (90 ఏళ్లు) వారసుడన్న అంశం వివాదంగా ఉంది. దలైలామా టిబెట్ వారసుడన్న విషయంపై చైనా అభ్యంతరం తెలిపింది. వారసత్వ వ్యవహారాలపై భారత్ జోక్యం చేసుకోబోదని విదేశాంగ మంత్రిత్వ శాఖ సూచనలిచ్చింది. దీనికి కట్టుబడి ఉంటే తక్షణం సమస్య ఏమీ ఉండదు. ట్రంప్ సుంకం విధింపు యుద్ధం చేస్తున్న నేపథ్యంలో భారత్, చైనా వాణిజ్య సంబంధాల వ్యవహారం పెండింగ్‌లో ఉంది. వాణిజ్యంలో చైనా అత్యంత సానుకూల బ్యాలెన్సును కలిగి ఉంది. గతంలో చైనా భారత్ వ్యతిరేక ధోరణిలో పనిచేసేది. ఇప్పుడు వాణిజ్య సమతుల్యతను సరిదిద్దుకునే అవకాశం ఉంది. చైనా నుంచి దిగుమతులు తగ్గించుకున్నట్లయితే ఈ సమస్య పరిష్కారం అవుతుందని భారత్ వాణిజ్య

మంత్రిత్వశాఖ అధికారులు తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఔషధాల తయారీ పరిశ్రమలు దిగుమతుల తగ్గింపు కోసం గణనీయంగా ఉత్పత్తులను పెంచవలసి ఉంటుంది. అయితే ప్రస్తుతానికి ఆ పరిస్థితులేమీ కనిపించడం లేదు. 2025 లోను భారత్ వాణిజ్య లోటు కారణంగా చైనా వంద బిలియన్ అమెరికా డాలర్ల ఆదాయంలో ఉన్నది.

ట్రంప్ సుంకాల యుద్ధం చేస్తున్న సందర్భంలో వాషింగ్టన్‌తో తాత్కాలిక వాణిజ్య సంబంధాలపై చర్చలు తుది దశలో ఉన్నాయి. చైనాను దెబ్బకొట్టేందుకు భారత్‌ను వాణిజ్య హబ్‌గా మార్చు చేసేందుకు అమెరికా ప్రయత్నించనున్నది. తమ ఎగుమతులను దెబ్బతీసే విధంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు తీసుకుంటే సహించబోమని చైనా ఇప్పటికే ఆయా దేశాలను హెచ్చరించింది. ప్రపంచంలో చైనా అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలో రెండవ స్థానంలో ఉంది. గత నెలలో లండన్‌లో జరిగిన సమావేశంలో అమెరికాతో ఒప్పందంపై జరిగిన చర్చల సందర్భంగా చైనా అనేక అంశాలలో అమెరికా దాడులు జరగకుండా తనను తాను రక్షించుకున్నది. భారత్ చైనా వలే అమెరికాతో వాణిజ్య ఒప్పందం చర్చలలో బలమైన శక్తిని చూపించడంలేదు. అమెరికా ఆదేశాలకు భారత్ లొంగిపోవడం కన్పిస్తుంది. ఈ నేపథ్యంలో చైనా వాణిజ్యానికి హాని కలుగుతోంది. ఫలితంగా భారత్, చైనా వాణిజ్య సంబంధాలలో కొత్త సమస్యలు ఎదురుకావచ్చు. చైనా ఇప్పటికే భారత్ ఆర్థిక రంగానికి హాని కలిగే విధంగా తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో ఉన్న ఫాక్స్‌కాన్, ఐఫోన్ ఫ్యాక్టరీల నుంచి తమ ఇంజినీర్లను వెనక్కు పిలిపించుకున్నదన్న ప్రచారం సాగుతోంది. ఒకవేళ భారత్ రానున్న రెండు మూడేళ్ల కాలంలో ప్రపంచంలో తృతీయ ఆర్థిక వ్యవస్థగా పెరుగుతుందని భావించినప్పటికీ ఆనాటికి చైనా ఆర్థిక వ్యవస్థ భారత్ కంటే ఆరు రెట్లు అధికంగా ఆర్థిక స్థాయి పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పటికీ ఆర్థిక వ్యవస్థలో చైనా అమెరికా ఆర్థిక వ్యవస్థతో సరిసమానం అయ్యే అవకాశాలు కూడా లేకపోలేదు. దక్షిణాసియా దౌత్య రంగంలో ఇటీవల భారత్‌పై చైనా ఆధిక్యాన్ని ప్రదర్శించింది. చైనా సార్క్ లాంటి కూటమిని ఏర్పాటు చేసేందుకు పాకిస్థాన్ బంగ్లాదేశ్‌లతో చర్చలు జరిపింది. అయితే ఇందులో భారత్‌ను భాగస్వామ్యం చేయలేదు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ పొరుగున ఉన్న అమిత్ర దేశాలుగా ఉంటాయి. అనేక సున్నితమైన అంశాలలో భారత్ విదేశాంగ శాఖ అధికారులు మంచి నైపుణ్యాలను కలిగి ఉన్నారు. చర్చలలో వీరు తమ నైపుణ్యాన్ని బలంగా ప్రదర్శించినట్లయితే ఇండియాకు ప్రయోజనం కలుగుతుంది.

జమ్మూకశ్మీర్ సంపూర్ణ రాష్ట్రం కావాలి

- హామీ మేరకు తక్షణమే హోదా పునరుద్ధరించాలి
- కాంగ్రెస్ డిమాండ్- ప్రధానికి ఖడ్గే, రాహుల్ లేఖ
- స్వాగతించిన సీఎం ఒమర్ అబ్దుల్లా

న్యూఢిల్లీ/జమ్ము: 'రాష్ట్రంగా ఉన్న జమ్మూకశ్మీర్‌ను ముక్కలు చేసి కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చారు. సరైన సమయంలో రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని చెబుతున్నారేగానీ ఆచరించడం లేదు. ఇది తక్షణమే జరగాలి' అని ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఇచ్చిన హామీ మేరకు జమ్మూకశ్మీర్‌కు సంపూర్ణ రాష్ట్ర హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖడ్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించేలా తీర్మానం చేయాలని కోరారు. గతంలో కేంద్ర పాలిత ప్రాంతాలకు రాష్ట్ర హోదా కల్పించిన సందర్భాలు ఉన్నాయి కానీ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా స్థాయి దిగజార్చడం ఇదే మొదటిసారిగా పేర్కొన్నారు. 2019లో అధికరణ 370 రద్దు చేసి, జమ్మూకశ్మీర్‌ను చీల్చి, రాష్ట్ర హోదా తొలగించి, కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించారు. దీంతో అక్కడి భూములను కొనేందుకు, ఉద్యోగాలు పొందేందుకు స్థానికేతరులకు హక్కు లభించింది. సంపూర్ణ రాష్ట్ర హోదా గురించి కశ్మీర్ ప్రజలకు అనేక సందర్భాల్లో ఇచ్చిన హామీలను ఖడ్గే, రాహుల్ గుర్తుచేశారు. '2024, మే 19న భువనేశ్వర్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూలో 'రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామన్న హామీకి కట్టుబడి ఉన్నాం' అని మోదీ అన్నారు. అదే సంవత్సరం సెప్టెంబరు 19న శ్రీనగర్‌లో ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ 'రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని పార్లమెంటులో చెప్పాం' అన్నారు. సుప్రీం కోర్టులోనూ ఇదే తరహాలో అనేకసార్లు భరోసానిచ్చారు' అని ఖడ్గే, రాహుల్ పేర్కొన్నారు. లదాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చే శాసనాన్ని కోరారు. తద్వారా లదాఖ్ ప్రజల రాజకీయ ఆకాంక్షలు నెరవేరుతాయని అన్నారు. సాంస్కృతిక, మానసిక వికాసానికి అవకాశం లభిస్తుందని, వారి హక్కులు, భూములు, గుర్తింపు పరిరక్షణకు హామీ ఉంటుందని మోదీకి సూచించారు. గతేడాది జమ్మూకశ్మీర్‌లో ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు అయినా అధికారం లెఫ్టినెంట్ గవర్నర్ మనజ్ సిన్హా చేతులోనే ఉంది. అమరుల దినోత్సవం సందర్భంగా సీఎం ఒమర్ అబ్దుల్లాతో పోలీసుల దురుసు వ్యవహారం ఆక్షేపణీయం' అని పేర్కొన్నారు. కాగా, అమరుల దినం సందర్భంగా సీఎంతో పాటు ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను గృహ నిర్బంధంలో ఉంచారు.

ఇందుకోసమే ఎదురుచూస్తున్నాం: ఒమర్ అబ్దుల్లా

పార్లమెంటు సమావేశాలకు ముందు జమ్మూకశ్మీర్‌కు సంపూర్ణ రాష్ట్ర హోదా పునరుద్ధరణ గురించి కాంగ్రెస్ డిమాండ్ చేయడాన్ని సీఎం ఒమర్ అబ్దుల్లా స్వాగతించారు. కాంగ్రెస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్షం తమ తరఫున గళం వినిపించే రోజు కోసం ఎంతో కాలంగా జమ్మూకశ్మీర్ ప్రజలు ఎదురు చూస్తున్నారని ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఖడ్గే, రాహుల్ ఓ మంచి పని చేశారు. పార్లమెంటు, దిల్లీలో ప్రతిపక్షాలు ఎప్పుడు మా గురించి ప్రస్తావిస్తాయా అని నిరీక్షిస్తున్నాం. కేంద్రం దృష్టికి రాష్ట్ర హోదా అంశాన్ని తీసుకెళ్లిన ఖడ్గే, రాహుల్‌కు కృతజ్ఞులం' అని ఒమర్ అన్నారు. పార్లమెంటు లోపల, బయట రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామంటూ మాకు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నదే మా డిమాండ్ అని చెప్పారు. జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణలో మరింత జాప్యం తగదున్నారు. పార్లమెంటు సమావేశాల ప్రారంభం రోజున ఘెరావ్‌కు కాంగ్రెస్ సిద్ధమవుతుండటంపై ఓ విలేకరి ప్రశ్నించగా, 'ఇంకా వారితో చర్చించలేదు.

తెల్ల షర్టు, నల్ల ప్యాంటుతో రావద్దు

రోహిణి కోర్టు

న్యూఢిల్లీ: కోర్టు పరిసరాల్లోకి న్యాయవాదులు తప్ప మరెవ్వరూ తెల్ల షర్టు, నల్ల ప్యాంటుతో రాకూడదని దిల్లీలోని రోహిణి కోర్టు బార్ అసోసియేషన్ నిషేదాజ్ఞలు విధించింది. కొందరు న్యాయవాదుల వలే తెల్ల షర్టు, నల్ల ప్యాంటులతో వచ్చి మోసాలకు పాల్పడుతున్నట్లు కోర్టు గుర్తించింది. దీంతో న్యాయవాదులు తప్ప ఎవ్వరూ తెల్ల షర్టు, నల్ల ప్యాంటుతో కోర్టు పరిసరాల్లోకి రావద్దు అని నోటీసు జారీ చేసింది. కొంతమంది మధ్యవర్తులు తమను తాము న్యాయవాదులు లేదా వారి గుమస్తాలుగా చెప్పుకుంటూ మోసాలకు పాల్పడుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని కోర్టు తెలిపింది. దీంతో గుమస్తాలు, వ్యాజ్యాలు దాఖలు చేసేవారు, సాధారణ ప్రజలు ఎవరూ తెల్ల చొక్కా, నల్ల ప్యాంటు ధరించకూడదని పేర్కొంది. అందుకే కోర్టు పరిసరాల్లోకి న్యాయవాదులు మాత్రమే అలాంటి దుస్తులు ధరించి రావాలని స్పష్టం చేసింది. గతంలో ఇలాంటి మోసాలను నివారించేందుకు న్యాయవాదుల గుమస్తాలకు ఐడీ కార్డులను జారీ చేసిన విషయాన్ని కోర్టు గుర్తు చేసింది.

72 గంటల్లో 10 బాంబు బెదిరింపులు

ఆప్-బీజేపీ మధ్య రాజకీయ దుమారం

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో బుధవారం ఉదయం ఐదు ప్రైవేటు పాఠశాలకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు చేపట్టగా, ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లభ్యం కాలేదు. దీంతో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ మధ్య మాటల యుద్ధం జరిగింది. మూడు రోజుల్లో ఇప్పటి వరకు తొమ్మిది పాఠశాలలకు 10 బాంబు బెదిరింపు ఈమెయిల్స్ వచ్చాయి. అధికారుల వివరాల ప్రకారం... బుధవారం ఉదయం ద్వారకలోని సెయింట్ థామస్ పాఠశాలను పేల్చివేస్తామంటూ మెయిల్ వచ్చినట్లు ఉదయం 5.26 గంటలకు తమకు ఫోన్ వచ్చిందని అగ్నిమాపక సిబ్బంది పేర్కొంది. అలాగే ఉదయం 6.30 గంటలకు వసంత్ కుంజ్‌లోని వసంత్ వ్యాలీ స్కూల్, 8.12 గంటలకు హౌజ్‌ఖాస్‌లోని మదర్ ఇంటర్నేషనల్ స్కూల్, 8.11 గంటలకు రిచ్మండ్ గ్లోబల్ స్కూల్ నుంచి ఫోన్లు వచ్చాయని అగ్నిమాపక సిబ్బంది వివరించారు. సర్దార్ పటేల్ విద్యాలయానికి కూడా బాంబు బెదింపు సందేశాలు వచ్చినట్లు పేర్కొన్నారు. స్థానిక పోలీసులు, బాంబ్ స్క్వాడ్ వెంటనే సంబంధిత పాఠశాలలకు చేరుకుని తనిఖీలు నిర్వహించారు. అప్పటికే పాఠశాలలకు వచ్చిన విద్యార్థులను పాఠశాల గేట్ల బయటకు పంపించి, వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సెయింట్ థామస్ స్కూల్‌కు బాంబు బెదిరింపు రావడం ఇది రెండోసారి.

బీజేపీ ప్రభుత్వం విఫలం: కేజ్రీవాల్

పాఠశాలలకు బాంబు బెదిరింపులపై బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'పిల్లలు భయంతో ఉన్నారని, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారనీ, బీజేపీ నేతృత్వంలోని నాలుగు ఇంజిన్ల ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి' అని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. సౌరభ్ భరద్వాజ్ స్పందిస్తూ పరిపాలన ఇలానే కొనసాగుతుందా అని ప్రశ్నిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అన్ని దర్యాప్తు సంస్థలు ప్రతిపక్ష నాయకులపై నిఘా ఉంచడం, వారిపై తప్పుడు కేసులు నమోదు చేయడంలో మాత్రమే బిజీగా ఉన్నాయా... 'నేను బీజేపీ నేతను అభ్యర్థిస్తున్నా, దయచేసి ప్రతిపక్ష నాయకుల వెనుక ఉన్న దర్యాప్తు సంస్థలను తొలగించి, పాఠశాలలకు బాంబు బెదిరింపులు ఎవరు చేస్తున్నారో తెలుసుకోండి' అని ఆప్ నాయకుడు మనీశ్ సిసోదియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

సున్నితమైన అంశాలపై రాజకీయాలా? బీజేపీ

కేజ్రీవాల్ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విరేంద్ర సచ్‌దేవా తీవ్రంగా స్పందించారు. పాఠశాలల నుంచి విమానయాన సంస్థలకు ఇటువంటి ఈమెయిల్ బెదిరింపులు ఆందోళన కలిగించే విషయం. కానీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏ పార్టీలు అయిన ఇలాంటి అంశాలపై రాజకీయాలు చేయవు. బదులుగా అవి భద్రతా సంస్థలతో సహకరిస్తాయి. కానీ మన దేశంలో అరవింద్ కేజ్రీవాల్ వంటి తక్కువ స్థాయి నాయకులు ఇలాంటి సున్నితమైన అంశాలపై కూడా వ్యాఖ్యలు చేస్తున్నారు అని మండిపడ్డారు.

కాలం చెల్లిన ఆయుధాలతో విజయం సాధించలేం

సీడీఎస్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: భారత సైన్యం ఆధునీకరణపై దృష్టి సారించాల్సి ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. ఆధునిక యుద్ధ సన్నాహాల్లో సైబర్ దాడులు, డ్రోన్ ఆధారిత దాడులు కీలక పాత్ర పోషిస్తున్నాయని... మన శత్రువులు నిరంతరం కొత్త సాంకేతికతలను అవలంబిస్తున్నారని చౌహాన్ పేర్కొన్నారు. ఆధునిక యుద్ధ సవాళ్లను ఎదుర్కోవడానికి సంప్రదాయ ఆయుధాలు సరిపోవని స్పష్టం చేశారు. భారత సైన్యం అత్యాధునిక సాంకేతికత, ఆధునిక యుద్ధ వ్యూహాలను అవలంబించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఈ మేరకు గతంలో 'ఆపరేషన్ సిందూర్'ను ఉదహరిస్తూ ఆధునిక సాంకేతికత ప్రాముఖ్యతను వివరించారు. న్యూదిల్లీలో జరిగిన ఒక రక్షణ సదస్సులో మాట్లాడిన అనిల్ చౌహాన్... ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుత యుద్ధాలను గత కాలపు ఆయుధాలతో గెలవడం సాధ్యం కాదు. ఆధునిక యుద్ధం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ టెక్నాలజీ, సైబర్ వార్‌ఫేర్, అధునాతన ఆయుధ వ్యవస్థలపై ఆధారపడి ఉంటుంది. ఆపరేషన్ సిందూర్ వంటి కార్యకలాపాలు ఈ వాస్తవాన్ని స్పష్టంగా చూపించాయి" అని ఆయన అన్నారు. ఈ ఆపరేషన్ విజయం ఆధునిక యుద్ధ పద్ధతులు, సాంకేతికత ప్రాముఖ్యతను రుజువు చేసిందని జనరల్ చౌహాన్ పేర్కొన్నారు.

ఆధునిక యుద్ధ సన్నాహాల్లో సైబర్ దాడులు, డ్రోన్ ఆధారిత దాడులు, ఇంటెలిజెన్స్ ఆధారిత కార్యకలాపాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జనరల్ చౌహాన్ తెలిపారు. భారత సైన్యం ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి తన సామర్థ్యాలను నిరంతరం అప్‌గ్రేడ్ చేసుకోవాలని, అందుకు ప్రభుత్వం, రక్షణ పరిశోధన సంస్థల సహకారం అవసరమని పేర్కొన్నారు. "మన శత్రువులు నిరంతరం కొత్త సాంకేతికతలను అవలంబిస్తున్నారు. మనం కూడా వాటికి తగ్గట్టుగా ముందుకు సాగాలి. ఆపరేషన్ సిందూర్ లాంటి విజయాలు మన సామర్థ్యాన్ని చూపిస్తాయి. కానీ మనం ఇంకా చాలా ముందుకు వెళ్లాలి" అని ఆయన అన్నారు. భారత సైన్యం ఇటీవల డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో) సహకారంతో అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీ, సైబర్ రక్షణ వ్యవస్థలను అభివృద్ధి చేస్తోంది. జనరల్ చౌహాన్ ఈ ప్రయత్నాలను ప్రశంసిస్తూనే, రక్షణ బడ్జెట్‌లో సాంకేతిక పరిజ్ఞానానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ సమాధానం చెప్పాలి

కాంగ్రెస్

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 21 నుంచి జరగనున్న తరుణంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ప్రశ్నల వర్షం కురిపించడానికి సిద్ధమవుతోంది. భారత్- పాక్‌ల మధ్య కాల్పుల విరమణ తానే చేశానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనేకమార్లు చేసిన వ్యాఖ్యలపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని మరోసారి కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్‌రమేశ్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ట్యాగ్ చేశారు. "భారత్ పాక్ మధ్య అణు యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ 23 సార్లు పునరుద్ఘాటించారు. ఈ నెల 21 నుంచి వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు జరగనున్నాయి. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రధాని మోదీ దీనిపై స్పష్టమైన సమాధానం చెప్పాలి. దేశ ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారు" అని జైరాం రమేశ్ పోస్టులో పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మే 10 నుంచి ట్రంప్ భారత్-పాకిస్థాన్ మధ్య తానే సయోధ్య కుదిర్చినట్లు సోషల్ మీడియాలో ప్రకటిస్తూ వస్తున్నారు. తాజాగా సోమవారం పునరుద్ఘాటించారు.

పాక్ సరిహద్దుల్లో అపాచీ హెలికాప్టర్లతో నిఘా

న్యూఢిల్లీ: భారత వైమానికదళం యుద్ధ, నిఘా సామర్థ్యం మరింత శక్తివంతం కానుంది. ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న అపాచీ హెలికాప్టర్లు ఈనెల 21న అమెరికా నుంచి అందనున్నాయి. వాటిని పాకిస్థాన్ సరిహద్దుల్లో మోహరించనున్నట్లు రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. ఈ హెలికాప్టర్లను ట్యాంక్-ఇన్-ఎయిర్‌గా పిలుస్తారు. ఈ ఏహెచ్-64ఇ అధునాతన హెలికాప్టర్ల స్క్వాడ్రన్‌ను హిండన్ వైమానిక స్థావరంలో మోహరించనున్నట్లు పేర్కొన్నారు. కాగా, అయితే 15 నెలల క్రితం సైన్యానికి తొలి విడత అపాచీ హెలికాప్టర్లు అందగా వాటిని జోధ్‌పుర్ సైనిక స్థావరంలో మోహరించారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ పరిస్థితులు అస్థిరంగా ఉన్న నేపథ్యంలో మరో విడత అపాచీ హెలికాప్టర్ల బట్వాడా ఆలస్యమైంది. ఇప్పటికే వైమానిక దళానికి రెండు స్క్వాడ్రన్ల అపాచీ హెలికాప్టర్లు అందగా... వాటిని పఠాన్‌కోట్, జోర్హాట్‌లో మోహరించారు. గతంలో భారత వైమానిక దళం 22 అపాచీ హెలికాప్టర్లు కొనుగోలు కోసం అమెరికా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. వాటిని 2020 జులైలో బట్వాడా చేసింది. 2021లో అమెరికా అధ్యక్షునిగా తొలిసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనకు వచ్చిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆరు వందల మిలియన్ డాలర్లకు ఆరు అపాచీ హెలికాప్టర్లు కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకుంది. కాగా, అపాచీ హెలికాప్టర్లు ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లో అయినా లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించగలవు. అత్యాధునిక వ్యవస్థలతో రూపొందించిన వాటిలో నైట్ విజన్ నావిగేషన్ వ్యవస్థలు ఉన్నాయి. అవి సైన్యం సామర్థ్యాలను మరింత ప్రభావవంతంగా చేస్తాయి. అదనంగా వాటిలో కమ్యూనికేషన్, నావిగేషన్, సెన్సార్, ఆయుధ వ్యవస్థలు కూడా ఉన్నాయి. అపాచీ హెలికాప్టర్లను దాడి చేయడానికి మాత్రమే కాకుండా భద్రత, నిఘా, శాంతి కార్యకలాపాల్లోనూ ఉపయోగించవచ్చు.

పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో

8 కొత్త బిల్లులు

న్యూఢిల్లీ : సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం ఎనిమిది బిల్లులను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. వాటిలో భౌగోళిక వారసత్వ ప్రదేశాలు, భౌగోళిక అవశేషాలను సంరక్షించడానికి ప్రయత్నించే బిల్లు ఒకటి. వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని యోచిస్తున్న బిల్లుల్లో జాతీయ క్రీడా పాలన బిల్లు, భౌగోళిక వారసత్వ ప్రదేశాలు, భౌగోళిక అవశేషాలు (సంరక్షణ, నిర్వహణ) బిల్లు, గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు ఉన్నాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 21 వరకు ఉభయ సభలు మొత్తం 21 సమావేశాలు జరుగుతాయి. రక్షా బంధన్, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం ఆగస్టు 12 నుంచి ఆగస్టు 18 వరకు ఈ సమావేశాలు విరామం తీసుకుంటాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా ఐక్య సంఘటనతో సహా అధికార బీజేపీ, ప్రతిపక్షాల మధ్య ఈ సమావేశంలో తీవ్ర వాగ్వాదం జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది చివరిలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విషయంలో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య వివాదం తలెత్తే అవకాశం ఉంది. అలాగే ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించడం ద్వారా భారత్-పాకిస్థాన్ మధ్య అణు యుద్ధాన్ని నివారించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలపై కూడా ప్రతిపక్షాలు ప్రభుత్వం నుంచి సమాధానాలు కోరనున్నాయి. మరో నాలుగు కొత్త బిల్లులు మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (సవరణ) బిల్లు, జన విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు, పన్ను చట్టాలు (సవరణ) బిల్లు. వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం ఆదాయపు పన్ను బిల్లు-2025 ను కూడా ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లును ఫిబ్రవరిలో లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దిగువ సభ సెలెక్ట్ కమిటీకి పంపారు. ప్యానెల్ బుధవారం తన నివేదికను ఆమోదించింది. సోమవారం లోక్‌సభలో సమర్పించే అవకాశం ఉంది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు కోసం ప్రభుత్వం పార్లమెంటు అనుమతి కోరనుంది. రాష్ట్ర గ్రాంట్ల డిమాండ్‌ను సభ ఆమోదం కోసం ఉంచనుంది. గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు-2024, మర్చంట్ షిప్పింగ్ బిల్లు-2024, ఇండియన్ పోర్ట్స్ బిల్లు-2025 లోక్‌సభ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయి.

బస్సులోనే ప్రసవం... బిడ్డను కిటికీలో నుంచి విసిరేసిన యువతి

మహారాష్ట్రలో దారుణం

ముంబై: మహారాష్ట్రలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. బస్సు ప్రయాణంలో ఓ బిడ్డకు జన్మనిచ్చిన యువతి.. ఆ పసికందును కిటికీలో నుంచి బయటకు విసిరేసింది. దీంతో గాయాలపాలైన ఆ పసికందు అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా... పోలీసులు బస్సును ఆపి తనిఖీ చేశారు. పందొమ్మిదేళ్ల యువతిని, ఆమెతో పాటు ఉన్న యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పర్భణికి చెందిన రితిక ధీరే, అల్తాఫ్ షేక్ లు కొంతకాలంగా పూణేలో జీవిస్తున్నారు. ఈ క్రమంలో రితిక గర్భం దాల్చింది. తాజాగా సోమవారం రాత్రి నిండు గర్భిణి రితికతో అల్తాఫ్ పర్భణి బయలుదేరాడు. స్లీపర్ కోచ్ లో రాత్రంతా ప్రయాణించారు. తెల్లవారుజామున రితికకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. పత్రి- సేలు రోడ్డులో ప్రయాణిస్తుండగా బస్సులోనే బిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన బిడ్డను అల్తాఫ్ ఓ గుడ్డలో చుట్టి కిటికీలో నుంచి బయటకు విసిరేశాడు. బస్సులో నుంచి ఏదో వస్తువు పడడం చూసిన స్థానికుడు దగ్గరికి వెళ్లి పరిశీలించాడు. అందులో పసిబిడ్డను చూసి వెంటనే పోలీసులకు ఫోన్ చేశాడు. విషయం తెలిసిన వెంటనే స్పందించిన పోలీసులు ఆ బస్సును ఆపి రితిక, అల్తాఫ్ లను అదుపులోకి తీసుకున్నారు. చికిత్స కోసం రితికను ఆసుపత్రిలో చేర్పించి అల్తాఫ్ ను విచారించారు. తాము భార్యాభర్తలమని, బిడ్డను పెంచే స్తోమత లేకపోవడం వల్లే ఈ పని చేశామని అల్తాఫ్ చెప్పుకొచ్చాడు. అయితే, వారిద్దరూ భార్యాభర్తలు అనేందుకు ఎలాంటి ఆధారం చూపలేకపోయాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

రౌడీ హత్య కేసులో బీజేపీ ఎమ్మెల్యేపై ఎఫ్ఐఆర్

బెంగుళూరు: కర్నాటకలోని ఈస్ట్రన్ బెంగుళూరులో ఓ రౌడీషీటర్ హత్యకు గురయ్యాడు. నలుగురు వ్యక్తులు కత్తులతో అతడిపై దాడి చేసి చంపారు. ఆ కేసులో బీజేపీ ఎమ్మెల్యే బైరతి బసవరాజ్‌తో పాటు అయిదుగురిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... హలసూరుకు చెందిన శివకుమార్ అలియాస్ బిక్లు శివ (40) అనే రౌడీని భారతీనగర్ మీనే అవెన్యూ రోడ్డుపై హత్య చేశారు. మోటరుసైకిళ్లపై వచ్చిన నలుగురు హత్యకు పాల్పడ్డారు. శివకుమార్ తల్లి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అయిదుగురిపై కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే బసవరాజ్‌తో పాటు జగదీశ్, కిరన్, విమల్, అనిల్ ఉన్నారు. ఆస్తి వివాదం వల్ల హత్య జరిగినట్లు అంచనా వేస్తున్నారు. బీజేపీ ఎమ్మెల్యే రెచ్చగొట్టడం వల్లే నిందితులు రౌడీని హత్య చేసినట్లు తెలుస్తోంది. భారతీయ న్యాయ సంహితలోని 103 సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరుగుదొడ్ల కొరతపై నివేదికివ్వని

హైకోర్టులకు సుప్రీం చీవాట్లు

న్యూఢిల్లీ: కోర్టుల్లో మరుగుదొడ్ల కొరతపై నివేదికలు దాఖలు చేయకపోవడంతో 20 హైకోర్టులకు సుప్రీంకోర్టు బుధవారం చీవాట్లు పెట్టింది. ఎనిమిది వారాల్లోగా నివేదికలు సమర్పించాలని గడువు విధించింది. చాలా హైకోర్టులు ఇప్పటికీ తమ అఫిడవిట్లు/సమ్మతి నివేదికలు దాఖలు చేయలేదని, ఇది వాటికి చివరి అవకాశమని జస్టిస్ జె.బి.పార్దివాలా, ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. గడువులోపల నివేదికలు దాఖలు చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ధర్మాసనం హెచ్చరించింది. ఆదేశాలను పాటించడంలో విఫలమైతే... హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్‌లు వ్యక్తిగతంగా కోర్టులో హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. జార్ఖండ్, మధ్యప్రదేశ్, కోల్‌కత్తా, దిల్లీ,పట్నా హైకోర్టులు మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేసినట్లు ధర్మాసనం పేర్కొంది. అయితే దేశంలో 25 హైకోర్టులు ఉన్నాయి.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం సరైన పారిశుద్ధ్యం ప్రాథమిక హక్కుగా గుర్తించబడిందని ఈ ఏడాది జనవరి 15న కోర్టు తీర్పునిచ్చింది. అన్ని కోర్టు ప్రాంగణాలు... ట్రిబ్యునల్స్‌లో పురుషులు, మహిళలు, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్‌కి ప్రత్యేక మరుగుదొడ్డి సౌకర్యాల లభ్యత ఉండేలా చూడాలని హైకోర్టులు, రాష్ట్ర ప్రభుత్వాలు... కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. మరుగుదొడ్ల లభ్యతపై నాలుగు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని కూడా కోరింది. న్యాయవాది రాజీవ్ కలిత దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది.

ముంచుకొచ్చిన 'ఓజోన్' ముప్పు

ప్రధాన నగరాల్లో పెరిగిన కాలుష్యం

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

సీఎస్ఈ విశ్లేషణ వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో ఓజోన్ కాలుష్యం విపరీతంగా పెరిగిపోయి, తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలకు దారితీసిందని, కోల్‌కతా, బెంగళూరు, ముంబై, హైదరాబాద్, చెన్నైతో సహా దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో ఈ వేసవి కాలంలో భూ స్థాయిలో ఓజోన్ కాలుష్యం అధికంగా ఉందని థింక్ ట్యాంక్ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) చేసిన కొత్త విశ్లేషణ తెలిపింది. ఈ వేసవిలో చాలా రోజుల పాటు దిల్లీ రోజువారీ వాయు నాణ్యత సూచి (ఏక్యూఐ) కణిక పదార్థానికి బదులుగా ఓజోన్ ప్రధాన కాలుష్య కారకంగా ఉందని మునుపటి విశ్లేషణలో తేలింది. సీఎస్ఈ అర్బన్ ల్యాబ్ చేసిన కొత్త విశ్లేషణ... ప్రాథమిక కాలుష్య కారకాల మాదిరిగా కాకుండా ఓజోన్ ఏ మూలం నుంచి నేరుగా విడుదల కాదని ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఇది నైట్రోజన్ ఆక్సైడ్లు (ఎన్ఓఎక్స్), అస్థిర సేంద్రీయ సమ్మేళనాలు (వీఓసీలు), కార్బన్ మోనాక్సైడ్ (సీవో), విద్యుత్ ప్లాంట్లు, పరిశ్రమలు, దహన ఇతర వనరుల ద్వారా విడుదలయ్యే కాలుష్య కారకాలతో కూడిన సంక్లిష్ట రసాయన ప్రతిచర్యల ద్వారా ఏర్పడుతుంది. ఈ పదార్థాలు సూర్యకాంతి సమక్షంలో చర్య జరుపుతాయి. ఇది భూ స్థాయిలో ఓజోన్ ఏర్పడటానికి దారితీస్తుంది. సీఎస్ఈ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుమిత రాయ్‌చౌదరి ఇలా అన్నారు : ఓజోన్ అత్యంత రియాక్టివ్ వాయువు, స్వల్పకాలిక ఎక్స్‌పోజర్‌లతో కూడా హానికరం కావచ్చు. అందువల్ల దీనిని నియంత్రించకపోతే ఇది తీవ్రమైన ప్రజారోగ్య సంక్షోభంగా మారవచ్చు. ఉత్తర భారతదేశంలోని నగరాలు వేసవిలో తీవ్రమైన వేడి, బలమైన సూర్యకాంతి కారణంగా అధిక ఓజోన్ స్థాయిలను అనుభవిస్తుండగా వెచ్చని వాతావరణంలో ఉన్న నగరాలు ఇతర సీజన్లలో కూడా స్థిరమైన ఓజోన్ స్థాయిని చూస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుత విధాన దృష్టిని మెరుగైన పర్యవేక్షణ, ఈ విష వాయువును తగ్గించడం, అధిక స్థానిక ఎక్స్‌పోజర్‌లను తగ్గించడం వంటివి చేర్చడానికి విస్తరించాలన్నారు.

వాహనాలు, పరిశ్రమ, ౹అన్ని దహన వనరుల నుంచి వచ్చే వివిధ రకాల వాయువులపై ఓజోన్ తగ్గింపునకు తీవ్ర నియంత్రణ అవసరమని రాయ్‌చౌదరి అన్నారు. సీఎస్ఈ అర్బన్ ల్యాబ్ డిప్యూటీ ప్రోగ్రామ్ మేనేజర్ శరణ్జీత్ కౌర్ ఇలా పేర్కొన్నారు : ఏఐక్యూని అంచనా వేయడానికి ప్రామాణిక పద్ధతి అయిన నగరానికి స్థాయిలను సగటున లెక్కించడానికి బదులుగా, హాట్‌స్పాట్‌లలో స్థానికంగా అధిక స్థాయిల నిర్మాణం, బహిర్గతాలను తగినంతగా సంగ్రహించడం, తదనుగుణంగా ఉపశమన వ్యూహాలను రూపొందించడం కూడా ముఖ్యం' అని అన్నారు. కోల్‌కతాలో 92 రోజుల్లో 22 రోజుల్లో ఓజోన్ స్థాయిలు సురక్షిత పరిమితిని దాటాయి. గత వేసవితో పోలిస్తే ఇది 45 శాతం తగ్గుదల. నగరం కూడా మొత్తం మెరుగుదలను చూసింది, సగటు గంట ఓజోన్ శిఖరం 22 శాతం తగ్గింది. బెంగళూరులో 92 రోజులలో 45 రోజులలో ఓజోన్ పరిమితి మించి పోయింది. ఇది గత సంవత్సరం కంటే 29 శాతం పెరుగుదల. మార్చి 31న అత్యంత దారుణమైన రోజు 14 ప్రాంతాలకుగాను నాలుగు ప్రాంతాల్లో ప్రమాణం కంటే ఎక్కువ స్థాయిలను నమోదు చేశాయి.

ఇక హైదరాబాద్‌లో 20 ఓజోన్ పరిమితి మించిపోయిన రోజులు నమోదయ్యాయి. గత వేసవితో పోలిస్తే ఇది 55 శాతం తగ్గుదల. నగరంలో అత్యధిక ఓజోన్ స్థాయి క్యూబిక్ మీటర్‌కు 51 మైక్రోగ్రాములు. ఈ వేసవిలో చెన్నైలో 15 రోజుల్లో ఓజోన్ స్థాయి మించిపోయింది. గత సంవత్సరం ఇదే కాలంలో అలాంటి పరిమితి దాటినట్లు నివేదించలేదు.

విశాలాంధ్ర హైదరాబాద్

పరిశ్రమల స్థాపనకు తెలంగాణ అనుకూల రాష్ట్రం

ఫ్రాన్స్ కాన్సల్ జనరల్ బృందంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : టెక్నాలజీ తదితర పరిశ్రమల స్థాపనకు తెలంగాణ రాష్ట్రం అనుకూలమైన ప్రాంతమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుతో ఫ్రాన్స్ కాన్సల్ జనరల్ మార్క్ లేమి బృందం మర్యాదపూర్వకంగా భేటీ అయింది. రాష్ట్రంలో వనరులు ఇతర అంశాలను అధ్యయనం చేయాల్సిందిగా డిప్యూటీ సీఎం ఫ్రాన్స్ బృందానికి సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు వెంటనే పూర్తి చేయలని మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి బ్యాంగి బలకిషన్ డిమాండ్ చేశారు. బుధవారం జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్‌లో సీపీఐ పార్టీ మండల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం యుద్ధ ప్రగతిపాదికన పూర్తి చేయాలని ముంపునకు గురైన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని మార్కెట్ వాస్తవ ధర కంటే రెండింతలు అధికంగా ఇచ్చి రైతులను ఆదుకోవాలని వారికి పునరావాసం కల్పిస్తూ ఇల్లు వెంటనే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కనీస వేతన చట్టాలు అమలు చేయాలని అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఇందిరమ్మ ఇల్లు రేషన్‌కార్డులు రుణమాఫీ లాంటి పథకాలు అందరికీ వర్తింప చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ అల్వాల్ రెడ్డి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సి, రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ ఎన్నుకోవడం జరిగింది మండల కార్యదర్శిగా బాగి కృష్ణయ్య సహాయ కార్యదర్శిగా ఎండి కలీం ఎన్నుకున్నారు కమిటీ సభ్యులుగా రాజు, సూరి, ఆంజనేయులు, శ్రీశైలం, రహమతుల్లా, చిన్న జంగయ్య, వెంకటయ్య, నాగరాజును ఎన్నుకున్నారు.

ఇంటింటికి ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఘట్కేసర్ మున్సిపాలిటి ఔషాపూర్ గ్రామంలో బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధిక గుప్తా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అధిక సంఖ్యలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఇంటింటికి ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఘట్కేసర్ మున్సిపల్ కమిషనర్, అనురాగ్ విశ్వవిద్యాలయ విద్యార్థులు కూడా ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు.

డీజీపీని కలిసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : తెలంగాణ రాష్ట్ర పోలీసు ముఖ్య కార్యాలయం హైదరాబాద్‌లో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) డాక్టర్ జితేందర్‌ని కలిసి శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ అల్వాల్‌లో జరిగిన బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఉల్లంఘన వివాదంపై డిజిపికి కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనిల్ కిషోర్ గౌడ్, నాయకులతో కలిసి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వినతిపత్రము అందజేశారు. దీనిపై డిజిపి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో లడ్డు, నరేందర్ రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, పవన్, ప్రశాంత్ రెడ్డి, రేవంత్ రెడ్డి, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

టిజిపిసిబిలో ఘనంగా ఆషాఢమాస బోనాల జాతర

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) సనత్నగర్ ఆధ్వర్యంలో అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల పూలతో సుందరంగా ముస్తాబు చేసారు. బోనాల సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు బోనాలు సమర్పిస్తూ అమ్మవారిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేసారు. మహిళలు అందంగా ముస్తాబు చేసిన బోనాలు ఎత్తు కొని నృత్యాలు చేస్తు ర్యాలిగా వెల్లి ప్రత్యేకంగా కొలువైన ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. టిజిపిసిబి ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఓ.యు.ఎస్.ఇ.ఎ.) అధ్యక్షుడు సి.మధు గౌడ్ జనరల్ సెక్రెటరీ ఆర్.నవీన్ గౌడ్, వివేకానంద మూర్తి, రాజారమేష్, వెంకట్‌రావు, స్వామి, బాబుగౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో అధికారులు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు. పూజ అనంతరం ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

జల వివాదాల శాశ్వత పరిష్కారానికి కృషి : సీఎం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నెలకొన్న జల వివాదాల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. గోదావరి, కృష్ణా... వాటి ఉప నదులపై నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు... నిర్మాణ ప్రతిపాదనల్లో ఉన్న ప్రాజెక్టులు, ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల్లోని వివిధ అంశాల పరిశీలనకు ఇరు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, జల్‌శక్తి అధికారులతో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని సీఎం వెల్లడించారు. జల్‌శక్తి కార్యాలయంలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రులు, ఇరు రాష్ట్రాల నీటిపారుదలశాఖ మంత్రులు, ఉన్నతాధికారుల సమావేశం అనంతరం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం విలేకరులతో మాట్లాడారు. జల్‌శక్తి, ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల కమిటీ గోదావరి, కృష్ణా నదుల నీటి కేటాయింపులు, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఆ కమిటీ పరిశీలించి చర్చిస్తుందని సీఎం వెల్లడించారు. ఆ తర్వాత ఏ విధంగా ముందుకెళ్లాలనే దానిపై పైస్థాయిలో చర్చించాలని నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. కృష్ణా నది జలాల్లో ఏ రాష్ట్రం ఎంతమేర నియోగించుకుంటున్నదనే విషయంపై టెలీమెట్రీ యంత్రాలు ఏర్పాటు చేయాలని తాము ప్రతిపాదించగా... దానికి ఆంధ్రప్రదేశ్ అంగీకరించిదన్నారు. ఈ రకంగా ఒక సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు భద్రతకు సంబంధిం చి జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ), ఇతర సంస్థలు తెలిపిన వివరాలపై చర్చించి మరమ్మతుల విషయాన్ని ప్రస్తావించగా.. మరమ్మతులు చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అంగీకరించిందని సీఎం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం... తర్వాత కాలంలో జరిగిన అపెక్స్ కమిటీలో గోదావరి నది యాజమాన్య బోర్డు, కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయాలను ఒక్కో రాష్ట్రంలో ఒక్కోటి ఏర్పాటు చేయాలని పేర్కొన్నా రని.. గోదావరి నది యాజమాన్య బోర్డును తెలంగాణలో, కృష్ణానది యాజమాన్య బోర్డును ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని బుధవారం సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. బనకచర్లకు సంబంధించి తాము చేసిన ఫిర్యాదులపై కేంద్ర ప్రభుత్వం పరిధిలోని సంస్థలు స్పందించి అభ్యంతరాలు చెప్పినందున ఆ అంశమే ప్రస్తావనకు రాలేదని ఓ ప్రశ్నకు ముఖ్యమంత్రి బదులిచ్చారు. టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటు, శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు ఆంధ్రప్రదేశ్ అంగీకరించడం తెలంగాణ విజయమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. చర్చలు సహృద్భావ వాతావరణంలో జరిగాయని సీఎం తెలిపారు. సుహృద్భావం వాతావారణం చెడిపోతే బాగుండునని కొంతమందికి ఉందని... ఇరు రాష్ట్రాలు కొట్టుకుంటే తమకు బాగుంటుందని వాళ్లు అనుకుంటున్నారని... వారిని చూసి జాలిపడడం తప్ప ఏం చేయలేమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, అభిషేక్ మను సింఘ్వీ, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, డాక్టర్ కడియం కావ్య, సురేష్ షెట్కార్, గడ్డం వంశీకృష్ణ, పోరిక బలరాం నాయక్ పాల్గొన్నారు.

తెలంగాణ విశ్వవిద్యాలయానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ విశ్వవిద్యాలయంలో ప్రతిష్టాత్మకమైన రెండవ స్నాకోత్సవం విజయవంతమైందని వైస్ -ఛాన్సర్ ఆచార్య టి.యాదగిరిరావు తెలిపారు. విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన స్నాతకోత్సవ ప్రాంగణంలో స్నిఫర్ డాగ్ స్క్వాడ్ బృందం, బాంబు డిస్పోజల్ టీం, ఇంటలిజెన్స్ అధికారులు పర్యవేక్షణలో భారీ బందోబస్తు మధ్య అంగరంగ వైభవంగా స్నాతకోత్సవం పూర్తయింది. ఈ సందర్భంగా గవర్నర్ విశ్వవిద్యాలయ చాన్సర్ విష్ణుదేవ్ వర్మకి ఏడవ పటాలపు గాడ్ ఆఫ్ హెూనర్ టీం బ్యాండ్ టీంఆర్ఎస్ఐ కొమ్ము శ్రీకాంత్ ఆధ్వర్యంలో గౌరవ వందనం సమర్పించినారు. అనంతరం గవర్నర్ విశ్వవిద్యాలయ కులపతి మాన్య జిష్ణుదేవ్ వర్మ నాతకోత్సవాన్ని ఉద్దేశిస్తూ ప్రసంగిస్తూ రాష్ట్రం పేరుతో ఏర్పాటుచేసిన తెలంగాణ విశ్వవిద్యాలయానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని గర్వంగా చెప్తున్నానని తెలిపారు. చైతన్యవంతమైన ఈ మట్టిలోని ప్రజల ఆకాంక్షలు, సామర్థ్యాలు విశ్వవిద్యాలయ అభివృద్ధిలో స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ విశ్వవిద్యాలయం సాధించిన విజయాలు, విశేషమైన ప్రగతిపూర్వకమైన సంఘటనలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. 2006లో ఆరు కోర్సులతో ప్రారంభమై నేడు ఏడు విభాగాలలో 24 ఉపవిభాగాలుగా 31 కోర్సులతో బిక్నూరు సారంగపూర్ క్యాంపస్లతో సహా ఇక్కడ ప్రధాన క్యాంపస్‌లో విద్యా వికాసం చెందడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కొఠారి కమిషన్‌లో చెప్పినట్లుగా దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చిదిద్ద పడుతుందనేది విశ్వవిద్యాలయ విజయాలు రుజువు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన భారత రసాయన శాస్త్ర సాంకేతిక సంస్థ మాజీ డైరెక్టర్ ఆచార్య శ్రీవారి చంద్రశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నుండి బయటకు వెళ్లిన ప్రతి విద్యార్థికి ఆందోళనతో పాటు అవకాశాలు కనిపిస్తాయి అన్నారు.

నగరాన్ని గ్రీన్‌సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతిపౌరుడు సహకరించాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని క్లీన్, గ్రీన్‌సిటీగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ ప్రణాళికబద్ధంగా కృషి చేస్తుందని, ఇందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనీ కూకట్ పల్లి జోన్ షిరిడి హిల్స్ కాలనీలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఆర్‌వి కర్ణన్ వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. మొక్కల నీటి అవసరాలకు ఉద్దేశించిన బోరు మోటారును ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో వన మహోత్సవంలో భాగంగా ఈ సంవత్సరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా భాగస్వామ్యంతో 25 లక్షల మొక్కలను నాటడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సీజన్ మొత్తం మొక్కలు నాటుతామని చెప్పారు. లక్ష్య సాధనకు నగరంలో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. మొక్కలు నాటడంలో నగర పౌరులు క్రియాశీకల భాగస్వామ్యం కావాలన్నారు. ప్రతి ఒక్క పౌరుడు "ఏక్ ఫేడ్... మాకే నామ్" అనే నినాదంతో తమ తల్లి పేరుతో ఒక్కో మొక్క నాటాలన్నారు.మొక్కలను నాటడమే కాదు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మొక్కలు నాటడం వల్ల పిల్లలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించిన వారమవుతామన్నారు. ఆకుపచ్చని హైదరాబాద్ లక్ష్యంగా గ్రేటర్ పరిధిలో వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఆర్‌వి కర్ణన్ తెలిపారు. వార్డుల వారిగా వన మహోత్సవం లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రభుత్వ టార్గెట్‌ను పూర్తి చేస్తామని అన్నారు. మొక్కల నాటడం పైనే కాకుండా వాటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో భాగస్వామ్యమైన విద్యార్థులు "గో గ్రీన్" అంటూ నినాదాలు చేయగా వారితో కలిసి మేయర్, కమిషనర్‌లు ఫోటోలు దిగి అభినందించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, యుబిడి అదనపు కమిషనర్ సుభద్రా దేవి, కార్పొరేటర్ రావుల శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగరేణి భవన్, సింగరేణి ప్రధాన కార్యాలయం నుండి బుధవారం సింగరేణి అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్‌ల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్, డైరక్టర్(పా) గౌతమ్ పొట్రు సంస్థ కార్మికులకు సంబంధించిన అంశాలపై సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్, డైరక్టర్(పా) గౌతమ్ పొట్రు పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో కార్మికులకు సంబంధించిన సమస్యలను జాప్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని, విధులకు గైర్హాజరు అయ్యే కార్మికులు సక్రమంగా విధులకు హాజరయ్యేలా కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం డైరక్టర్(పా) గౌతమ్ పొట్రు 11 ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధిపతులతో ఏరియాల వారీగా విధులకు గైర్హాజరు అవుతున్న ఉద్యోగులకు తీసుకునే క్రమశిక్షణా చర్యలపై, కారుణ్య నియామకాల ద్వారా నియామకమైన మహిళా ఉద్యోగులకు నిర్దిష్టమైన పనులను కేటాయించే విషయంపై, పదవీ విరమణ పొందే ఉద్యోగుల సిఎంపిఎఫ్, పెన్షన్ క్లెయిమ్, గ్రాట్యుటీ, సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డులు, కారుణ్య నియామకాలు, ఏరియాల వారీగా గల క్వార్టర్స్ వివరాల వంటి అంశాలపై సమీక్షించారు. అలాగే కార్మికుల సంక్షేమనికి సంబంధించి ఎటువంటి ఫైల్స్ పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్మిక సంక్షేమం విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదు అని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో సింగరేణి భవన్ నుండి ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్, సింగరేణి ప్రధాన కార్యలయం నుండి డైరక్టర్(పా) గౌతమ్ పొట్రుతో పాటు జిఎం (సి డి ఎన్), ఈడి (కోల్ మూవ్మెంట్) ఎస్.డి.ఎం. సుభాని, జిఎం(పర్సనల్) ఇర్, పిఎం కవితా నాయుడు, జిఎం (పర్సనల్) ఆర్‌సి బెనెడిక్ట్ నికోలస్, జిఎం (పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, జిఎం (పర్సనల్) ఈఈ సెల్ ఏజిఎం మురళీధరరావు, ఏజిఎం(పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్, డిజిఎం (పర్సనల్)లు కే.అజయ్ కుమార్, కేసా నారాయణరావు, 11 ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధిపతులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు బిఆర్ఎస్ అండగా నిలబడుతుంది: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పార్టీకి అనుబంధంగా అనేక కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయం. ఈ దిశగా సింగరేణి ప్రాంతంలో ఉన్న పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు, మాజీ మంత్రులతో సమన్వయం చేసుకోవాలని బిఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ముగిసిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నేతల సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కోసం పార్టీ తరఫున ఇంచార్జీగా ఇకపై బొగ్గు గని కార్మిక సంఘం వ్యవస్థాపక సభ్యులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యవహరిస్తారని తెలిపారు. కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యకలాపాలను పార్టీ తరఫున ముందుకు తీసుకుపోవాలని నిర్ణయం తీసుకున్నారు. సింగరేణి సమస్యలపై మరింత పెద్దఎత్తున పోరాటం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేదాకా ప్రభుత్వంపై ప్రజాక్షేత్రంతో పాటు అనేక ఇతర రూపాల్లో ఒత్తిడి తీసుకురావాలన్న నిర్ణయించారు. పది సంవత్సరాల భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికుల కోసం, సింగరేణి సంస్థ కోసం చేసిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా కార్మికుల్లోకి తీసుకుపోవాలన్న కేటీఆర్ సూచన చేశారు. పది సంవత్సరాల కాలంలో సింగరేణితో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలన్న ఏకైక లక్ష్యంతో కేసీఆర్ పనిచేశారన్నారు.

షేక్ నసీర్ ఆకస్మిక మృతి జర్నలిజం రంగానికి తీరని లోటు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఫోటో జర్నలిస్టుగా కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నా సీనియర్ ఫోటోజర్నలిస్టు షేక్ నసీర్ ఆకస్మిక మృతి జర్నలిజం రంగానికి తీరని లోటు అని తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి లు పేర్కొన్నారు. గత 40 సంవత్సరాలు పైగా సమాజంలో జరుగుతున్నటువంటి మార్పులను వెలుగులోకి తీసుకుని వచ్చినటువంటి షేక్ నసీర్ మరణం పట్ల విచారం మరియు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఫోటో జర్నలిజంలో అనేక అవార్డులు అందుకున్నారని, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) జాతీయ కౌన్సిల్ సభ్యులుగా కూడా పని చేసాడని వారు గుర్తు చేసారు. ఈ సందర్భంగా హైదరాబాద్, మల్లేపల్లి లోని అయన నివాసంలో భౌతికకాయంపై ఫోటోజర్నలిస్టులందరు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

కేంద్రీయ అసుపత్రిని తనిఖీ చేసిన దక్షిణమధ్య రైల్వే జిఎం

విశాలాంధ్ర - హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం సికింద్రాబాద్‌లోని లాలాగూడలోని కేంద్రీయ రైల్వే హాస్పిటల్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో ఆయనతో పాటు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల రాజారాం హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, సెంట్రల్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ.శివనాగ ప్రసాద్ సీనియర్ వైద్యులు, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఓల్డ్ ఔట్-పేషెంట్ బ్లాక్ (ఓ.పి.డి)లో నున్న ఆప్టోమాలజీ, డెంటల్, ఈ.ఎన్.టి, చెస్ట్ క్లినిక్ వంటి మొదలగు క్లినిక్‌లను తనిఖీ చేశారు. జనరల్ మేనేజర్ కొత్త ఓ.పి.డి బ్లాక్‌లో, రేడియా లజీ యూనిట్, డాక్టర్ల కన్సల్టేషన్ గదులు, రిటైర్డ్ ఉద్యోగుల వెయిటింగ్ లాంజ్‌లను తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న చికిత్సకు సంబందించిన సౌకర్యాల గురించి ఆయన పెన్షనర్లు, కుటుంబ సభ్యులతో సంభాషించారు. ఇంకా మెరుగైన వైద్యం అందించడానికి అదనంగా కావాల్సిన సౌకర్యాల గురించి అభిప్రాయాన్ని వారి నుండి తీసుకున్నారు. జనరల్ మేనేజర్ అత్యవసర వార్డు (క్యాజువల్టీ), స్పెషల్ వార్డు, ఇంటెన్సివ్ కరోనరీ కేర్ యూనిట్ (ఐ.సి.సి. యూ), డయాలసిస్ యూనిట్, నూతనంగా ప్రారంభించబడిన కార్డియాక్ క్యాత్ ల్యాబ్ రికవరీ రూమ్‌ను తనిఖీ చేశారు. జనరల్ మేనేజర్ శుభ్రత, పని వాతావరణాన్ని పరిశీలించారు. కొంతమంది రోగులతో సంభాషించారు. వారికి అందుతున్న సౌకర్యాలు, చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. వీటితో పాటు పురుషుల మెడికల్ వార్డులు, ప్రసూతి వార్డు, న్యూబోర్న్ శిశువులకు సంబంధించిన నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ కూడా తనిఖీ చేశారు.

ట్రిగర్ పాయింట్ పుస్తకాన్ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి సోమన్న

విశాలాంధ్ర - బషీర్ బాగ్: రైలు, జల శక్తి మంత్రిత్వ శాఖ కేంద్ర రాష్ట్ర మంత్రి వి.సోమన్న చేతుల మీదుగా డా. వంశీ ధర్ నాలి రచించిన ట్రిగర్ పాయింట్ ది షూటర్'స్ హ్యాండ్‌బుక్ పుస్తకాన్ని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. డా. వంశీధర్ నాలి రచించిన ఈ పుస్తకం క్రీడా షూటింగ్, మానసిక ఏకాగ్రత, అత్యుత్తమ ప్రదర్శనపై అనుభవపూర్వక దృక్కోణాన్ని అందిస్తుందనీ పేర్కొన్నారు. యువతలో నియమం, క్రీడా సంస్కృతిని ప్రోత్సహించడంలో ఈ పుస్తకం పాత్రను మంత్రి ప్రశంసించారు.

గల్ఫ్ బాటలో ఒయాసిస్ డాక్యుమెంటరీ ఫిల్మ్ విడుదల

విశాలాంధ్ర - హైదరాబాద్ : గల్ఫ్ కార్మికుల సంక్షేమం గురించి సీఎం ఏ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన గల్ఫ్ భరోసా పథకాన్ని వివరించే 'గల్ఫ్ బాటలో ఒయాసిస్' అనే డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్ బుధవారం గాంధీ భవన్ లో విడుదల చేశారు. ఉత్తర తెలంగాణ లోని పలు గ్రామాలలో పర్యటించిన ప్రవాసీ మిత్ర ప్రొడక్షన్స్ చిత్ర బృందం, రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా పొందిన గల్ఫ్ మృతుల కుటుంబాల అభిప్రాయాలను చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంటరీ నిర్మాత, గల్ఫ్ వలస వ్యవహారాల నిపుణుడు మంద భీంరెడ్డి, డాక్యుమెంటరీకి దర్శకత్వం వహించిన ప్రముఖ చలనచిత్ర దర్శకులు పి. సునీల్ కుమార్ రెడ్డి, నిర్మాణ సహకారం అందించిన గల్ఫ్ జెఏసి నాయకులు చెన్నమనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిసి రోడ్డు రైల్వే బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో 71 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ గఅధికారులతో కలిసి పనుల పురోగతిని నాణ్యతను స్వయంగా పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ఈ సిసి రోడ్డు రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మైలార్‌దేవపల్లి నుండి శాస్త్రిపురం వట్టపల్లి వెళ్లే ప్రజలకు ప్రయాణ దూరం గణనీయంగా తగ్గుతుంది అని ఇది నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నం. ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, ప్రజలకు సులువైన వేగవంతమైన ప్రయాణాన్ని అందించడమే మా లక్ష్యం అని ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాము అని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాస్ డిఈ కార్తీక్ రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవికుమార్ ఈఈ నరేందర్ స్థానికులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి :కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలో చేయూత పెన్షన్ పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హరిచంద్ర దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహణపై ఆమె సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం మొత్తం 11 రకాల లబ్దిదారులకు వర్తిస్తుందని పేర్కొంటూ, మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల పురోగతిని పరిశీలించారు. అదేవిధంగా వివిధ దశల్లో ఉన్న దరఖాస్తుల పెండింగ్‌ను ఈ నెలాఖరుకల్లా పూర్తిగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. లబ్దిదారులు కనుగొనలేని సందర్భాల్లో సంబంధిత ఎంఆర్ఓ వారి పేరు మీద ధృవీకరణ నివేదిక ఇచ్చి, వారిని శాశ్వత వలసదారులుగా గుర్తించాల్సిందిగా ఆదేశించారు. మరణించిన లబ్దిదారుల వారసులను గుర్తించి, వారి పేరు మీద నిధులు మంజూరు చేయాలని సూచించారు. బాధిత కుటుంబా లకు వెంటనే లబ్ది అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చేయూత సెర్ప్ డైరెక్టర్ గోపాలరావు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముఖుంద రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, సంబంధిత ఎంఆర్ఓలు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండలం పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్పేట్, చందానగర్, భారతి నగర్ (పార్ట్) డివిజన్ల పరిధిలోని పలువురికి కళ్యాణ లక్ష్మి /షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన రూ.20,02,320 ల ఆర్థిక సహాయాన్ని లబ్దిదారులకు మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ చెక్కుల రూపేణా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది అని, సీఎం రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడ బిడ్డకు పెద్ద అన్న లాగా నిలుస్తారు అని కొనియాడారు. నిరుపేదల అడా బిడ్డల పెళ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా, మానవతా దృక్పథంతో కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ప్రవేశపెట్టడం జరిగినది అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పేదింటి వారి ఇండ్లలో సంతోషంతో ఆడ పిల్లల పెండ్లి జరగాలని సదుద్దేశంతో కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది అని కోరారు. రెవెన్యూ సిబ్బంది, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, అక్బర్ ఖాన్, ఎండీ ఇబ్రహీం, మల్లేష్ గుప్తా, రాజు నాయక్, సరేందర్ బల్లా, యూసఫ్, కాజా, సందీప్ రెడ్డి, మల్లేష్, గోపాల్ రావు, శివ, నరేష్, కార్యకర్తలు, లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిధులు విడుదల

విశాలాంధ్ర- కొత్తూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంలో భాగంగా ఇల్లు లేని నిరుపేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొదటి విడత నిధులను విడుదల చేసినట్లు కాంగ్రెస్ కొత్తూరు మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షులు జాండగూడెం సుదర్శన్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలు తెలిపారు. కొత్తూరు మున్సిపాలిటీ పరిధి 2వ వార్డుకు చెందిన మంగలి సునీత, 3వ వార్డుకు చెందిన గౌతపురం అనిత, కోస్గి శంకరయ్య,4వ వార్డు పి జయమ్మ, 10వ వార్డు కోట భవాని, 12వ వార్డు పాశం పార్వతమ్మ, వి సత్యనారాయణ లు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆన్లైన్ ద్వారా మొదటి విడత నిధులు లక్ష చొప్పున వారి ఖాతాల్లో జమచేసినట్టు ఆయన ప్రకటన వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చైతన్య ప్రభుత్వం అని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విడుదలవారీగా తప్పకుండా అమలు చేస్తుందని కొనియాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

విశాలాంధ్ర - మొయినాబాద్ : మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో గల సర్వేనంబర్ 176లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న పెన్సింగ్‌ను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అజీజ్ నగర్ సర్వే నంబర్ 176లో సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా ఆ భూమి చుట్టు పెన్సింగ్ వేస్తున్నారని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, గిర్దవర్ రాజేష్ ఆధ్వర్యంలో పెన్సింగ్‌ను తొలగించేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు. ఈ కూల్చివేతలో రెవెన్యూ సిబ్బంది భాస్కర్, చిరంజీవి తదితరులున్నారు.

బీసీ రిజర్వేషన్ అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ కోరారు. ఆప్ రాష్ట్ర కార్యాలయం నుండి విడుదల చేసిన ప్రకటనలో బీసీల రిజర్వేషన్ల అంశాన్ని తమ స్వార్థపూరిత రాజకీయ కోణంలో ఆలోచించకుండా బీసీలకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధితో ముందడుగు వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదాను రాష్ట్ర గవర్నర్ ఆమోదించాలని, తదుపరి చట్టం తీసుకవచ్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనీ చెప్పారు. బీసీలకు రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్రపతి వద్ద పెండింగ్ లోఉన్న బిల్లులను తక్షణమే ఆమోదం పొందేలా రాష్ట్రంలోని బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని అయన డిమాండ్ చేసారు. తమిళనాడు తరహా బీసీ రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్ లో చేర్చాలని అప్పుడే వారికీ న్యాయం జరుగుతుందని అన్నారు. రిజర్వేషన్లు అమలు చేయకపోతే ప్రతిఘటన తప్పదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డాక్టర్ దిడ్డి సుధాకర్ హెచ్చరించారు.

ఉప్పల్ ఫ్లై ఓవర్‌పై ప్రత్యేక శ్రద్ధ : మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్, మేడిపల్లి : ఉప్పల్ ఫ్లైఓవర్‌పై ప్రత్యేక శ్రద్ధ, ఆర్థిక వనరులతో ఫ్లైఓవర్ నిర్మాణంలో ఆలస్యం తమ ప్రభుత్వ హయాంలో శరవేగంగా ఉప్పల్ ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నారపల్లి వరకు 8 కిలోమీటర్ల మేరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పేనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో కలిసి ఫ్లైఓవర్ పనులను పరిశీలించారు. యాదగిరిగుట్ట భువనగిరి వరంగల్ హైవేపై దాదాపు 8 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఫ్లైఓవర్ పనులు ఆర్థిక వణరులు, ఇతర కారణాల వల్ల తీవ్ర జాప్యం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం రాగానే ఫ్లైఓవర్ పై ప్రత్యేక దృష్టి సారించి కేంద్ర మంత్రి నితిన్ ఘట్కారితో సైతం చర్చలు జరిపి పనుల్లో వేగం పెంచామన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మొన్నటి వరకు పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ను సైతం మార్చి కొత్తవారికి పనులు అప్పగించామని, ప్రత్యేక శ్రద్ధతో పనుల్లో వేగాన్ని పెంచి పరితగతిన పూర్తి చేస్తామన్నారు. నగరంలో పివి ఎక్స్ప్రెస్ హైవే తర్వాత అతిపెద్ద ఫ్లైఓవర్‌గా పేరున్న ఉప్పల్ ఫ్లైఓవర్ అన్నారు. వచ్చే దసరా నాటికి ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట

విశాలాంధ్ర - పటాన్ చెరువు : గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు సృష్టించి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా సమైక్య సంఘాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత అందిస్తోందని ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి విజయోత్సవాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని 618 మహిళ సమైక్యలకు 58 కోట్ల 24 లక్షల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాలు, 4255 మహిళ సమైక్య గ్రూపులకు మంజూరైన 11 కోట్ల ఎనిమిది లక్షల రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను ఆయా గ్రూపులకు అందజేశారు. వివిధ కారణాలతో మృతి చెందిన ఐదుగురు మహిళా సమైక్య సంఘాల సభ్యురాల కుటుంబాలకు 12 లక్షల 50 వేల రూపాయల విలువైన ఇన్సూరెన్స్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరువు నియోజకవర్గంలో 7 వేలకు పైగా మహిళా సమైక్య గ్రూపులు పనిచేయడం సంతోషకరమన్నారు. ఒక మహిళ చదువుతోపాటు ఆర్థిక క్రమశిక్షణ, ఆర్థిక స్వాతంత్రం కలిగి ఉంటే ఆ కుటుంబం ఉన్నత స్థాయికి చేరుకుంటుందని ఇందుకు మహిళా సమైక్య సంఘాలు సంపూర్ణ సహకారం అందిస్తున్నాయని తెలిపారు. భగవంతుడు సైతం మహిళలకు ప్రణమిల్లాల్సిందేనని తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజ, డిఆర్‌డిఎ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్, ఎంపీడీవోలు, తహసిల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్, ఐకెపి అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు పాల్గొన్నారు.

ఇంటికో ఇంకుడు గుంత లక్ష్యం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలి పరిధిలో 200 గజాల ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు అవసరం.. 300 గజాల పైన ఉన్న ప్రతి ప్రాంగణంలో ఇంకుడు గుంత తప్పనిసరి నిర్మాణం చేసుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశంతో, హైద్రాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మార్గదర్శకత్వంలో రానున్న 3 నెలలు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులలో వర్షాలు సకాలములో పడక పోవడంతో చాలా ప్రాంతాలలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దాంతో ట్యాంకర్ డిమాండ్ ప్రతి సంవత్సరం కొంత మేరకు క్రమంగా పెరుగుతోంది అని వివరించారు. గత ఏడాది ట్యాంకర్ అధికంగా బుక్ చేసిన ప్రాంతాలలో ట్యాంకర్ బుకింగ్ పెరిగిన కారణాల కోసం సర్వే నిర్వహిస్తే, బోరుబావుల మీద ఆధారపడి, భూగర్భ జలాలు అంటడిగి, బోరులు ఎండిపోయి జలమండలి ట్యాంకర్ల మీద ఆధారపడినట్లు గుర్తించారు. అందులో 42 వేల నివాసాలను గుర్తించి సగానికి పైగా ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు లేవని, మిగతావారు తమ ఇంకుడు గుంతలను ప్రతిఏటా వర్షాకాలంలో సరైన స్థితిలో నిర్వహించడం లేదని సర్వేలో తేల్చారు. ఓఆర్ఆర్ పరిధిలోని 200 గజాల ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించాలని, అలాగే 300 గజాల పైన ప్రతీ నివాసంలో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించుకునేలా అవగాహన కల్పించడానికి త్వరలో 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఎండీ తెలిపారు. ఇందుకోసం ఎన్జీఓల సహాయంతో ఇప్పటికే 12 వేల ఇంకుడు గుంతల నిర్మాణం, పునర్నిర్మాణం (మెంటనేన్స్) చేశామని, మరో 16 వేల మందికి ఇంకుడు గుంతలు నిర్మాణం కోసం నోటీసులు జారీ చేయడానికి కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. బుక్ చేసిన 24 గంటల్లో ట్యాంకర్‌ను డెలివరీ జరుగుతుందని, గతంలో వేసవిలో రోజుకు 11000 ట్యాంకర్లు 24 గంటలలో సరఫరా చేసామని, ప్రస్తుతం రోజుకు 8500 ట్యాంకర్ల డిమాండ్ ఉందని వివరించారు. సామాన్య ప్రజలు మంచినీరు సరఫరా, ట్యాంకర్లతో అందే నీటిపై ఆందోళన పడవద్దని ఈ సందర్భంగా ఎండీ విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వికలాంగులకు, పెన్షన్‌దారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ పెంచాలని వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరిలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 13న హైదరాబాదులో జరగనున్న వికలాంగుల, చేయూత పెన్షన్దారుల మహా గర్జన సభ విజయవంతం చేయాలని సన్నాహ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ పెన్షన్ దారులకు ఇచ్చిన హామీని రేవంత్ సర్కారు వెంటనే అమలు చేయాలని, లేదంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలుపొంది 19 నెలలు గడుస్తున్న ఇచ్చినా హామిని నిలబెట్టుకపోవడం సరికాదన్నారు. వికలాంగుల పెన్షన్ 6000, చేయూత పెన్షన్ 4వేలకు కండరాల క్షీణత వారికి పెన్షన్ 15 వేలకు పెంచాలని, వికలాంగులకు ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేయాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం, పెన్షన్ పెంపు ఆరు కిలోల బియ్యం, ఇలా పేదల కోసం ఎమ్మార్పీఎస్ అందించిన ప్రజా సంక్షేమ పథకాల విషయాలను ఈ సభలో వివరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎన్ వినయ్, ఎమ్మెస్ జిల్లా అధ్యక్షులు కేశపాగ రామచందర్ మాదిగ, కళా మండలి నాయకులు ఎస్.వై.అశోక్ మాదిగ, విహెచ్ పిఎస్ జిల్లా ఇన్చార్జి నరసింహ,ఎంజెఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ప్రణయ్ మాదిగ, బచ్చలకూర స్వామి, సిల్వేరి శ్రీను, కేశవ్ అంజి, యాదగిరి, సలోమి, పరశురాం, బాల నరసింహ పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మునిసిపాలిటీ పరిధిలోని మోడల్ కాలనీ, చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలోని ప్రభుత్వ దవాఖానలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచి ఆకుపచ్చని తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. వన మహోత్సవం కార్యక్రమం కింద పెద్ద ఎత్తున ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలోని మున్సిపల్ కమిషనర్ వెంకటేశం, చేవెళ్ల, ముడిమ్యాల పిఏసిఎస్ చైర్మన్లు దేవర సమతా వెంకటరెడ్డి, చైర్మన్ ప్రతాపరెడ్డి, మాజీ సర్పంచ్, శైలజా ఆగిరెడ్డి, ఆలూరు మాజీ సర్పంచ్ నరసింహులు, చేవెళ్ల ఎమ్మార్వో కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎం శ్రీనివాస్ యాదవ్

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులుగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కొనసాగుతున్న మజ్జిగ శ్రీనివాస్ యాదవ్‌ను ఎంపిక చేశారు. ఆల్ యూనివర్సిటీస్ అధ్యక్షుడిగా ప్రస్తుతం కొనసాగుతున్న జ్ఞానేశ్వర్ వ్యక్తిగత కారణాల వల్ల ఆ పదవి నుంచి తప్పుకోవడంతో ఆయన స్థానంలో శ్రీనివాస్ యాదవ్‌ను అధ్యక్షునిగా నియమించారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, తనను ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

దేశంలో మొట్టమొదటి లాంగ్ డిస్టెన్స్ రోబోటిక్ బేరియాట్రిక్ టెలి సర్జరీ

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : 2025 ఇండియా ప్రెసిడెంట్, బేరియాట్రిక్, రోబోటిక్ సర్జన్లలో మార్గదర్శకుడు డాక్టర్ మోహిత్ భండారి ప్రపంచంలోని మొదటి సుదూర రోబోటిక్ బేరియాట్రిక్ టెలి సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. ఇది ప్రపంచ సర్జరీ సంరక్షణ, యాక్సెస్ లో కొత్త భవిష్యత్తును పునర్నిర్వచించే మైలురాయి. రోబోటిక్ కన్సోల్ ఉపయోగించి డాక్టర్ భండారీ 850 కిలోమీటర్లకు పైగా ఇండోర్‌లో ఉన్న ఒక రోగిపై సంక్లిష్టమైన గ్యాస్ట్రిక్ బైపాస్‌ను నిర్వహించారు. జీరో పర్సెప్టిబుల్ ల్యాగ్, పూర్తి శస్త్రచికిత్స ఖచ్చిత త్వంతో అమలు చేశారు. కొత్త తరం, భారతదేశంలో అభివృద్ధి చేసిన రోబోటిక్ శస్త్రచికిత్స ప్లాట్ఫామ్ అయిన ఎస్ఎస్ఐ మంత్ర ఎం 3 వ్యవస్థను ఉపయోగించి ఈ ప్రక్రియ జరిగింది. మెడికల్ రోబోటిక్స్, డిజిటల్ ఆరోగ్యంలో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న సామర్థ్యాలను హైలైట్ చేయడమే కాకుండా, అధిక-కష్టం ఉన్న డొమైన్లలో రిమోట్‌గా దూరం నుంచి శస్త్రచికిత్స సంరక్షణ కోసం కొత్త ప్రపంచ ప్రమాణాలను స్థాపించింది. ఈ మైలురాయి ఆపరేషన్ రెండు ప్రధాన భారతీయ నగరాల మధ్య సుదూర రోబోటిక్ బేరియాట్రిక్ టెలిసర్జరీ మొదటి డాక్యుమెంట్ కేసును సూచిస్తుంది. 30,000 బేరియాట్రిక్, మెటబాలిక్ విధానాలను చేసిన డాక్టర్ భండారీ, ఈ ప్రత్యేకతలో ఆసియా-పసిఫిక్ లోనే అత్యంత అనుభవజ్ఞుడైన సర్జన్. అతను రోబోటిక్ బేరియాట్రిక్ శస్త్రచికిత్సను భారతదేశానికి పరిచయం చేశాడు. దీనిపై డాక్టర్ మోహిత్ భండారీ మాట్లాడుతూ, “శస్త్రచికిత్స చేయడంలో విప్లవాత్మకంగా మార్చడంలో రోబోటిక్ టెలిసర్జరీ యొక్క పరివర్తన సామర్థ్యానికి ఈ విజయం నిదర్శనం, నిపుణులైన శస్త్రచికిత్సలు అదే సమయంలో ఇతర భౌగోళిక ప్రాంతాలలో పనిచేయడానికి వీలు కల్పిస్తుంది. పట్టణ, ప్రాంతీయ సంరక్షణ కేంద్రాలను నిరాటంకంగా అనుసంధానం చేస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా శస్త్రచికిత్సా నైపుణ్యానికి యాక్సెస్ ను ఎలా అందుబాటులోకి తీసుకురావాలో ఇది మంచి ఉదాహరణ అన్నారు.

ఇందిరమ్మ మోడల్ కాలనీలు ఏర్పాటుకు

జాయింట్ టీం సర్వే నివేదిక అందించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లాలోని ఇందిరమ్మ మోడల్ కాలనీ చేపట్టుటకు జిహెచ్ఎంసి రెవెన్యూఅలాగే హౌసింగ్ అధికారులు స్లం ఏరియాలలో జాయింట్ సర్వే చేసి నివేదిక అందించాలని గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. బుధవారం హైదరాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా చేపట్టే ఇందిరమ్మ మోడల్ కాలనీల నేపథ్యంలో గుర్తించినటువంటి స్లం ఏరియాలలో జాయింట్ టీం సర్వే చేపట్టి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వివరాలు అందజేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇండ్లు మంజూరు కాగా జిల్లాలలో దాదాపు లక్ష యాభై వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లాలోని ఇందిరమ్మ మోడల్ కాలనీలో నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 106 స్లం ఏరియాలలో తాత్కాలికంగా నిర్మించుకున్న ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి జాయింట్ టీం వచ్చే శనివారం నాటికి నివేదిక అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3500 చొప్పున ఇల్లు నిర్మించేందుకు సంసిద్ధంగా ఉందని జాయింట్ టీం పక్కాగా సర్వే చేసి వచ్చే శనివారం నాటికి నివేదికలు అందించాలని ఆమె ఆదేశించారు. అదేవిధంగా గుర్తించిన లబ్దిదారులకు జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిహెచ్ఎంసి జాయింట్ కమిషనర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ రెవిన్యూ ముకుంద రెడ్డి, డి ఆర్ ఓ వెంకటాచారి, సూపరిండెంట్ ఇంజనీర్ హౌసింగ్ వెంకట్ దాసు రెడ్డి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, పిడి హౌసింగ్ విజయ్ కుమార్, జిహెచ్ఎంసి అధికారులు, తహసిల్దార్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

శ్రద్ధగా చదవండి.. భవితవ్యాన్ని గెలవండి

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: విద్యార్థులు శ్రద్ధగా చదివి భవితవ్యాన్ని గెలవాలని జెఎన్టియూ ప్రొఫెసర్ డాక్టర్ శోభారాణి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలం రాయికల్ గ్రామ పరిధిలోని మూన్ రే ఫార్మసిటికల్ కళాశాల చైర్మన్ పర్వత్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెఎన్టియూ ప్రొఫెసర్ డాక్టర్ శోభారాణి హాజరై ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ కళాశాల నిర్వాహకులు ఉపకార వేతనాలు సమయానుకూలంగా రాకపోయినా విద్యార్థుల చదువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని సదుపాయాలు కల్పించాలని, రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా ఇతర అత్యాధునిక సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పర్వత్ రెడ్డి మాట్లాడుతూ... 2007లో 60 మంది విద్యార్థులతో ఈ కళాశాల ప్రారంభమై అంచలంచలుగా ఎదిగిందని పేర్కొన్నారు. విద్యను అందించే విషయంలో కానీ, సదుపాయాల విషయంలో కానీ రాష్ట్రంలోని టాప్ టెన్‌లో తమ కళాశాల ఉందని స్పష్టం చేశారు. త్వరలోనే కళాశాలలో ఆర్ఎన్‌పీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. షాద్ నగర్ ప్రాంతంలో 200 నుంచి 300 వరకు పరిశ్రమలు ఉన్నాయని, ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు ఈ ప్రాంతంలోనే ఉద్యోగాలు దొరికే అవకాశం ఉందని అన్నారు. కళాశాలలో ఏర్పాటుచేసిన సంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సాయి కృష్ణ, అధ్యాపక బృందం విద్యార్థులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుమాల్యకు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం ప్రదానం

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రభుత్వేతర రంగసంస్థ సహకారంతో తెలుగు వెలుగు సాహితి వేదిక ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు, నటసార్వభౌమ ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని హైదరాబాదలో జాతీయ పురస్కారాలను అందజేశారు. అన్నమరాజు సుమాల్యకు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, గోల్డ్ మెడల్ తోపాటు తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్లో సుమా ల్య పేరును నమోదు చేస్తూ ఘనంగా సత్కరించారు. ఈ పురస్కారం తెలుగు వెలుగు సాహితీ వేదిక వ్యవస్థాపకుడు పోలోజు రాజ్‌కుమార్ సమక్షంలో వంగాల శాంతికృష్ణ ఆచార్య ఆధ్వర్యంలో బహూకరించారు.

పేదల నివాస స్థలాల్లోని ఇళ్లను నిర్మించి ఇవ్వాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: పేదల నివాసాల స్థలాల్లోనే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అఖిల భారత ప్రజాతంత్ర సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. శేర్లింగంపల్లి మండలం గచ్చిబౌలి డివిజన్ గౌవిలుదొడ్డి విలేజ్ పరిధిలోని బసవతారక నగర్ బస్తి వాసులు ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని సందర్శించి అనంతరం వారిని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పేద ప్రజలు నివసిస్తున్న ప్రజలకు కావలసిన నివాస స్థలాన్ని ఇక్కడే ఇచ్చి వారికి ఇండ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం సాయం చేయాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం వామపక్ష పార్టీలు సిపిఎం, సిపిఐ, ఎం సి పి ఐ యు ఆధ్వర్యంలో సంఘీభావ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకురాలు వామపక్ష నాయకులు మాట్లాడుతూ బసవతారక నగర్ ప్రజలు నివసిస్తున్న ప్రాంతాన్ని ప్రభుత్వ యంత్రాంగం ప్రభుత్వ భూమిగా గుర్తించడం తమ పోరాటానికి గుర్తింపును తెచ్చిందని వారు అన్నారు. వామపక్ష పార్టీలు ఆధ్వర్యంలో అనునిత్యం పేదల పక్షాన పోరాటం నిర్వహిస్తూనే ఉన్నామని వారు గుర్తు చేశారు. పేదల పక్షాన అనునిత్యం పోరాటం చేసే ఎర్రజెండాను ప్రజల వద్దకు మరింత ముందుకు తీసుకెళ్తామని వారు తెలిపారు. బసవతారక నగర్ ప్రజలపై కొంతమంది పాలకపక్ష నాయకులు ప్రతిపక్ష నాయకులు వారిపై కపట ప్రేమ కురిపిస్తూ వారి ఇంటి స్థలాన్ని కాచేయాలని ప్రయత్నం చేశారని వారు ఆరోపించారు. వారి వెంటనే ఉంటూ మీకు మెయిల్ చేస్తామని అనేక దొంగ హామీలు ఇచ్చారని వారు గుర్తు చేశారు. ప్రజలు ఏ పార్టీ ఎవరి పక్షాన పోరాడుతారో గుర్తుంచుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ వామపక్ష సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి, యువజన శ్రేణులు...

సీఆర్ విగ్రహానికి నివాళి

కదం తొక్కిన సీపీఐ శ్రేణులు

మోదీ సర్కారు వైఫల్యం

- దేశసంపద బడాబాబులకు దోచిపెట్టడంలో సఫలం
- ఆర్థికస్థితిపై తప్పుడు ప్రచారం
- అప్పుల కోసమే చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు
- 'డబుల్ ఇంజన్'తో రాష్ట్రానికి ఒరిగిందేమీలేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: దేశాన్ని ప్రగతిపథాన నడిపించడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని, కేవలం విచ్ఛిన్న రాజకీయాలతోనే పాలన సాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీ విజయవాడ నగర సమితి 24వ మహాసభలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న చంద్ర రాజేశ్వరరావు కాంస్య విగ్రహానికి నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు, ఇరత నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
అనంతరం పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి లెనిన్ సెంటర్ వరకు పార్టీ జెండాలు, నినాదాలతో కూడిన బ్యానర్లు చేతపట్టుకుని ఎర్ర దండు నిర్వహించిన భారీ ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. తొలుత ప్రజానాట్యమండలి నాయకులు ఆలపించిన విప్లవ గేయాలు ఆలోచింపజేశాయి. లెనిన్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ... దేశ ఆర్థిక పురోగతిపై ప్రధాని మోదీ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. జపాన్‌తో పోల్చి ప్రపంచంలోనే ఆర్థిక వృద్ధిలో నాలుగవ స్థానంలో ఉన్నామని ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. 2014 ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు ఒక్కటి కూడా మోదీ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. 2కోట్ల మందికి ఉద్యోగావకాశాలు, విదేశీ బ్యాంకుల్లో నల్ల ధనం తీసుకువచ్చి ప్రజలకు పంచుతామ హామీల అమలు గాలికొదిలేశారన్నారు. మోదీ 11సంవత్సరాల పాలనలో అన్ని రంగాల్లోను విఫలం చెందారని కేవలం అదానీ, అంబానీలకు, కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెట్టడంలో సఫలం అయ్యారని పేర్కొన్నారు. దేశంలో 1శాతం ఉన్న బడాబాబుల చేతుల్లో 40శాతం సంపద ఉందని, 50శాతం ఉన్న ప్రజల వద్ద మాత్రం 3శాతం సంపద మాత్రమే ఉందన్నారు. కార్పొరేట్లకు మోదీ ఊడిగం చేయడం తప్ప దేశ ప్రజలకు చేసేందేమీ లేదన్నారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి లౌకిక రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు చేయడం, మనుస్మృతి విధానాలతో పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశంలో అనేక కులాలు, మతాలకు చెందిన ప్రజలు ఐక్యంగా ఉన్నారంటే కేవలం బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగతోనే అని తెలిపారు. మోదీ, బాబు డబుల్ ఇంజన్ సర్కార్ రాష్ట్రాన్ని అప్పులు రాష్ట్రంగా మార్చేసిం దని... సంవత్సరం కాలంలో చంద్రబాబు ఢిల్లీకి 21సార్లు వెళ్లడం జరిగిందని... కేవలం అప్పులు కోసమే ఈ పర్యటనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రుల్ని కలిసి రూ.3600కోట్లు అప్పు తేవడంలో చంద్రబాబు విజయవంతమయ్యారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ప్రాజెక్టులను ప్రక్కన పెట్టి బసకచర్ల ప్రాజెక్టు నిర్మాణం అంశాన్ని తెర మీదకు తీసుకురావడాన్ని తప్పుబట్టారు. ఆపరేషన్ బుడమేరు అంశాన్ని విస్మరించారని, పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడం సరికాదన్నారు. అమరావతి రాజధాని పేరుతో ఇప్పటికే రైతుల నుంచి 56వేల ఎకరాలు తీసుకున్నారని, భూములు ఇచ్చిన వారికి న్యాయం జరగలేదన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం కోసం మరో 40వేల ఎకరాలు భూ సేకరణ, మెట్రో రైలు అంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని విమర్శించారు. సంవత్సరకాలంలో చంద్రబాబు చేసిందేమీ లేదని మోదీ మెప్పు కోసం యోగా ప్రాజెక్టును చేపట్టి సక్సెస్ అయ్యారని తెలిపారు. 20రోజుల పాటు అధికారులను ప్రజలకు అందుబాటులో లేకుండా చేశారని విమర్శించారు. చంద్రబాబు కంటే మోదీ 100రెట్లు తెలివిగలవారని, యోగాను ఒలిపింక్స్‌లో చేర్చడానికి ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. బాబు మోదీ ఇరువురు ఒకర్నొకరు పొగుడుకోవడం తప్పితే రాష్ట్ర అభివృద్ధిని విస్మరించారని అన్నారు. ప్రభుత్వ విధానాల్లో డొల్లతనాన్ని పార్టీ శ్రేణులు ప్రజల్లో తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. చండీగఢ్‌లో జరగనున్న సీపీఐ జాతీయ మహాసభలో మోదీ ప్రభుత్వ వినాశకర విధానాలపై చర్చించి... కీలక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతోందని తెలిపారు. ఆగస్టులో ఒంగోలులో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారానికి పార్టీ అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. విజయవాడ నగరాభివృద్ధికి కమ్యూనిస్టులే కారణమన్నారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక దోపిడి యథేచ్ఛగా సాగుతోందని, మద్యం అమ్మకాలతో వచ్చిన డబ్బులతో మహిళలకు పథకాలు అమలు చేయదాన్ని తప్పుబట్టారు. సూపర్ సిక్స్ పథకాలు అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చేందిందని అన్నారు. ఈ మహాసభలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, సహాయ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు తదితర నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏఐటీయూసీ అధ్వర్యంలో హమాలీలు

ప్రదర్శనలో ఓ భాగం

ప్రదర్శనలో అగ్రభాగాన నాయకులు

ప్రజానాట్యమండలి కళాకారుల గీతాలాపన

బహిరంగసభ వేదికపై నృత్యప్రదర్శన

15 నుంచి పుస్తక మహోత్సవం

విశాలాంధ్ర-ఒంగోలు: పుస్తక మహోత్సవాన్ని ఆగస్టు 15 నుంచి 24వ తేదీ వరకు స్థానిక పీవీఆర్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్టు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు, కార్యదర్శి లక్ష్మయ్య, మనోహర్ నాయుడు తెలిపారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక గ్రంథాలయశాఖ సంయుక్త అధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. దీనిలో భాగంగా మూడవ పుస్తక మహోత్సవ గోడపత్రికను బుధవారం తన ఛాంబర్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రతిరోజూ మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రముఖ పుస్తక ప్రచురణకర్తలు వంద స్టాల్స్ వరకు ఏర్పాటు చేస్తారన్నారు. ప్రతిరోజూ సాయంత్రం సాహిత్య, సాంస్కృతిక విజ్ఞాన కార్యక్రమాలు, సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పుస్తకాలు చదవడంపై మక్కువ పెంచాలనే ఉద్దేశ్యంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వర రావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, కార్యదర్శి ఆర్.రామకృష్ణ, రచయితల సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్. నారాయణ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి అలుగుల సురేశ్ పాల్గొన్నారు.

మోదీ మతోన్మాద విధానాలతో ముప్పు

- ప్రమాదంలో దేశం, రాజ్యాంగం
- స్మార్ట్ మీటర్లు రద్దు చేసే వరకు ఉద్యమం: డేగా ప్రభాకర్, దుర్గాభవాని
- ఘనంగా సీపీఐ కాకినాడ జిల్లా మహాసభలు
- ప్రజా ప్రదర్శనతో ఎరుపెక్కిన సామర్లకోట

విశాలాంధ్ర-సామర్లకోట: మోదీ ప్రభుత్వ మతోన్మాద విధానాలతో దేశం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ విమర్శించారు. స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేసేంత వరకు ఉద్యమిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.దుర్గాభవాని పిలుపునిచ్చారు. సీపీఐ కాకినాడ జిల్లా ద్వితీయ మహాసభలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రజా ప్రదర్శనతో సామర్లకోట ఎరుపెక్కింది. స్థానిక నేలమ్మ చెరువుగట్టు వద్ద బహిరంగ సభకు పార్టీ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోదకొండ అధ్యక్షత వహించారు. అనంతరం ప్రజా ప్రదర్శన జరిగింది. వందలాది మంది కదం తొక్కారు. డప్పులతో, ప్రజానాట్యమండలి కళాకారుల విప్లవ గేయాలతో నీలమ్మ చెరువు వద్ద నుంచి ప్రారంభమైన ప్రజా ప్రదర్శన విగ్నేశ్వర థియేటర్, మటన్ సెంటర్ మీదుగా స్టేషన్ సెంటర్‌కు, అక్కడ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వద్ద రైతు భవన్‌కు చేరుకుంది. దారి పొడవునా దిక్కులు పెక్కుటెళ్లేలా నినాదాలు మార్మోగాయి. సీపీఐ పట్టణ కార్యదర్శి పెద్దిరెడ్డి సత్యనారాయణ ముందుండి నడిపించారు. సభలో డేగా ప్రభాకర్ ప్రసంగిస్తూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. 11ఏళ్లల్లో 68 సార్లు విదేశాలకు వెళ్లిన మోదీ... ఇప్పటివరకు మణిపూర్‌కు వెళ్లలేదన్నారు. దేశంలో ప్రతి 45 నిమిషాలకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నా పాలకులకు పట్టడం లేదన్నారు. కార్పొరేట్‌లకు రూ.15 లక్షల కోట్లు దోచి పెట్టారు కానీ అందులో ఒక వంతు రైతులకు ఇవ్వలేకపోయారు. అదే జరిగితే ఆత్మహత్యలు తప్పేవని డేగా ప్రభాకర్ అన్నారు. సీఎం చంద్రబాబు 21సార్లు ఢిల్లీ వెళ్లారు కానీ రూపాయి తేలేదని, అప్పు మాత్రం రూ.31వేల కోట్లకు పెంచారు, మరో రూ.34వేల కోట్ల రుణం తీసుకునేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. రాజధాని పేరుతో మోదీ రెండు సార్లు శంకుస్థాపన చేసినా రాష్ట్రానికి ఇచ్చినదేమీ లేదన్నారు. అటు మోదీ, ఇటు చంద్రబాబు పొగడ్తలతోనే సరిపెడుతున్నారని డేగా ప్రభాకర్ వ్యాఖ్యానించారు. దుర్గాభవాని మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేసేంత వరకు ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ప్రజా సంఘాలు, వామపక్షాలు కలిసి ఉద్యమాన్ని సాగిస్తాయన్నారు. టు అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చర్జీలు, అదానీ కంపెనీతో సఖి ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలని దుర్గా భవాని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీకి విశిష్టమైన ప్రాధాన్యత ఉందన్నారు. సామర్లకోటకు ఉద్యమాల చరిత్ర ఉందని అన్నారు. వక్తల్లో సీనియర్ నాయకుడు కిర్ల కృష్ణారావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, పీఎస్ నారాయణ, టి.అన్నవరం, పప్పు ఆదినారాయణ తదితరులు ఉన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు మడగల రమణ, పెదరెట్ల అర్జున్ రావు, సర్ప సూరిబాబు, అడపా చిట్టిబాబు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కామిరెడ్డి బోదకొండ మళ్లీ ఎన్నిక

సీపీఐ కాకినాడ జిల్లా కార్యదర్శిగా కామిరెడ్డి బోదకొండ ఎన్నికయ్యారు. ఆయన రెండవసారి పదవీ బాధ్యతలు చేపట్టారు. జిల్లా సహాయ కార్యదర్శిగా తోకల ప్రసాద్ ఎన్నికయ్యారు.

హామీల అమలుకు పోరాడుదాం

- ఆర్ఎస్ఎస్ భావజాలం ప్రజలపై రుద్దుతున్న మోదీ
- కేంద్రానికి చంద్రబాబు వత్తాసు: జల్లి విల్సన్

విశాలాంధ్ర - చీరాల: ఎన్నికల ముందు కూటమి నేతలు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. చీరాల సీనియర్ సిటిజన్ కార్యాలయంలో బాపట్ల జిల్లా సమితి సమావేశం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ... హామీల అమలుకు పోరాడేందుకు సమాయత్తం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చేందుకు అమలుసాధ్యంకాని హామీలిచ్చి గద్దెనెక్కిన తరువాత హామీ అమలుకు కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రధాని మోదీ... ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీల భావజాలాన్ని ప్రజలపై రుద్దుతున్నారన్నారు. పెహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను ఇండియన్ ఆర్మీ, త్రివిధ దళాలు మట్టుపెడితే తాను చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నాడన్నారు. కేంద్రం చేసే ప్రతి పనికి ముఖ్యమంత్రి చంద్రబాబు వత్తాసు పలుకుతున్నారన్నారు. యోగా డే కోసం రూ.400 కోట్లు ఖర్చు చేశారన్నారు. పోలవరం, అమరావతికి కేంద్రం నిధులు ఇవ్వడం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సనాతన ధర్మం గురించి మాట్లాడుతూ బీజేపీ ఏది చెబితే అది చేస్తున్నారన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేంద్రంతో కొట్లాడి నిధులు తెచ్చుకుంటుందన్నారు. సీపీఐ కార్యకర్తల బలాన్ని ప్రభుత్వం గుర్తుంచుకునేలా అద్దంకిలో జిల్లా రెండవ మహాసభకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. పింఛన్లు, నివేశన స్థలాలు, గృహనిర్మాణం తదితర పథకాలను ప్రతిపాదించింది సీపీఐ అని, వాటిని చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకుని అధికారం లోకి వచ్చాడని అన్నారు. వైసీపీ వలంటీర్ల ను నమ్ముకుని ప్రజలకు దూరం అయిందన్నారు. పేదలకు పల్లెల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు నివేశన స్థలాలు కేటాయించి, గృహనిర్మాణానికి ఆర్థిక సాయంగా రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ సరియైన ప్రణాళికతో జిల్లా రెండవ మహాసభకు ప్రతి నియోజక వర్గం నుంచి ప్రజలు వచ్చేలా కృషి చేసి విజయవంతం చేద్దామన్నారు. కార్యకర్తలతో ప్రదర్శన నిర్వహిద్దామన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల శామ్యూల్, ముస్తఫా, మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ జె.రత్నకుమారి, అద్దంకి నియోజక వర్గ కార్యదర్శి చంద్రశేఖర్, ఆహ్వాన సంఘం కోశాధికారి కె.ఎల్.డి.ప్రసాద్, వై.శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మేకల బిజిలి బాబు, చీరాల నియోజకవర్గ కార్యదర్శి చిరమల ప్రకాష్ బాబు, సహాయ కార్యదర్శి కె.వీరాంజనేయులు, ఏఐటీయూసీ కార్యదర్శి బాసి పైడయ్య, శాంతి, లక్ష్మీ పాల్గొన్నారు.

బెంగాల్ భారత్‌లో భాగం కాదా?

సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా: బెంగాలీల పట్ల బీజేపీ వైఖరికి తాను సిగ్గుపడుతున్నానని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే ప్రజలపై జరుగుతున్న వేధింపులకు వ్యతిరేకంగా బుధవారం కోల్‌కతాలో భారీ నిరసన ర్యాలీ జరిగింది. సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలో జరిగిన నిరసన ర్యాలీలో టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఆ పార్టీ సీనియర్ నేతలతోపాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రసంగించారు. బెంగాలీ మాట్లాడే వారందరినీ బంగ్లాదేశీ రోహింగ్యాలు అని బీజేపీ పిలుస్తున్నదని విమర్శించారు. రోహింగ్యాలు మయన్మార్‌లో నివసిస్తారని తెలిపారు. పశ్చిమ బెంగాల్ పౌరులందరికీ సరైన గుర్తింపు కార్డులు, గుర్తింపు ఉన్నాయని అన్నారు. 'బెంగాల్ బయటకు వెళ్లిన కార్మికులు స్వయంగా వెళ్లలేదు. వారికి నైపుణ్యాలు ఉన్నందున వారిని నియమించారు. బెంగాలీ మాట్లాడే వారిని అరెస్టు చేసి జైలులో పెడుతున్నారు. ఎందుకు? పశ్చిమ బెంగాల్ భారతదేశంలో భాగం కాదా?' అని ప్రశ్నించారు. బెంగాలీల పట్ల బీజేపీ వైఖరికి తాను సిగ్గుపడుతున్నానన్నారు. మరోవైపు ఆ రాష్ట్రంలోని జిల్లాల్లో కూడా టీఎంసీ అధ్వర్యంలో ఇలాంటి నిరసన కార్యక్రమాలు జరిగాయి. ప్రధాని మోదీ పశ్చిమ బెంగాల్ పర్యటనకు ఒక రోజు ముందు ఈ నిరసనలు జరుగడం ప్రాధాన్యత సంతరించుకున్నది. బెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

నిమిషను క్షమించరాదు

హత్యకు గురైన యెమెన్ వ్యక్తి సోదరుడు

న్యూఢిల్లీ: 2017లో కేరళ నర్సు నిమిష ప్రియ చేతిలో హత్యకు గురైన యజమాని తలాల్ అబ్దో మెహదీ సోదరుడు అబ్దేల్‌ఫట్టా మెహదీ, ఈ నేరానికి క్షమాపణ ఉండదని నొక్కి చెప్పారు. నిమిష ప్రియను ఉరితీయాలని ఆయన అన్నారు. దోషిగా తేలిన నిమిషను భారతీయ మీడియా బాధితురాలిగా చిత్రీకరించడం పట్ల తన కుటుంబం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు అబ్దేల్‌ఫట్టా పేర్కొన్నారు. కాగా, నిమిష ప్రియకు బుధవారం ఉరిశిక్ష అమలు చేయాల్సి ఉంది. కానీ బహుముఖ చర్చల కారణంగా ఆమె ఉరిశిక్షను నిలిపివేశారు. సౌదీ అరేబియాలోని ఏజెన్సీలతో పాటు భారత ప్రభుత్వం పూర్తి మద్దతు, యెమెన్‌లోని షూరా కౌన్సిల్‌లోని ఒక స్నేహితుడిని మధ్యవర్తిత్వం కోసం సంప్రదించిన గ్రాండ్ ముఫ్తీ అబూబకర్ ముస్లియార్ మతపరమైన జోక్యం ఫలితంగా తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఉరిశిక్షను వాయిదా వేయాలనే నిర్ణయం తీసుకున్నారు. ఇదిలాఉంటే... నిమిష ప్రియను క్షమించగలిగేది మృతుడి కుటుంబమే. అయితే, ఆయన కుటుంబంలో అభిప్రాయ భేదాలు తలెత్తడంతో అధికారులతో పాటు, చర్చలలో పాల్గొన్న మతపరమైన వ్యక్తులు ఈ సమస్యను పరిష్కరించడానికి తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. అటు, కేరళ బిలియనీర్ ఎంఏ యూసుఫ్ అలీ కూడా ఈ విషయంలో అవసరమైన ఆర్థిక సహాయం అందించడానికి తన సంసిద్ధతను వ్యక్తం చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.